



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083


# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్
Navabhoomi daily fallows..
హైదరాబాద్ | 16 శనివారం | ఆగస్టు 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 332
Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur




## రూ.లక్ష కోట్లతో కొత్త పథకం

### మోదీ పంద్రాగస్టు కానుక



- ఎర్రకోటపై మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం
- లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' ప్రారంభం
- మొదటిసారి ఉద్యోగం పొందిన వారికి రూ.15,000 సహాయం
- రెండేళ్లలో 3.5 కోట్ల మంది లబ్ధిదారుల లక్ష్యం
- ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం పథకానికి క్యాబినెట్ ఆమోదం

2


**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని.. దేశంలోని యువతకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుభవార్త అందజేశారు. రూ.లక్ష కోట్లతో కొత్త పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఢిల్లీలోని ఎర్రకోట నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని.. 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన' పేరుతో యువత కోసం పథకాన్ని తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రయివేట్ సెక్టార్‌లో తొలిసారి ఉద్యోగ రంగంలోకి చేరిన యువతీ యువకులకు రూ.15,000 కేంద్రం అందజేయనుంది. ఈ పథకం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రధాని వెల్లడించారు. దీని ద్వారా దేశంలోని 3.5 కోట్ల మందికి లబ్ది చేకూరనుందని వివరించారు. "ఈ రోజు ఆగస్టు 15.. దేశంలోని యువత కోసం లక్ష కోట్ల రూపాయాలతో కొత్త పథకం ప్రారంభిస్తున్నాం.. మీకు ఇది శుభవార్త.. ఎందుకంటే ఈ రోజు నుంచి ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన పథకం ప్రారంభం కానుంది" అని మోదీ ప్రకటన చేశారు. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ ఉపాధి ఆధారిత ప్రోత్సాహకం పథకాన్ని ఆమోదించినట్టు కార్మిక, ఉపాధి మంత్రిత్వ

**ప్రధాని మోదీ మరో రికార్డు ఏకంగా 103 నిమిషాలు** 2

## సూపర్ సిక్స్ సూపర్ హిట్

'స్త్రీశక్తి' పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు





- అనుకున్నట్లుగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం
- విజయవాడలో స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఆడ బిడ్డలకు మహర్దశ వచ్చే వరకు అండగా ఉంటామని సీఎం హామీ
- రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం
- మహిళా సాధికారిత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు
- ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది మేమే
- మహిళలు త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా కూడా రావాలి

2

**విజయవాడ-నవభూమిబ్యూరో**

'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా ఏపీలో కూటమి ప్రభుత్వం మరో కీలక హామీని నెరవేర్చింది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'స్త్రీశక్తి' పథకాన్ని సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. -"ఈరోజు గర్వంగా చెబుతున్నా సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. రాష్ట్ర పునర్నిర్మాణం దిశగా వేగంగా అడుగులు వేస్తున్నాం. వైకాపా పాలనలో ప్రజలు ఐదేళ్ల పాటు నవ్వడమే మరిచిపోయారు. ఇంటా, బయట ప్రజలకు ఆనందం లేకుండా పోయింది. ఆడ బిడ్డలకు మహర్దశ వచ్చే వరకు అండగా ఉంటాం.

స్వాతంత్ర్య దినోత్సవం రోజు స్త్రీ శక్తి పథకానికి శ్రీకారం చుట్టాం. మహిళలకు మేలు చేస్తున్నామన్న తృప్తి కలుగుతోంది.. రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించాం. మహిళా సాధికారిత కోసమే డ్వాక్రా, మెప్మా సంఘాలు ఏర్పాటు చేశాం. ఆర్టీసీ కండక్టర్లుగా తొలుత మహిళలను తీసుకున్నది. మేమే మహిళలు త్వరలో ఆర్టీసీ డ్రైవర్లుగా కూడా రావాలి. ఉచిత బస్సు వల్ల 2.62 కోట్ల మంది మహిళలకు లబ్ది కలుగుతుంది. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛను ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' ఇస్తున్నాం.. ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. మనసుంటే మార్గం ఉంటుందని నిరూపించాం? అని సీఎం చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎంపీ కేశినేని 'చిన్ని, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. విద్య, వైద్యం, ఆద్యోగం, వ్యాపారం, ఆలయ దర్శనం.. ఇలా ఏ పనిమీద అయినా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఇకపై ఉచితంగా ప్రయాణించవచ్చు. ఐదు రకాల నుంచి అమల్లోకి వచ్చింది.

ఈ సందర్భంగా పథకం ప్రారంభానికి ముందు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు.

**ఉచిత బస్సు సక్సెస్ కావాలంటే ? చంద్రబాబుకు ఆర్టీసీ కార్మికుల డిమాండ్స్..!** ఏపీలో కూటమి సర్కార్ ఎన్నికల హామీ అయిన మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణ పథకాన్ని ఇవాళ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించింది. అయితే ఈ పథకం అమల్లో


## బీజేపీలో సినీనటి కస్తూరి



- కండువా కప్పిన నైనార్ నాగేంద్రన్

2


## అమ్మ అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్



ఎన్నికైన తొలి నటిగా రికార్డు

2

## నాగాలాండ్ గవర్నర్ ఆకస్మిక మరణం



ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

2

## ఆర్టీసీ బస్సు నడిపిన బాలయ్య



హిందూపురంలో బాలయ్య హల్చల్

2

## త్వరలో 2 కొత్త ఎయిర్‌పోర్టులు

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ ప్రకటన



- ఘనంగా గోల్కొండ కోటలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- వరంగల్, ఆదిలాబాద్‌లో రెండు కొత్త ఎయిర్‌పోర్టుల హామీ
- రాష్ట్ర సాధనలో యోధులకు నివాళులర్పించిన ముఖ్యమంత్రి
- 6 గ్యారంటీ పథకాలు, కొత్త ప్రాజెక్టులపై దృష్టి
- రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ
- రైతు రుణమాఫీతో దేశంలో కొత్త చరిత్ర
- ఇందిరమ్మ రైతు భరోసా కింద పెట్టుబడి సాయం
- రూ.13 వేల కోట్లతో 3.10 కోట్ల లబ్ధిదారులకు సాయం
- కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులపై రాజీ పడబోమన్న రేవంత్
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఖరి వల్లే రాష్ట్రానికి నష్టం జరిగిందని ఆరోపణ
- ప్రాజెక్టులను కృష్ణా బోర్డుకు అప్పగించి కేసీఆర్ తప్పు చేశారని విమర్శ



2


**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని చారిత్రాత్మక గోల్కొండ కోటలో ఘనంగా వేడుకలు జరిగాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు.. తెలంగాణ పోలీసు బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. పరేడ్‌లో పలు పోలీసు బెటాలియన్లు ఆకట్టుకునే కవాతు ప్రదర్శించాయి. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గోల్కొండ కోట పరిసరాలు జాతీయ పతాకాల రెపరెపలతో, దేశభక్తి నినాదాలతో ఉద్విగ్నంగా మారాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన యోధులకు నివాళులర్పించారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ పథకాలు, కొత్త ప్రాజెక్టులు, రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుదలపై దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఒక్కటే ఉందని.. త్వరలోనే వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. తెలంగాణను కేవలం 20 నెలల కాలంలోనే పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో

## డెడ్ కాదు.. గుడ్ ఎకానమీ

- దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని నిలిపాం
- గత జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి..
- రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలతో ఆర్థిక విధ్వంసం
- నెలాఖరులోగా మెగా డీఎస్సీ ఎంపిక ప్రక్రియ పూర్తి
- ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం సీఎం చంద్రబాబు ప్రసంగం

2



**విజయవాడ-నవభూమిబ్యూరో**

2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్‌కు మొదటి ముఖ్యమంత్రిగా ప్రజలు తనకు అవకాశం కల్పించారని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అనుభవం, ప్రజల సహకారంతో కష్టపడి దేశంలో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని నిలిపామన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జాతీయజెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. "2019లో వచ్చిన ప్రభుత్వం 5 సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని ధ్వంసం చేసింది. ఏపీ బ్రాండ్ను నాశనం చేసింది. వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి పోయింది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలతో ఆర్థిక విధ్వంసం చేశారు. ఆ ఐదేళ్లు ఎక్కడా అభివృద్ధి జరగలేదు. కనీసం రోడ్లపై గుంతలు పూడ్చలేదు. తవ్వినకొద్దీ గత ప్రభుత్వం చేసిన అప్పులు.. తప్పులు, అక్రమాలు, అవకతవకలు వెలుగుచూస్తున్నాయి. పోలవరం నిలిచిపోయింది. అవరావతి ఆగిపోయింది. పెట్టుబడులు తరలిపోయాయి.

2024 ఎన్నికల్లో ప్రజలు గెలవాలి, రాష్ట్రం నిలవాలి అనే ఎన్డీయే నినాదాన్ని ప్రజలు నమ్మి

## ఒకే చోట 80 మృతదేహాలు పాతిపెట్టాను.. రిటైర్డ్ ఉద్యోగి ఆరోపణ



3

ధర్మస్థలలో రోజుకో మలుపు

## పాకిస్తాన్ సూపర్ రిచ్ దేశం కాబోతోందా?



3

బయటపడిన ఖనిజ సంపద

## శిథిలాల కింద మరో 500 మంది?

- కిష్టార్‌లో 60కి పెరిగిన వరద మృతుల సంఖ్య
- వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు చేపడుతున్నామన్న సీఎం ఉమర్
- శిథిలాల కింద వెయ్యి మంది ఉన్నారన్న
- నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షులు ఫరూఖ్ అబ్దుల్లా

2



**జమ్ము-నవభూమిబ్యూరో**

జమ్ము కశ్మీరులోని కిష్టార్ జిల్లాలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి వరదలు ముంచెత్తిన ఘటనలో 60 మంది మరణించగా 100 మందికిపైగా గాయపడ్డారు. చషోటీ గ్రామంలో గురువారం వచ్చిన ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం తెలిపారు.

శిథిలాల కింద 500 మంది చిక్కుకుని ఉంటారని భావిస్తున్నట్టు నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. ఈ సంఖ్య వెయ్యి దాటవచ్చుని అంటున్నారని ఇది అత్యంత బాధాకరమైన ఘటనని ఆయన అన్నారు.

**ఇస్లామాబాద్:** పాక్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు.. 200 మంది మృతి భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేయడంతో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లలో 200 మందికి పైగా మరణించగా, పలువురు గాయపడ్డారు.

భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు అతలాకుతలం చేయడంతో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లలో 200 మందికి పైగా మరణించగా, పలువురు గాయపడ్డారు. పదుల సంఖ్యలో పౌరులు గల్లంతయ్యారు. గత 24 గంటలుగా పలు ప్రాంతాలను భారీ వానలు, వరదలు

## అమెరికాలో భారత విద్యార్థుల ఆందోళన



3

పెరిగిన టారిఫ్‌తో ఇక్కట్లు

## బర్త్ డే పార్టీలో డ్రగ్స్

- 51మంది అరెస్ట్, సెలబ్రిటీలకు టెన్షన్
- రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ బకారంలోని ఫామ్ హౌస్ బర్త్‌డే పార్టీ
- పట్టుబడిన నైజీరియా, ఉగాండాకు చెందినవారు
- వీరంతా విదేశీ డ్రగ్ పెడ్లర్లుగా అనుమానం

2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

మొయినాబాద్ ఫామ్ హౌస్‌లో నిర్వహించిన బర్త్ డే పార్టీ గుట్టు రట్టు చేశారు పోలీసులు. ఈ బర్త్ డే పార్టీలో ఉగాండా, నైజీరియాకు చెందిన వారిని పోలీసులు



## కూలిన హుమాయూన్ సమాధి గోపురం

◆ ఆరుగురు దుర్మరణం..11 మందిని కాపాడిన సిబ్బంది



2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** దేశ రాజధానిలో విషాద ఘటన చోటు చేసుకుంది. హజ్రత్ నిజాముద్దీన్ ఏరియాలోని చారిత్రక హుమాయూన్ సమాధి గోపురంలో కొంతభాగం శుక్రవారం నాడు మధ్యాహ్నం 4.30 గంటల ప్రాంతంలో కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరించారు. 11 మందిని శిథిలాల నుంచి సహాయక సిబ్బంది కాపాడి సమీప ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు.

ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్‌టీమ్‌లు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. స్ట్రక్చరల్ ఇంజనీర్లు, ఇన్వెస్టిగేటర్లు ప్రమాద స్థలిని

## వెయ్యి కోట్ల కల.. కూలీతో కూడా సాధ్యం కానట్టేనా?



8

ఒక్కరోజుకు రూ.151కోట్లు

నవ వార్త

# బీజేపీలో చేరిన సినీ నటి కస్తూరి..

**చెన్నై-నవభూమి:**ప్రముఖ సినీ నటి కస్తూరి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ ఆధ్వర్యంలో ఆమె భారతీయ జనతా పార్టీలో చేరారు. కస్తూరితో పాటు ట్రాన్స్‌జెండర్ కార్యకర్త నమితా మారిముత్తు కూడా కాషాయ కండువా కప్పుకున్నారు. నైనార్ నాగేంద్రన్ వారికి పార్టీ సభ్యత్వం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు.
కస్తూరి మోడల్‌గా రాణించడంతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో ప్రధాన పాత్రల్లో నటించి బుల్లితెర ప్రేక్షకులకు చేరువయ్యారు.
గత సంవత్సరం నవంబర్ 3న చెన్నైలో హిందూ మక్కల్ కచ్చి నిర్వహించిన కార్యక్రమంలో కస్తూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. తమిళనాడులో నివసించే తెలుగు మాట్లాడే ప్రజలు తమను తాము తమిళులుగా చెప్పుకుంటున్నారని, కానీ ఏళ్ల క్రితం వలస వచ్చిన బ్రాహ్మణులను మాత్రం తమిళులుగా అంగీకరించడం లేదని ఆమె వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, తెలుగు వారు పూర్వకాలంలో రాజుల అంతఃపురాల్లో పరిచారకులుగా పనిచేసిన వారి వారసులంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి.
ఈ వ్యాఖ్యలపై ఆల్ ఇండియా తెలుగు ఫెడరేషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫెడరేషన్ నాయకులు సీఎంకే రెడ్డి, కార్యదర్శి ఆర్. నందగోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రేటర్ చెన్నై పోలీసులు కస్తూరిపై కేసు నమోదు చేశారు. కులం, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేశారనే ఆరోపణలతో ఆమెపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఇప్పుడు, ఆ వివాదం జరిగిన కొద్ది నెలలకే కస్తూరి బీజేపీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## పంద్రాగస్టు వేళ ప్రధాని మోదీ మరో రికార్డు.. ఏకంగా 103 నిమిషాలు

**(1వపేజీ తరువాయి)**ఏకంగా 1.43 గంటల అంటే 103 నిమిషాల పాటు మోదీ ప్రసంగించి సరికొత్త రికార్డు నెలకొల్పారు. ఉదయం 7.34 గంటలకు మొదలైన ఆయన ప్రసంగం 9.17 గంటల వరకూ కొనసాగింది. దీంతో గతేడాది పంద్రాగస్టు ప్రసంగం 98 నిమిషాల రికార్డును అధిగమించినట్టయ్యింది. . తొలిసారి 2014 ఆగస్టు 15న మోదీ 65 నిమిషాల పాటు ప్రసంగించారు. ఆ మరుసటి ఏడాది మొట్టమొదటి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేసిన 72 నిమిషాల ప్రసంగం రికార్డును మోదీ బద్దలుగొట్టారు. 2015లో 88 నిమిషాల పాటు మోదీ మాట్లాడారు. ఆ తర్వాత 2016లో 96 నిమిషాలు ప్రసంగించారు. అయితే, 2017 మాత్రం మోదీ కేవలం 56 నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకే ప్రసంగాన్ని తగ్గించుకున్నట్టు ఆ తర్వాత మన్ కీ బాత్‌లో మోదీ వెల్లడించారు. కానీ, 2018లో 83 నిమిషాలు (1.23 గంటలు), 2019లో 92 నిమిషాలు (1.32 గంటలు), 2020లో 90 నిమిషాలు (1.30 గంటలు), 2021లో 88 నిమిషాలు (1.28 నిమిషాలు), 2022లో 74 నిమిషాలు (1.14 నిమిషాలు), 2023లో 90 నిమిషాలు (1.30 గంటలు) ల పాటు మోదీ ప్రసంగం చేశారు.ఎర్రకోట పై నుంచి మోదీ 12వసారి జాతీయ జెండాను ఆవిష్కరించి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ రికార్డును అధిగమించారు. ఇప్పటి వరకూ అత్యధికంగా జవహర్‌లాల్ నెహ్రూ మాత్రమ 17 సార్లు ఎర్రకోట నుంచి ప్రసంగించారు. ఇక, 1956లో కేవలం 14 నిమిషాల్లో నెహ్రూ తన ప్రసంగం ముగించగా.. ఇందిరా గాంధీ 1966లో 14 నిమిషాలే మాట్లాడారు.
అలాగే, మాజీ ప్రధానులు మన్మోహన్ సింగ్, అటల్ బిహారీ వాజ్‌పేయిలు కూడా తక్కువ సమయం ప్రసంగించారు. మన్మోహన్ 10సార్లు జాతినుద్దేశించి ప్రసంగించి.. 50 నిమిషాల్లోనే ప్రసంగం పూర్తిచేయడం విశేషం. 2005, 2006లో మాత్రమే 50 నిమిషాలు మాట్లాడిన మన్మోహన్.. మిగతా ఎనిమిదేళ్లు 32 నుంచి 45 నిమిషాల మధ్య ప్రసంగించారు. 2012లో 32 నిమిషాలు, 2013లో 35 నిమిషాల్లోనే మన్మోహన్ ప్రసంగం ముగియడం గమనార్హం. ఇక, దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 2002లో 25, 2003లో అరగంట మాత్రమే మాట్లాడారు.

## నాగాలాండ్ గవర్నర్ ఆకస్మిక మరణం

**చెన్నై-నవభూమి:**నాగాలాండ్ గవర్నర్ గణేషన్ అయ్యర్ ఈ రోజు సాయంత్రం తుదిశ్వాస విడిచారు. కొద్ది రోజుల క్రితం ఇంట్లో జారిపడటంతో తలకు తీవ్ర గాయమైంది. ఆప్పటి నుంచి చెన్నైలోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఈరోజు మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. బీజేపీ నేతగా, గవర్నర్‌గా గణేషన్ అయ్యర్ సేవలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఆయన మృతిపై దేశంలోని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. "గణేషన్ అయ్యర్ దేశ సేవకు, జాతి నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన భక్తుడైన జాతీయవాదిగా ఎప్పటికీ గుర్తుంచుకుంటారు. తమిళనాడులో బీజేపీని విస్తరించడానికి ఆయన చేసిన కృషి అసాధారణం. తమిళ సంస్కృతి పట్ల కూడా ఆయనకు తీవ్ర మక్కువ ఉండేది. ఈ విషాద సమయంలో నా ఆలోచనలు ఆయన కుటుంబం, అభిమానులతో ఉన్నాయి. ఓం శాంతి." అని ప్రధాని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. గణేషన్ అయ్యర్ మృతి దేశ రాజకీయాలకు ఒక తీరని లోటని తెలిపారు.

## అమ్మ అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్

**తిరువనంతపురం-నవభూమి:** అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్షురాలిగా శ్వేతా మేనన్ ఎన్నికయ్యారు. ప్రత్యర్థి దేవన్‌పై గెలిచిన ఆమె.. 'అమ్మ' ప్రెసిడెంట్గా ఎన్నికైన తొలి నటిగా రికార్డు నెలకొల్పారు. లక్ష్మి ప్రియ ఉపాధ్యక్షురాలిగా, కుక్కు పరమేశ్వరన్ జాయింట్ సెక్రటరీగా, అన్సిబా హాసన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మద్యాహ్నం గంట వరకు కొచ్చిలో ఓటింగ్ జరిగింది. ఫలితాలను సాయంత్రం వెల్లడించారు. 506 మంది సభ్యులకు ఓటు హక్కు ఉండగా 298 మంది ఓటేశారు. ప్రముఖ నటులు కొందరు ఓటు వేయలేదని సమాచారం.31 ఏళ్ల క్రితం 'అమ్మ' ప్రారంభమైంది. ఎం.జి. సోమన్, మదు. మోహన్లాల్ తదితరులు ప్రెసిడెంట్‌గా పని చేశారు. పలువురు నటులు, దర్శకులపై నటీమణులు చేస్తున్న లైంగిక ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యతగా 'అమ్మ' ఆధ్యక్ష పదవికి అగ్ర కథానాయకుడు. మోహన్ లాల్ గతేడాది రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో, 2027లో నిర్వహించాల్సిన ఎన్నికలను ఈ ఏడాది నిర్వహించారు. కొన్నేళ్ల క్రితం శ్వేతా మేనన్పై ఓ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో ఆమె గెలుస్తారా? లేదా? అన్న ఉత్కంఠ మలయాళ చిత్ర పరిశ్రమలో నెలకొంది.1994లో 'ఫెమినా మిస్ ఇండియా ఏషియా పసిఫిక్‌గా నిలిచిన (శ్వేతా మేనన్ అనస్వరం'తో నటిగా మారారు. ఆ తర్వాత '100 డిగ్రీ సెల్సియస్ బాలటి మలయాళ్ళ మూవీస్ తోపాటు టాలీవుడ్, కోలీవుడ్. వాలీవుడ్లో నూ నటించారు. తెలుగులో 'ఆనందం'లో ప్రత్యేక గీతంలో మెరిసిన శ్వేత,

## బర్త్ డే పార్టీలో డ్రగ్స్

**(1వపేజీ తరువాయి)**పట్టుకున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ బకారంలో ఒక పార్టీలో మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన సమాచారం అందుకున్న పోలీసులు అక్కడివారిని అరెస్టు చేశారు. డ్రగ్స్ పార్టీలో పట్టుబడిన నైజీరియా, ఉగాండాకు చెందినవారు మొత్తం 51 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు వీరిలో నైజీరియా, ఉగాండాకు చెందిన వారు ఎక్కువ మంది ఉన్నట్టు గుర్తించారు. వీరంతా విదేశీ డ్రగ్ పెడలర్లుగా వారు అనుమానిస్తున్నారు. మొత్తం వారిలో 37 మంది మహిళలు కాక 14 మంది పురుషులు. వీరికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా చాలామందికి పాజిటివ్ గా నిర్ధారణ అయినట్టు తెలుస్తుంది. బర్త్ డే పార్టీలో భారీగా మద్యం, మాదకద్రవ్యాలు ఉగాండా కు చెందిన మమస్ బర్త్ డే పార్టీలో వీరంతా డ్రగ్స్ ఉపయోగిస్తూ పట్టుబడినట్లు తెలుస్తోంది. ఈ బర్త్ డే పార్టీలో భారీగా మద్యం, మాదకద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ పార్టీకి వచ్చిన వారి పాస్ పోర్టులను స్వాధీనం చేసుకున్న పోలీసులు వారి పాస్పోర్ట్ లను, వీసాలను ఇమిగ్రేషన్ అధికారులతో చేయిస్తున్నారు. ఎక్సైజ్ అనుమతి లేకుండా లిక్కర్ పార్టీ జరుపుకున్నట్టు తేల్చారు . భారత్ లో అక్రమంగా నివసిస్తున్న వారు... చట్టపరమైన చర్యలు ఇక్కడ డ్రగ్ డిటెక్షన్ పరికరాలతో 51 మందికి పోలీసులు పరీక్షలు నిర్వహించారు. వీరందరిని ఎస్వోటీ పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వీరందరి వీసాలను పరిశీలించిన ఇమిగ్రేషన్ అధికారులు చాలామంది వీసా గడువు ముగిసిన తర్వాత కూడా భారత్లో కొనసాగుతున్నట్టు గుర్తించారు. అక్రమ నివాసం ఉంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

# త్వరలో 2 కొత్త ఎయిర్‌పోర్టులు

**(1వపేజీ తరువాయి)**ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రతో దేశానికి రోల్ మోడల్‌గా నిలిపినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన నిత్యావసరాలు అందుబాటు ధరల్లో అందించే లక్ష్యంతో రేషన్ షాపుల ద్వారా 'సన్న బియ్యం' పంపిణీని ప్రారంభించామన్నారు. రూ.13 వేల కోట్ల వ్యయంతో 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు ఈ సన్న బియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచేలా జూలై 14 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించినట్లు వెల్లడించారు.25.35 లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్ల రుణాలను మాఫీ చేసి, దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం రాయని కొత్త చరిత్రను సృష్టించామని సీఎం చెప్పారు. అన్నం పెట్టే రైతు అప్పుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో 'ఇందిరమ్మ రైతు భరోసా' కింద ఎకరానికి రూ.12 వేల పెట్టుబడి సాయం ప్రకటించామన్నారు. కేవలం 9 రోజుల్లో 70 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లో రూ.9 వేల కోట్లు జమ చేశామని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న 1.2 లక్షల మందికి కూడా ఈ సాయం అందించినట్లు తెలిపారు. సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నామని ప్రకటించారు. పదేళ్ల తర్వాత పేదల సొంతింటి కలలను సాకారం చేసేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల' నిర్మాణాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. తొలి విడతగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను మంజూరు చేశామని, వీటి కోసం రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నట్లు సీఎం తెలిపారు.
రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదం మరోసారి రాజుకుంది. బనకచర్ల ప్రాజెక్ట్ వల్ల ఎవరికీ నష్టం జరగదని... ఈ ప్రాజెక్టుపై ఎవరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని ఈరోజు ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఈ అంశంపై ప్రతిస్పందించారు. కృష్ణా, గోదావరి నదులపై తెలంగాణకు ఉన్న హక్కుల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు ప్రతి నీటి చుక్క కోసం తమ ప్రభుత్వం పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.
నదీ జలాల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరి వల్లే తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టి నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించారని విమర్శించారు. ఆనాటి ప్రభుత్వ నిర్ణయాల కారణంగానే ఈరోజు తెలంగాణ సాగునీటి హక్కుల కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు.
తెలంగాణ ప్రజల ప్రయోజనాలే తమకు అత్యంత ముఖ్యమని పునరుద్ఘాటించిన రేవంత్ రెడ్డి, పొరుగు రాష్ట్రంతో స్నేహపూర్వక సంబంధాలు కోరుకుంటామని, అయితే హక్కుల విషయానికి వస్తే మాత్రం వెనక్కి తగ్గేది లేదని గట్టిగా హెచ్చరించారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడటంలో ఎలాంటి రాజీకి తావులేదని ఆయన భరోసా ఇచ్చారు. నెహ్రూ నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీశైలం, శ్రీరామ్ సాగర్ లతోనే మనకు నీళ్లు అందుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ అంటే ఒక బ్రాండ్ అని... ఈ బ్రాండ్ ను మరింత ముందుకు తీసుకెళతామని అన్నారు. ప్రపంచ సుందరీమణుల పోటీలను హైదరాబాద్ లో నిర్వహించామని... ఈ సందర్భంగా పోటీలకు వచ్చిన వారికి తెలంగాణ ప్రత్యేకతలు చూపించామని తెలిపారు. హైదరాబాద్ లో నిర్వహించిన బయో ఏషియా సదస్సు ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. ఇక్కడి ఫార్మా కంపెనీలు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

### మారుమూల జిల్లాకు మహర్దశ..

# ప్రారంభానికి సిద్ధమైన ఐటీ కంపెనీ



**ములుగు-నవభూమి:** ములుగును ఐటీ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. రూ.6 కోట్లతో ఐదు అంతస్తుల అత్యాధునిక ఐటీ భవనాన్ని నిర్మించనున్నారు. స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా టాస్క్ సెంటర్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుని కార్యకలాపాలు ప్రారంభించారు. దీని ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో ఐటీ విప్లవం సృష్టించి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.
తెలంగాణలోని వెనుకబడిన మన్యం జిల్లా ములుగును భవిష్యత్తులో ఐటీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. స్థానిక యువతకు ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. జిల్లాలో పెద్ద ఐటీ కంపెనీలను ఆకర్షించేలా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ములుగు పట్టణ శివారులో సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.6 కోట్లతో అత్యాధునిక ఐటీ భవనం నిర్మించనున్నారు. ఈ ఐదు అంతస్తుల భవనం కోసం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో అంతస్తులో ఒక్కో ఐటీ కంపెనీని ఏర్పాటు చేసి, వేల సంఖ్యలో ఉద్యోగాలను సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
నిర్మాణ బాధ్యతలను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖకు అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలో ఉన్న తరహాలోనే ఈ భవనంలో అన్ని రకాల వసతులు కల్పించనున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల మంజూరు కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.
మరోవైపు, ములుగులో ఇప్పటికే ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్‌లో యువతకు ఐటీ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఐటీ కంపెనీల ప్రాజెక్టులకు అనుగుణంగా ఉండే కోర్సులపై దృష్టి సారించి యువతను సిద్ధం చేస్తున్నారు. శిక్షణ పూర్తి అయిన వెంటనే ఇక్కడే ఉద్యోగాలు పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
ఐటీ కంపెనీలను ఆకర్షించే దిశగా తొలి అడుగు పడింది. ములుగులోని టాస్క్ సెంటర్ ఆవరణలో సిరి ఇన్ఫోటెక్ అనే కంపెనీతో ఒప్పందం చేసుకుని నూతన భవనాన్ని నిర్మించారు. ఈ భవనంలో ఉద్యోగులు, మేనేజర్ల గదులు, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కార్పొరేట్ స్థాయిలో కల్పించారు. త్వరలోనే మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ కేంద్రాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ కంపెనీ సేవలు మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఏజెన్సీ ప్రాంతమైన ములుగులో ఐటీ విప్లవం సృష్టించి చరిత్ర సృష్టించాలని ములుగు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోంది.

# సూపర్ సిక్స్..సూపర్ హిట్

**(1వపేజీ తరువాయి)**కీలకమైన ఉద్యోగుల పెండింగ్ సమస్యల విషయంలో మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది. దీంతో ఇప్పటికే ఆందోళనలు చేస్తున్న ఉద్యోగులు.. ఇవాళ సీఎం చంద్రబాబును కలిసి మరోసారి తమ డిమాండ్లను ఆయన ముందు పెట్టారు. వీటిని వెంటనే పరిష్కరించాలని ఆయన్ను కోరారు.
ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీశక్తిని విజయవంతం చేస్తామని, అయితే తమ సమస్యల్ని మాత్రం పరిష్కరించాల్సిందేనని ఎంప్లాయీస్ యూనియన్ నేతలు సీఎం చంద్రబాబుకు తేల్చిచెప్పారు. ప్రభుత్వ అనుమతి కోసం ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, అలాగే స్త్రీశక్తి పథకం విజయవంతం కావాలంటే 3000 కొత్త బస్సులు కొనుగోలుచేయాల ని,అన్ని కేటగిరీలలో ఖాళీలు భర్తీ కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది , ఇతర విభాగాలలో ఉన్న 10వేల ఖాళీలను వెంటనే భర్తీ చేయడానికి అనుమతి ఇవ్వాలి చంద్రబాబును కోరారు. వీటితో పాటు గత ప్రభుత్వం హయాంలో పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ పెండింగ్ 24 నెలల అరియర్స్, డిఏ బకాయిలు, కొత్త డిఏలు వెంటనే ప్రకటించాలని వారు సీఎంను కోరారు. ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు విలీనం కాక ముందున్నపాత విధానంలో వైద్య సౌకర్యాలు పునరుద్ధరించాల ని, ఇ.హెచ్.యస్ ద్వారా క్యాష్‌లెస్ ట్రీట్మెంట్ సదుపాయం అందేలా చూడాలని కూడా కోరారు. పరిహారం కోసం కొత్త పథకం ? ఆర్టీసిలో మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగి లేదా వారి కుటుంబ సభ్యులలో ఒకరికీ ఉద్యోగావకాశం కల్పించాలని, ఆర్టీసిలో ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు సంఘాలకు జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అవకాశం కల్పించాలని, ఔట్ సోర్సింగు ఉద్యోగులకు ఆప్కాస్ లో ఉన్న ఉద్యోగులతో సమానంగా జీతాలు పెంచాలని, ఆన్ కాల్/అద్దెబస్సు డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలిశెట్టి దామోదరరావు లేఖలో విజ్ఞప్తి చేసారు.
అంతే కాకుండా ప్రభుత్వ పరిధిలో పరిష్కారం కావాల్సిన సమస్యలలో మరో 15 సమస్యలను కూడా జోడించి వీటిని పరిష్కారించాలని లేఖ ద్వారా సీఎంను కోరారు.

# హిందూపురంలో ఆర్టీసీ బస్సు నడిపిన బాలయ్య..

**హిందూపురం-నవభూమి:**ఏపీలో ఉన్న మహిళలందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన ఉచిత బస్సు ప్రయాణ పథకం నేటి నుండి ప్రారంభమైంది. మహిళల ఉచిత బస్సు ప్రయాణ స్త్రీ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జెండా ఊపి ప్రారంభించారు. మహిళా ప్రయాణికులతో కలిసి బస్సులో ప్రయాణించారు. ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులోకి తీసుకువచ్చిన ఈ ఉచిత బస్సు ప్రయాణ పథకంలో మొత్తం ఐదు రకాల బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. స్త్రీ శక్తి పేరుతో ప్రారంభమైన ఈ స్కీం ఏపీలో మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ తో ప్రయాణ సౌకర్యాన్ని కలిగిస్తుంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో, ఎక్స్ప్రెస్ బస్సులలో ఇకపై మహిళలు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హంగామా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడి వరకు అయినా ప్రయాణం చేసేలా ఈ స్త్రీ శక్తి పథకాన్ని తీసుకువచ్చారు. బస్సు ఎక్కిన తర్వాత మహిళలు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి లేదా రేషన్ కార్డు చూపిస్తే జీరో టికెట్ మీద ప్రయాణం చేయడానికి వీలు కలుగుతుంది. ఇక నేడు ఏపీలో ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలకు అందించిన వేళ హిందూపురంలో హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హంగామా చేశారు. బస్సు నడిపి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసిన బాలకృష్ణ మరో సూపర్ సిక్స్ హామీ అయిన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించిన క్రమంలో ఆయన హిందూపురం ఆర్టీసీ బస్ స్టేషన్ నుండి చౌడేశ్వరి కాలనీ లోని తన నివాసం వరకు బస్సు నడిపి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. ప్రయాణికులతో ఉన్న బస్సును ఆయన ఎటువంటి భయం లేకుండా దూకుడుగా నడిపారు. బస్సులో కూర్చున్న ప్రయాణికులు బాలయ్య బస్సు నడిపిన స్టైల్ చూసి జై బాలయ్య అంటూ కేకలు పెట్టారు. బాలయ్యతో కలిసి ప్రయాణం చెయ్యటంతో స్థానికులలో సంతోషం తమ నియోజకవర్గ శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ, ఆమెతో కలిసి ప్రయాణం చేయడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక బాలయ్య బస్సు నడుపుతున్న వీడియోస్ సోషల్ మీడియాలో వైరల్ కాక, ఇది చూసిన ప్రతి ఒక్కరు ఏం చేసినా స్పెషలే.. బాలయ్య బాబు కి జై అంటూ ఆయనపై అభిమానాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## రూ.లక్ష కోట్లతో కొత్త పథకం

**(1వపేజీ తరువాయి)**శాఖ గత నెలలో తెలిపింది.ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన రెండేళ్లలో 3.5 కోట్లకు పైగా ఉద్యోగాల సృష్టిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుందని అని జులై 25న వెలువరించిన ప్రకటనలో ఈ మేరకు పేర్కొంది. వీరిలో 1.92 కోట్ల మంది లబ్ధిదారులు తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశిస్తారు. 'వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ పేరు ఉంది.. దేశంలో సమ్మిళిత, స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది' అని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పథకం రెండు విభాగాలుగా ఉంటుంది. పార్ట్ ఏ మొదటిసారిగా ఉపాధి పొందుతున్నవారు.. పార్ట్ బి కింద యజమాన్యాలు వస్తాయి."మానవాళి మనుగడకే ముప్పుగా పరిణమించింది తీవ్రవాదం.. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో మతం పేరుతో అమాయకులపై దాడిచేసి ప్రాణాలు తీసిన ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పాం.. యావత్ భారతావని ఆగ్రహంతో రగిలిపోయింది. దానికి బదులుగా ఆపరేషన్ సిందూర్‌ను చేపట్టి ఊహించని రీతిలో శత్రువును దెబ్బకొట్టాం.. శత్రువులపై దాడి విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చాం.. ఎప్పుడు ఎలా మట్టుబెట్టాలో.. టార్గెట్, సమయం ఎంచుకునే నిర్ణయాన్ని అప్పగించాం.." అని అన్నారు."అణ్వాయుధ బెదిరింపులకు భారత్ భయపడబోదనే విషయాన్ని శత్రువుకు తెలియజేశాం.. నీళ్లు, రక్తం కలిసి ప్రవహించబోవని మళ్లీ చెబుతున్నా.. సింధూ జలాల ఒప్పందం విషయంలో ఇంకో మాట లేదు.. భారత భూభాగానికి సింధూ జలాలను మళ్లించాలన్న ఆలోచనలో మార్పు ఉండదు... నీళ్లు లేని ప్రాంతాలకు వాటిని తరలిస్తాం.. ఆ జలాలపై సర్వహక్కులు భారత్‌వి.., మన రైతులవి మాత్రమే. ఒప్పందం పునరుద్ధరణ జరిగే ప్రసక్తే లేదు... చర్చలు కూడా ఉండబోవు' అని దాయాదికి ప్రధాని మోదీ స్పష్టంచేశారు. ఇటీవల అమెరికాలో పర్యటించిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. అక్కడ నుంచే భారత్‌పై కవ్వింపులకు దిగిన విషయం తెలిసిందే.తమ అస్థిత్వానికి ప్రమాదం ఏర్పడితే మాతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామని పరోక్షంగా భారత్‌పై బెదిరింపులకు దిగారు. అలాగే, పాక్ రాజకీయ నేత బిలావల్ భుట్టో కూడా సింధూ జలాల విషయంలో భారత్‌పై నోరుపారేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తావించారు. పహల్గామ్ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందని బలంగా నమ్మిన భారత్.. దాయాదిపై దౌత్యపరంగా చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా 1960లో ఇరు దేశాల మధ్య కుదిరిన సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో పాక్‌కు వెళ్లాల్సిన జలాలు నిలిచిపోయి.. ఆ దేశంలో ఎడారి మాదిరి పరిస్థితులు నెలకున్నాయి.

## శిథిలాల కింద మరో 500 మంది?

**(1వపేజీ తరువాయి)**ముంచెత్తాయి.ముఖ్యంగా ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు, వరదలు కారణంగా 125 మందికి పైగా మరణించగా, భారీ ఆస్తి నష్టం ఏర్పడింది. పీవోకేలో పలు ఇళ్లు, పాఠశాలలు, వాహనాలు, ఆరోగ్య యూనిట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పలు చోట్ల వందలాది మంది పర్యాటకులు చిక్కుకుపోయారు. రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

## డెడ్ కాదు..గుడ్ ఎకానమీ

**(1వపేజీ తరువాయి)**చారిత్రాత్మక తీర్పునిచ్చారు. నిశ్శబ్ద విప్లవాన్ని సృష్టించారు. 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్తో కూటమిని దీవించారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించాలనే ఏకైక లక్ష్యంతో పాలన ప్రారంభించాం.. మేం. అధికారాన్ని చేపట్టిన ఏడాదిలో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా, భవిష్యత్తుకు బాటలు వేసేలా పని చేశాం. తొలి సంతకం నుంచి సుపరిపాలన వైపు ఆడుగు వేశాం. సంక్షేమం. అభివృద్ధి. సుపరిపాలనతో సాగిన ఏడాది పాలన ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ప్రజల మద్దతు, మా సంకల్పం, దేవుడి దయతో విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం చేస్తున్నాం. నేను ఈరోజు సవినయంగా, సగర్వంగా చెబుతున్నా కూటమి ప్రభుత్వంలో సంక్షేమానికి సాటి లేదు.. అభివృద్ధికి అడ్డు లేదు... సుపరిపాలనకు పోటీ లేదు. ఇది రికార్డు.. ఇదే ఆల్టైమ్ రికార్డు అని మరోసారి చెబుతున్నా

**మెగా డీఎస్సీ నియామకాలను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తాం**

'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా 64 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించాం. ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేసి సంక్షేమ రాజ్యానికి కొత్త అర్థం ఇచ్చాం. పేదింటి తల్లులకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు 'తల్లికి వందనం' తీసుకొచ్చాం. రూ.10 వేల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం రూ.7 వేలు రైతుల ఖాతాల్లో వేశాం. దీని ద్వారా 47 లక్షల మంది రైతులకు రూ.3,173 కోట్లు అందించాం. దీపం పథకం కింద ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఇప్పటివరకు 2 కోట్ల రాయితీ సిలిండర్లు ఇచ్చాం. ఆడబిడ్డలకు "స్త్రీశక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెడుతున్నాం. మెగా డీఎస్సీ నియామకాలను ఈ నెలాఖరుకు పూర్తిచేస్తాం.


**మనది డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ**

పారిశ్రామికవేత్తలకు నమ్మకాన్ని కలిగించాం. రాష్ట్రానికి మళ్లీ పెట్టుబడులు వచ్చేలా కృషి చేస్తున్నాం.. ఇప్పటివరకు 9 స్టేట్ ఇన్వెస్ట్మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశాలు నిర్వహించాం. 113 ప్రాజెక్టులకు సంబంధించి రూ.5.94 లక్షల కోట్ల పెట్టుబడులను ఆమోదించాం. వీటి ద్వారా 5.56 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థలు. పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఉచిత ఇసుక విధానం అమలు చేస్తూ భవన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాం. ఇప్పటివరకు 1.5 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందించాం. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని మద్యం పాలసీ రూపొందించాం. నాణ్యమైన, బ్రాండెడ్ మద్యం విక్రయాలు జరిగేలా చూస్తున్నాం. ప్రజా పాలనలో సాంకేతికతను విస్తృతం చేశాం. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 పౌర సేవలు అందిస్తున్నాం. ప్రధాని మోదీ .. నాయకత్వంలో త్వరలోనే శివ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తాం.. మనది డెడ్ ఎకానమీ కాదు.. గుడ్ ఎకానమీ" అని చంద్రబాబు తెలిపారు.

## కూలిన హుమాయూన్ సమాధి గోపురం

**(1వపేజీ తరువాయి)**పరిశీలించేందుకు వీలుగా దర్గా చుట్టుపక్కల ప్రాంతాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు. సమాధి గోపురం కూలిపోవ డానికి కారణాలపై విచారణ చేపట్టారు. మొఘల్ చక్రవర్తి హుమాయూన్ మరణాం తరం అతని భార్య హమీదా భాను బేగం ఆదేశానుసారం 1562లో ఈ సమాధి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఎనిమిదేళ్ల పాటు నిర్మాణం జరిగింది. దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా కూడా ప్రకటించారు.

# 19 వరకు మోస్తరు వర్షాలు..



**చెన్నై–నవభూమి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీ వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమ మధ్య, దానిని అనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశముంది.అదే సమయంలో తమిళనాడు



దక్షిణాది రాష్ట్రాలపై ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతోంది. ఈ కారణంగా రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 19వ తేది వరకు ఉరుములు, మెరుపులు, గంటకు 50 కి.మీ ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
శనివారం
16 । ఆగస్టు । 2025




## పాకిస్తాన్ సూపర్ రిచ్ దేశం కాబోతోందా?



**కరాచీ–నవభూమి:** ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న పాకిస్తాన్, రాబోయే రోజుల్లో ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశాల జాబితాలోకి చేరగలదని తాజా నివేదికలు సూచిస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆ దేశ భూగర్భంలో దాగి ఉన్న అపారమైన ఖనిజ సంపద. అంచనాల ప్రకారం, పాకిస్తాన్‌లో సుమారు 3 నుండి 5 ట్రిలియన్ డాలర్ల విలువైన అరుదైన ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంపదను సరిగ్గా వినియోగించుకుంటే పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా రూపురేఖలు మారగలదని విశ్లేషకులు చెబుతున్నారు.అపారమైన ఖనిజ నిక్షేపాలు పాకిస్తాన్‌లో బొగ్గు, రాగి, బంగారం, ఇనుము, క్రోమైట్ వంటి ఖనిజాలు విస్తారంగా ఉన్నాయి. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఉప్పు గనులు (ఖేవ్ర గనులు) , ఐదో అతిపెద్ద రాగి–బంగారం గనులు (రేకో డిక్) ఈ దేశంలోనే ఉన్నాయి. ఈ ఖనిజ సంపద బలూచిస్తాన్‌లోని ఎడారి ప్రాంతం నుండి పంజాబ్‌లోని సారవంతమైన భూముల వరకు విస్తరించి ఉంది. అయితే ఇప్పటివరకు ఈ గనులపై సరైన దృష్టి పెట్టకపోవడం వల్ల పాకిస్తాన్‌కి పెద్దగా లాభం చేకూరలేదు. పాలసీ మార్పులు – పెట్టుబడులు ఇటీవల పాకిస్తాన్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఖనిజ గనుల నిర్వహణను ప్రాంతీయ ప్రభుత్వాల నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావాలని.. విదేశీ పెట్టుబడులను సులభతరం చేయాలని నిర్ణయించింది. ఈ మార్పుల వల్ల బిడ్డింగ్‌లు, అనుమతులు.. భద్రతా క్లియరెన్స్‌లు వేగంగా పూర్తవుతాయి. ఇది విదేశీ సంస్థలను ఆకర్షించడానికి దోహదం చేస్తుంది. – ప్రధాన పెట్టుబడిదారులు చైనా గిల్గిట్–బల్టిస్తాన్ ప్రాంతంలో మైనింగ్ హక్కులను పొందడానికి ఆసక్తి చూపుతోంది. అమెరికా ఉత్తర బలూచిస్తాన్ , దక్షిణ ఖైబర్ పఖ్తూన్‌ఖ్వాలో ప్రాజెక్టులపై దృష్టి పెడుతోంది. సౌదీ అరేబియా ప్రపంచ ప్రసిద్ధి చెందిన రేకో డిక్ రాగి–బంగారం గనులపై పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉంది. టర్కీ, యూఏఈ, యూకే ఈ దేశాలు కూడా పలు మైనింగ్ ప్రాజెక్టుల్లో ఆసక్తి చూపుతున్నాయి. భవిష్యత్తు అవకాశాలు ఈ గనులను సరిగ్గా అభివృద్ధి చేస్తే, పాకిస్తాన్ ఆర్థికంగా పుంజుకోవడమే కాకుండా, పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఎగుమతుల ద్వారా భారీగా విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించవచ్చు. నిపుణుల అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్టులు దేశ స్థూల జాతీయోత్పత్తి ని అనూహ్యంగా పెంచగలవు. ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతున్న పాకిస్తాన్‌కి ఈ ఖనిజ సంపద ఒక ‘బంగారు టికెట్’ లాంటిదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే దీనిని విజయవంతంగా వినియోగించుకోవాలంటే, పారదర్శక విధానాలు, రాజకీయ స్థిరత్వం సురక్షితమైన వాతావరణం అవసరం. ఈ అంశాలన్నీ సవ్యంగా నడిస్తే, పాకిస్తాన్ సంక్షోభం నుంచి సంపద వైపు దూసుకుపోయే అవకాశం ఉంది.

## చనిపోయినట్లు నిర్ధారించి ఓటరు జాబితా నుంచి పేరు తొలగింపు..

### తాను బతికే ఉన్నానంటూ బీహార్ వ్యక్తి మొర



**పాట్నా–నవభూమి:** బీహార్‌కు చెందిన ఒక వ్యక్తిచనిపోయినట్లు ఎన్నికల అధికారి నిర్ధారించారు. ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు. అయితే తాను బతికే ఉన్నానంటూ ఆ వ్యక్తి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు అలాగే ఎలక్షన్ కమిషన్ (ఈసీ)కు మొరపెట్టుకున్నాడు. భోజ్‌పూర్ జిల్లా అర్రా అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన మింటూ కుమార్ పాస్వాన్ మరణించినట్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో బూత్ స్థాయి ఎన్నికల అధికారి నిర్ధారించారు. ముసాయిదా ఓటరు జాబితా నుంచి ఆయన పేరు తొలగించారు.కాగా, బీహార్‌లో ఓటరు జాబితా సవరణ కోసం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించడంపై ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు మండిపడుతున్నాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఓటరు జాబితా నుంచి పేరు తొలగించిన మింటూ కుమార్ పాస్వాన్ సహా పలువురిని న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు.మరోవైపు కోర్టుకు హాజరైన తర్వాత మింటూ కుమార్ పాస్వాన్ స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బీహార్ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (సీఈవో) కార్యాలయానికి చేరుకున్నాడు. ఓటరు ముసాయిదా జాబితాలో తాను చనిపోయినట్లు ఎన్నికల అధికారి నిర్ధారించడంపై ఆవేదన వ్యక్తం చేశాడు. తాను బతికే ఉన్నానంటూ సంబంధిత పత్రాలను చూపించాడు. బూత్ స్థాయి ఎన్నికల అధికారి తన ఇంటికి రాకుండానే ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించినట్లు ఆరోపించాడు. ‘దీని వల్ల నాకు భారీ నష్టం జరుగుతుంది. నేను బంగ్లాదేశ్ పౌరుడినని రేపు వారు అంటారు’ అని వాపోయాడు. అధికారుల సూచన మేరకు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు కోసం ఫారాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించాడు.

## ఇక రాజధాని నగరంలో డబుల్‌డెక్కర్ పరుగులు

**చెన్నై–నవభూమి:** నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సుల) సంచారం ప్రారంభం కాబోతోంది. ఇందులో భాగంగా గురువారం ఉదయం పలుచోట్ల డబుల్ డెక్కర్ బస్సులతో ట్రయల్ రన్ వేశారు. ఈ డబుల్ డెక్కర్ బస్సులను నడిపేందుకు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు మహానగర రవాణా సంస్థ ఈ బస్సులను ప్రయోగాత్మకంగా నడిపింది. నగరంలోని కోయంబేడు, సెంట్రల్ స్టేషన్, బ్రాడ్వే, మాధవరం, పూందమల్లి, తాంబరం, ఆవడి ప్రాంతాల మీదుగా డబుల్ డెక్కర్ బస్సుల ట్రయల్ రన్ నిర్వహించారు.ఇటీవల ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించిన ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను తలపించేలా పై అంతస్థుతో, ఎరుపురంగులో ఉన్న ఈ బస్సుల సంచారాన్ని చూసి నగరవాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. రాష్ట్ర రాజధాని నగరం చెన్నైతో పాటు కోల్‌కతా, ఢిల్లీ, ముంబయి నగరాల్లో డబుల్ డెక్కర్ బస్సులు 1970 నుంచే నడిచాయి.

# ఒకే చోట 80 మృతదేహాలు పాతిపెట్టాను.. ధర్మస్థల కేసులో సాక్షి సంచలన విషయాలు



**ధర్మస్థల–నవభూమి:** దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కర్ణాటక ధర్మస్థల సామూహిక మృతదేహాల ఖననం ఘటనలో సిట్ అధికారులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. విజిల్ బ్లోయర్ ఇచ్చిన ఆధారాలు, చెప్పిన విషయాలతో ధర్మస్థల లో తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ కేసును వెలుగులోకి తీసుకువచ్చిన ప్రధాన సాక్షి.. తాజాగా సంచలన ఆరోపణలు చేశాడు. ధర్మస్థల ఆలయాన్ని పాలకుల ఆదేశాలతో ఒకే ప్రదేశంలో 70 నుంచి 80 మృతదేహాలను స్వయంగా తానే గొయ్యి తీసి పాతిపెట్టానట్లు అంగీకరించాడు. ధర్మస్థల ఆలయానికి సంబంధించి.. గతంలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేసిన ఆ సాక్షి.. కొన్ని రోజుల క్రితం బయటికి వచ్చి.. సంచలన విషయాలను బయటపెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 1998 నుంచి 2014 మధ్య శానిటైజేషన్ వర్కర్‌గా పనిచేసిన ఆ వ్యక్తి.. ఆ సమయంలో తాను కొన్ని వందల మృతదేహాలు ఖననం చేసినట్లు వెల్లడించడం దేశం మొత్తం ఉలిక్కిపడేలా చేసింది.అయితే ఎలాంటి మరణ ధ్రువీకరణ పత్రాలు (డెత్ సర్టిఫికెట్) లేకుండానే నేత్రావతి నది ఒడ్డున ధర్మస్థల అటవీ ప్రాంతంలో తాను ఒక్కడినే చాలా శవాలను గొయ్యితీసి పాతిపెట్టినట్లు ఆ ప్రధాన సాక్షి తెలిపాడు. గత 20 ఏళ్లలో ధర్మస్థల ఆలయ పర్యవేక్షకులు తనపై ఒత్తిడి తీసుకురావడంతో చిన్న పిల్లలు, మహిళలు సహా చాలా మంది మృతదేహాలను తానే పూడ్చి పెట్టినట్లు ధర్మస్థల పోలీసులకు ఆ ప్రధాన సాక్షి ఫిర్యాదు చేయడంతో ఈ కేసు బయటికి వచ్చింది. ఈ వ్యవహారంపై కర్ణాటకలో అధికారంలో ఉన్న సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేసి.. విచారణ జరిపిస్తోంది.

ఇప్పటివరకు ధర్మస్థలలో ప్రధాన సాక్షి చూపించిన 15 ప్రాంతాల్లో సిట్ అధికారులు తవ్వకాలు జరిపించగా.. సైట్ నంబర్ 6లో మాత్రమే ఓ మానవ అస్థిపంజరం లభించింది. సైట్ నంబర్ 13లో తాను 70 నుంచి 80 మృతదేహాలను పాతిపెట్టినట్లు వెల్లడించాడు. భూమి లోపల చాలా లోతుగా తవ్వి మృతదేహాలు పాతిపెట్టినట్లు చెప్పాడు. స్థానిక అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే నేరుగా ధర్మస్థల ఆలయ పాలకులే ఆదేశాలు జారీచేసేవారని పేర్కొన్నాడు. అంతేకాకుండా అటవీ ప్రాంతాలు, పాత రోడ్లపైన మాత్రమే మృతదేహాలను పాతిపెట్టేవాళ్లమని.. ఎప్పుడూ శ్మశాన వాటికల్లో పాతిపెట్టలేదని చెప్పాడు. ఆలయ పాలకులు చెప్పిన చోటే తవ్వి పూడ్చిపెట్టేవాళ్లమని వివరించాడు.

ఇక చనిపోయిన వారిపై లైంగిక దాడులు జరిగినట్లు స్పష్టమైన ఆనవాళ్లు కనిపించాయని ఆ సాక్షి పేర్కొన్నాడు. దాదాపు 100 శవాలను తమ టీమ్ పాతిపెట్టిందని.. అందులో 90 మహిళల మృతదేహాలే ఉన్నట్లు వివరించాడు. ధర్మస్థల ఆలయ మేనేజర్ ఎప్పుడూ తనను నేరుగా పిలవలేదని.. అతని వద్ద ఉండే వ్యక్తి ద్వారానే ఆదేశాలిచ్చేవారని చెప్పాడు. వర్షాలతో భూమి కోతకు గురికావడం, అడవులు పెరిగిపోవడం, నిర్మాణ పనుల కారణంగా పాతిపెట్టిన కొన్ని ప్రదేశాలను గుర్తించలేకపోయినట్లు తెలిపాడు. పగటి సమయంలో తాము శవాలను పాతిపెట్టినపుడు కొందరు స్థానికులు చూసినా.. ఎవరూ ఆపలేదని, ప్రశ్నించలేదని పేర్కొన్నాడు.శవాల మీది నగలను తాను దోచుకుని ధర్మస్థల ఆలయ పవిత్రతను అప్రతిష్ట పాలు చేయడానికి తాను ప్రయత్నిస్తున్నానని కొందరు ఆరోపణలు చేస్తున్నారని.. అయితే అవన్నీ తప్పని విజిల్ బ్లోయర్ వెల్లడించాడు. ఆలయ ప్రతిష్టను నాశనం చేస్తే తనకు ఏమొస్తుందని ప్రశ్నించాడు. ఇన్నేళ్ల తర్వాత ఈ విషయం ఎందుకు బయటపెట్టానని అందరూ తనను ప్రశ్నిస్తున్నారని.. అయితే చేసిన తప్పులు తనను వెంటాడుతున్నాయని.. కలలో కూడా అస్థిపంజరాలు కనిపిస్తున్నాయని చెప్పాడు.పాతిపెట్టిన మృతదేహాలు, వాటి అవశేషాలను వెలికితీసేందుకు సిట్ అధికారులు మరింత విస్తృతంగా తవ్వకాలు చేపడతారని తాను నమ్ముతున్నట్లు ప్రధాన సాక్షి వెల్లడించాడు. వారు తనను నమ్ముతున్నట్లు అనిపించకపోయినా.. తాను మాత్రం వారిని నమ్ముతానని స్పష్టం చేశాడు. 10, 15 ఏళ్ల క్రితం ఉన్న పరిసరాలు ఇప్పుడు ఆ అటవీ ప్రాంతంలో లేవని.. అయినప్పటికీ తనకు ఉన్న జ్ఞాపకశక్తితో తాను వాటిని చూపిస్తున్నట్లు వివరించాడు.

### తన పిల్లల బాధ చూడలేక.. ట్రాఫిక్ కష్టాలకు

# శాశ్వత పరిష్కారం చూపిన డీకే శివకుమార్



**బెంగుళూరు–నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగుళూరు నగరం ఎదుర్కొంటున్న తీవ్రమైన ట్రాఫిక్ సమస్య గురించి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. విధానసభలో ఈ అంశంపై మాట్లాడుతూ.. బెంగుళూరులో ట్రాఫిక్ పరిస్థితి ఎంతగా దిగజారిందంటే, తన సొంత పిల్లలు కూడా ప్రతిరోజూ తమ ప్రయాణ సమయం గురించి ఫిర్యాదు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మాటలు బెంగుళూరులోని ప్రతి పౌరుడి సమస్యను ప్రతిబింబించాయన్నారు. అందుకే ఈ సమస్యకు పరిష్కారం కనుగొనడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యంగా బెంగుళూరులో ట్రాఫిక్ విపరీతంగా పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయని శివకుమార్ వివరించారు. ప్రస్తుతం ఈ నగరంలో దాదాపు 1.2 కోట్ల వాహనాలు ఉన్నాయని చెప్పారు. అంతేకాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి ప్రతిరోజూ మరో 40 లక్షల వరకూ వాహనాలు బెంగుళూరులోకి ప్రవేశిస్తున్నాయని తెలిపారు. ఈ సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉందన్నారు. వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ.. నగరంలోని రోడ్ల మౌలిక సదుపాయాలు మాత్రం ఆ వేగానికి అనుగుణంగా విస్తరించలేకపోయాయని పేర్కొన్నారు.నగరంలో రోడ్లను విస్తరించడం కూడా చాలా కష్టమైన పనిగా మారిందని శివకుమార్ వెల్లడించారు. అధిక భూమి ధరలు, ఖరీదైన ఆస్తులు కారణంగా రోడ్ల వెడల్పు పెంచడం దాదాపు అసాధ్యంగా మారిందన్నారు. ముఖ్యంగా బెంగుళూరు మెట్రో, సిటీ బస్సులు వంటి ప్రజారవాణా వ్యవస్థ విస్తరిస్తున్నప్పటికీ.. అది పెరుగుతున్న వాహనాల సంఖ్యకు తగ్గ పరిష్కారాన్ని అందించలేక పోతోందని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ సమస్యను సమూలంగా పరిష్కరించడానికి ప్రభుత్వం కొత్త ఆలోచనలతో ముందుకు రావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.అందుకే తానొక పరిష్కారం తీసుకు వచ్చినట్లు చెప్పారు. ముఖ్యంగా బెంగుళూరు ట్రాఫిక్ సమస్యకు ఒక వినూత్న పరిష్కారాన్ని ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. నగరంలోని ప్రధాన మార్గాల్లో పెద్ద ఎత్తున డబుల్–డెక్కర్ ఫ్లైఓవర్లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఈ ప్రతిపాదన కేవలం ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతుందని తెలిపారు. ఈ ప్రణాళికను తాను గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించినట్లు శివకుమార్ వెల్లడించారు.ఈ ఆలోచనను ప్రధాని మోదీ కూడా ప్రశంసించారని.. అంతేకాకుండా దీనిని మరింత విస్తరించాలని, ఫ్లైఓవర్ల పైకప్పులపై సౌర ఫలకాలను అమర్చాలని సూచించారని తెలిపారు. ఈ ఆలోచన విద్యుత్ ఉత్పత్తికి కూడా ఉపయోగపడుతుందని, తద్వారా పర్యావరణానికి మరింత మేలు జరుగుతుందని ప్రధాని మోదీ అభిప్రాయ పడ్డారని శివకుమార్ పేర్కొన్నారు. ఈ డబుల్–డెక్కర్ ఫ్లైఓవర్ల కింద ఉన్న ఖాళీ ప్రదేశాన్ని పార్కింగ్ లేదా ఇతర ప్రజా అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చని వివరించారు. డి.కె. శివకుమార్ చేసిన ఈ ప్రకటన బెంగుళూరు ప్రజల్లో ఆశను రేకెత్తిస్తోంది. ఈ ప్రణాళిక కార్యరూపం దాలిస్తే.. నగరంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందని, బెంగుళూరు జీవన నాణ్యత కూడా మెరుగుపడుతుందని అంతా భావిస్తున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని.. త్వరలోనే ప్రజలకు ఒక శాశ్వత పరిష్కారం లభిస్తుందని శివకుమార్ హామీ ఇచ్చారు.

## ధర్మస్థల వివాదంలో బిగ్ ట్విస్ట్..

### సుజాత భట్ కూతురు నిజంగానే మిస్సయ్యిందా?

**బెంగళూరు–నవభూమి:** కర్ణా టకలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మస్థల వివాదం ఇప్పుడు దుమారం రేపుతోంది. గత రెండు దశాబ్దాల్లో అనేక మంది మహిళలు అక్కడ హత్యకు గురయ్యారని.. వారిలో దాదాపు 80 మంది మహిళలను తానే పాతిపెట్టానని ఓ రిటైర్డ్ ఉద్యోగి ఫిర్యాదు చేయడంతో ఈ వార్త దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ క్రమంలోనే తన కూతురు కూడా ధర్మస్థలకు వెళ్లి అదృశ్యమైందని సుజాత భట్ అనే మహిళ ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. కానీ సుజాత భట్ బ్యాక్‌గ్రౌండ్ గురించి ఎంక్వైరీ చేసినప్పుడు మాత్రం పలు సందేహాలకు తావిస్తోంది. నిజానికి అసలు ఆమెకు కూతురు కూడా లేదేమోనన్న అనుమానం కలుగుతోంది.మణిపాల్ హాస్పిటల్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న తన కూతురు అనన్య భట్.. 2003లో తన స్నేహితులతో కలిసి ధర్మస్థలకు వెళ్లిందని.. అప్పట్నుంచి కనిపించడం లేదని ఇటీవల సుజాత భట్ ఫిర్యాదు చేశారు. తాను కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయంలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేసేదాన్ని.. వీఆర్ఎస్ తీసుకుని 2004లో బెంగళూరు వచ్చి స్థిరపడ్డానని తెలిపారు. అయితే ‘ సేకరించిన వివరాలు, ప్రత్యక్ష సాక్షుల విచారణ, అధికారుల నుంచి సమాచారం తీసుకున్నప్పుడు సుజాత భట్ చేసిన వ్యాఖ్యల్లో పలు అసమానతలు కనిపించాయి.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాత భట్ కోల్‌కతాలో నివసించలేదు. 1999 నుంచి 2007 వరకు శివమొగ్గ జిల్లా రిప్పన్‌పేటలో ఉండేది. అప్పటికి ఆమెకు పెళ్లి కాలేదు కానీ.. ఉడిపికి చెందిన మాజీ బస్ ఏజెంట్ ప్రభాకర్ బలిగ అలియాస్ నై ప్రభాకర్‌తో ఆమె సహజీవనం చేసింది. వారిద్దరికీ సంతానం లేకపోవడంతో వీధి కుక్కలను దత్తత తీసుకుని వాటిని తమ కన్నపిల్లలుగా చూసుకునేవారు. దీనికి సంబంధించి 2002, 2003లో కమలవాణి, సుధ వంటి వార్త పత్రికల్లో పలు కథనాలు కూడా ప్రచురించబడ్డాయి. ప్రభాకర్ బలిగ స్నేహితుడు టీఆర్ కృష్ణప్ప కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ‘ సుజాతను మేం ఇక్కడ ప్రతిరోజూ చూసేవాళ్లం. ఆమెకు పిల్లలు లేరు. అసలు అనన్య అనే అమ్మాయే లేదు’ అని తెలిపారు. ప్రభాకర్ బలిగ తాగుబోతు. అతను 2007లో సుజాతను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో రిప్పన్‌పేట నుంచి సుజాత బెంగళూరుకు షిఫ్ట్ అయ్యింది. బెంగళూరులో ఓ న్యాయమూర్తి ఇంట్లో పని దొరికిందని పక్కింటి వాళ్లకు చెప్పి వెళ్లింది. ఆ తర్వాత వేరే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్లు సమాచారం.



కాగా సుజాతతో విడిపోయిన రెండేళ్లకు అంటే.. 2009లో ప్రభాకర్ బలిగ మరణించాడు.సుజాత 1995 నుంచి 2004 వరకు కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయంలో స్టెనోగ్రాఫర్‌గా పనిచేశానని చెబుతున్నారు. కానీ కోల్‌కతా సీబీఐ అధికార ప్రతినిధిని సంప్రదించగా.. 1999 నుంచి 2010 వరకు ఆ పేరుతో ఎవరూ ఉద్యోగం చేయలేదని స్పష్టం చేశారు. సుజాత బావ మహాబలేశ్వర మాట్లాడుతూ.. ఆమె పదో తరగతి వరకు మాత్రమే చదువుకుందని తెలిపాడు. 2000 వరకు బెంగళూరులోకి కిరాణ షాపులో పనిచేసి, తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయిందని పేర్కొన్నాడు.అనన్య కనిపించడం లేదని ఆమె స్నేహితురాలు రష్మి ఫోన్ చేసిన వెంటనే తాను ధర్మస్థల, బెల్తంగడి పోలీస్ స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేశానని సుజాత భట్ తెలిపారు. కానీ పోలీసులు అప్పుడు తన ఫిర్యాదు తీసుకోకుండా దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ‘ నీ కూతురు ఎక్కడుందో మాకు తెలియదు. ఎవరితోనో వెళ్లిపోయి ఉంటుంది. అయినా ఇక్కడకు రోజూ చాలామంది వస్తూ ఉంటారు.. పోతూ ఉంటారు. అందరి కంప్లయింట్‌లు తీసుకోవడం సాధ్యం కాదు’ అని చెప్పి తనను స్టేషన్ బయటకు పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించకపోవడతో ధర్మస్థల ఆలయ ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే, ఆయన సోదరుడు, ఆలయ ప్రధాన నిర్వాహకుడు హర్షేంద్ర కుమార్‌లను కలిశానని చెప్పారు.

# అసెంబ్లీ హాల్లోనే బీజేపీ ఎమ్మెల్యేల ఘర్షణ



**లక్నో–నవభూమి:** ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో శుక్రవారం జరిగిన ఒక సంఘటన అధికార పార్టీ బీజేపీకి ఇబ్బందులను తెచ్చిపెట్టింది. సాధారణంగా అధికార పార్టీ సభ్యుల మధ్య సఖ్యత ఉంటుంది. కానీ తాజాగా ఇద్దరు బీజేపీ ఎమ్మెల్యేలు ఒకరిపై ఒకరు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ‘విజన్ 2047’పై చర్చ జరుగుతున్న సమయంలో.. ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య మొదలైన ఈ ఘర్షణ కొట్టుకునే వరకూ వెళ్లింది. కానీ ఇతర సభ్యులు జోక్యం చేసుకొని సర్దుబాటు చేయడంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా.. రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్?గా మారింది. అసలు గొడవకు కారణం ఏంటంటే?

మధుర నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజేష్ చౌదరి, వారణాసి ఎమ్మెల్యే సౌరభ్ శ్రీవాస్తవ మధ్య ఈ ఘర్షణ చోటుచేసుకుంది. అసెంబ్లీలో ‘విజన్ 2047’ అంశంపై అధికార పార్టీ తరపున ఎవరు మాట్లాడాలనే విషయంలో ఈ వివాదం మొదలైంది. చర్చలో మాట్లాడటానికి తన పేరును స్పీకర్‌కు పంపకుండా సౌరభ్ శ్రీవాస్తవ అడ్డుకున్నారని రాజేష్ చౌదరి ఆరోపించారు. ఈ విషయంలో చౌదరి తన సహచర ఎమ్మెల్యే శ్రీవాస్తవపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిద్దరూ ఒకరిపై ఒకరు అరుచుకుంటూ ముందుకు వెళ్లగా.. పరిస్థితి చేయి దాటిపోకుండా అరికట్టడానికి ఇతర సభ్యులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అసెంబ్లీ హాల్లోనే వీరిద్దరూ తగువులాడుకోవడంతో.. ఈ వీడియో కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది.

ముఖ్యంగా ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ తన అధికారిక ‘ఎక్స్’ ఖాతా వేదికగా షేర్ చేశారు. అధికార పార్టీకి చెందిన నాయకుల ‘అమర్యాదపూర్వక ప్రవర్తన’, ‘అసభ్యకరమైన భాష’ పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. “ఇదేనా బీజేపీ నాయకుల సంస్కారం?” అని ప్రశ్నిస్తూ.. ప్రజాస్వామ్య వేదికలపై ఈ విధమైన ప్రవర్తన తగదని విమర్శించారు. అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలతో ఈ అంశం రాజకీయ రంగు పులుముకుంది. ప్రతిపక్షం ఈ అంశాన్ని ఒక అస్త్రంగా వాడుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు స్పష్టమైంది.అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యలకు రాజేష్ చౌదరి అంతే ధీటుగా స్పందించారు. మతపెద్ద మౌలానా సాజిద్ రషీదీ.. అఖిలేష్ యాదవ్ భార్య, ఎంపీ డింపుల్ యాదవ్ పట్ల చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని చౌదరి ప్రశ్నించారు. డింపుల్ యాదవ్ బురఖా లేకుండా మసీదును సందర్శించడంపై మౌలానా అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కుటుంబ గౌరవం విషయంలో అఖిలేష్ యాదవ్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. ఈ విధంగా వ్యక్తిగత విమర్శలు, రాజకీయ దాడితో ఈ వివాదం మరింత జటిలంగా మారింది.

# పంద్రాగస్టు వేడుకల వేళ తమిళనాడులో రాజకీయ వైరం.. ఎట్ హెూం కార్యక్రమానికి దూరంగానే సీఎం



**చెన్నై–నవభూమి:** భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న వేళ.. తమిళనాడులో రాజకీయ వాతావరణం మాత్రం వేడెక్కింది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్.. గవర్నర్ ఆర్.ఎన్. రవి రాజ్ భవన్‌లో నిర్వహించిన ఎట్ హెూమ్ కార్యక్రమాన్ని బహిష్కరించారు. గవర్నర్ చర్యలు “తమిళనాడుకు వ్యతిరేకంగా” ఉన్నాయని ఆరోపిస్తూ.. ఆయన ఇచ్చే తేనీటి విందుకు హాజరు కాకూడదని ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు. ఈ బహిష్కరణ రాష్ట్ర ప్రభుత్వం, రాజ్ భవన్ మధ్య కొనసాగుతున్న తీవ్రమైన రాజకీయ సంఘర్షణకు పరాకాష్టగా నిలిచింది.తమిళనాడు ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య జరుగుతున్న వివాదం కొత్తదేమీ కాదు. గవర్నర్ రవి, తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులకు ఆమోదం తెలపకుండా జాప్యం చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం గత కొంతకాలంగా ఆరోపిస్తోంది. ఈ వివాదం సుప్రీంకోర్టు వరకు కూడా వెళ్లింది. ఇటీవలే ‘కలైంజ్ఞర్ యూనివర్సిటీ’ ఏర్పాటు కోసం అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతికి పంపడంపై అధికార డీఎంకే పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది గవర్నర్ ఉద్దేశపూర్వక జాప్యమని.. రాష్ట్ర శాసనసభ అధికారాలను అణగదొక్కే ప్రయత్నమని డీఎంకే నాయకులు విమర్శించారు.త్వరలో 2 కొత్త ఎయిర్‌పోర్టులు, ఈ ప్రాంతాల్లోనే.. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ ప్రకటన

ముఖ్యంగా గవర్నర్ రవి.. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం, ప్రధాన మంత్రిని విస్తృతంగా ప్రశంసించారు. అయితే తమిళనాడు ప్రభుత్వం గురించి ఒక్క మంచి మాట కూడా చెప్పలేదు. అంతేకాకుండా రాష్ట్రంలో ఉన్న తీవ్రమైన సవాళ్లు, సామాజిక వివక్ష, ఆత్మహత్యల రేటు, మాదకద్రవ్యాల వినియోగం, మహిళలు, పిల్లలపై లైంగిక నేరాల వంటి విషయాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో డీఎంకే నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గవర్నర్ వ్యాఖ్యలపై తమిళనాడు స్థానిక పాలన మంత్రి కె.ఎన్. నెహ్రూ తీవ్రంగా ప్రతిస్పందించారు.

గవర్నర్ ఒక రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిలా కాకుండా.. రాజకీయ ప్రత్యర్థిలా వ్యవహరిస్తున్నారని, ఆయన చేసిన ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి వివరించారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, వివిధ రంగాలలో తమిళనాడు సాధించిన అగ్రస్థానం గురించి అధికారిక గణాంకాలను ఆయన కావాలనే విస్మరించారని తెలిపారు. కేవలం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ విధమైన ప్రతికూల వ్యాఖ్యలు చేయడం గవర్నర్ పదవికి తగదని అన్నారు. ఈక్రమంలోనే సర్కారు నిరసనను వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా ఈరోజు రాజ్ భవన్‌లో గవర్నర్ ఇవ్వబోయే తేనీటి విందుకు హాజరు కాకూడదని నిర్ణయించుకున్నారు.

ఇది మాత్రమే కాకుండా గవర్నర్‌పై తమకు ఉన్న వ్యతిరేకతను అనేక మంది నిర్మొహమాటంగా చూపించేస్తున్నారు. ఇటీవలే ఉన్నత విద్యా శాఖ మంత్రి కె. పొన్ముడి విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాలకు హాజరుకాకూడదని నిర్ణయించుకున్నారు. రెండ్రోజుల క్రితమే ఒక పీహెచ్‌డీ విద్యార్థిని కూడా గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీ తీసుకోవడానికి నిరాకరించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. తమిళనాడు రాజకీయాల్లో గవర్నర్, ప్రభుత్వం మధ్య ఉన్న లోతైన రాజకీయ వైరాన్ని బట్టబయలు అయంది.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | శనివారం | 16 । ఆగస్టు । 2025





# అమెరికాలో భారత విద్యార్థుల ఆందోళన

**వాషింగ్టన్-నవభూమి:** డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. ఆర్థిక చర్యలు భారతదేశం-అమెరికా సంబంధాలపై ముఖ్యంగా అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. : డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలు.. ఆర్థిక చర్యలు భారతదేశం-అమెరికా సంబంధాలపై ముఖ్యంగా అమెరికాలో చదువుతున్న భారతీయ విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల భారత్ నుండి అమెరికాకు వెళ్లే ఎగుమతులపై 50% వరకు సుంకాలను పెంచే నిర్ణయం, విద్య, ఉపాధి కోసం అక్కడున్న భారతీయుల భవిష్యత్తుపై ఆందోళనలను పెంచుతోంది. ఈ నిర్ణయానికి ప్రధాన కారణం భారతదేశం రష్యా నుండి చమురు దిగుమతులు చేసుకోవడమేనని అమెరికా పేర్కొంటున్నప్పటికీ, రాజకీయ, ఆర్థిక కారణాలు ఇందులో ఇమిడి ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సుంకల పెంపుతో భారతీయ విద్యార్థుల ఆందోళనలు ట్రంప్ విధించిన ఈ సుంకాలు అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు దారితీశాయి. ఇది ఇప్పటికే లక్షల రూపాయల విద్యా రుణాలు తీసుకుని అక్కడికి వెళ్లిన విద్యార్థులకు అదనపు భారం అవుతోంది. గతంలో వారానికి సరిపడా సరుకులు 150తో వచ్చేవని, కానీ ఇప్పుడు 3-4 రోజులకు కూడా సరిపోవడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వాణిజ్య యుద్ధం కారణంగా జీవన వ్యయం పెరగడం, ఆర్థిక ఒత్తిడి పెరగ దం వంటి సమస్యలను వారు ఎదు ర్కొంటున్నారు. దిగుమతి సుంకా కారణంగా వస్తు వుల ధరలు



# మేఘ విస్ఫోటం

మేఘ విస్ఫోటం అనేది ఆకాశంలో ఏర్పడే ఒక అత్యంత తీవ్రమైన వాతావరణ సంఘటన. సాధారణంగా ఒక ప్రదేశంలో గంటలో 100 మిల్లీమీటర్లకు మించిన వర్షపాతం నమోదైనప్పుడు దాన్ని మేఘ విస్ఫోటం అని వ్యవహరిస్తారు. దీని పేరు వింటే మేఘం పగిలిపోయి నీరు కిందకు పడిపోతున్నట్టుగా అనిపించినా, శాస్త్రీయంగా అది అలా జరగదు. వాస్తవానికి ఇది వాతావరణంలోని తేమతో నిండిన గాలి ఒక్కసారిగా చల్లబడటం, కండెన్స్ అవడం, ఆపై పెద్ద మొత్తంలో వర్షం రూపంలో కిందికి కురవడం వల్ల జరుగుతుంది. మేఘ విస్ఫోటం ఎక్కువగా పర్వత ప్రాంతాల్లో, ముఖ్యంగా హిమాలయ ప్రాంతంలో సంభవిస్తుంది. కారణం అక్కడి భౌగోళిక స్వరూపం, పర్వతాల ఎత్తు, గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉండటం. సముద్రం లేదా పెద్ద నీటి వనరుల నుండి వచ్చిన తేమ గాలి పర్వతాలను ఢీకొని పైకి ఎగసి వెళ్తుంది. పైకి ఎగసిన గాలి చల్లబడినప్పుడు అందులోని నీటి ఆవిరి కండెన్స్ అయి క్యూములోనింబస్ అనే భారీ వర్షపు మేఘాలను ఏర్పరుస్తుంది. కొన్ని సందర్భాల్లో వాతావరణంలో ఉన్న గాలి నిల్వలు చల్లబడిపోవడంతో ఆ మేఘాల నుండి విపరీతమైన నీరు ఒక్కసారిగా కిందికి దూకుతుంది. ఈ సంఘటన జరిగే వేళ తక్కువ విస్తీర్ణంలోనే విపరీత వర్షపాతం నమోదవుతుంది.భారతదేశంలో మేఘ విస్ఫోటం ఎక్కువగా జరిగే ప్రాంతాలు జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ వంటి హిమాలయ రాష్ట్రాలు. పర్వత ప్రాంతాల్లో మేఘ విస్ఫోటం వల్ల ఎక్కువగా నష్టాలు జరుగుతాయి, ఎందుకంటే అక్కడ లోయలు, కొండచరియలు ఉన్న కారణంగా నీరు ఒక్కసారిగా దిగువకు దూకి ఫ్లాష్ ఫ్లడ్‌లకు దారి తీస్తుంది. వీటి వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పర్యావరణ నష్టం జరుగుతుంది. ఉదాహరణకు 2010లో లడఖ్‌లో లేహ్ ప్రాంతంలో జరిగిన మేఘ విస్ఫోటం సుమారు 300 మందికి పైగా ప్రాణాలు తీసింది. పట్టణంలోని ఇళ్ళు, వంతెనలు, రహదారులు పూర్తిగా కొట్టుకుపోయాయి. 2013లో ఉత్తరాఖండ్‌లో కేదార్నాథ్‌లో జరిగిన మేఘ విస్ఫోటం అతివృష్టి వల్ల 5,000 మందికి పైగా మరణించారు, వేలాది యాత్రికులు చిక్కుకుపోయారు. 2021లో హిమాచల్ ప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటన జరిగి పలు వంతెనలు, ఇళ్ళు నాశనం అయ్యాయి.మేఘ విస్ఫోటం కారణంగా జరిగే ప్రభావాలు మానవ సమాజంపై తీవ్రమైనవిగా ఉంటాయి. ఆకస్మిక వరదలు ఊహించని వేళలో వస్తాయి కాబట్టి ప్రజలకు తప్పించుకునే అవకాశం చాలా తక్కువ. పర్వత ప్రాంతాల్లో భూస?లనం, రహదారులు కొట్టుకుపోవడం, పంటలు నాశనం కావడం వంటి పరిణామాలు జరుగుతాయి. పర్యావరణపరంగా మట్టి ఎరోజన్, అడవుల నష్టం, జీవ వైవిధ్యం తగ్గిపోవడం జరుగుతుంది. నదుల్లో ఒక్కసారిగా నీటి మట్టం పెరగడం వల్ల కింద ప్రాంతాల్లో కూడా వరదలు రావచ్చు.వాతావరణ మార్పులు మేఘ విస్ఫోటాల సంఖ్యను తీవ్రతను పెంచుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గ్లోబల్ వార్మింగ్ వల్ల సముద్రాల నుండి అధిక తేమ ఆవిరవుతుంది. ఈ తేమ గాలి రూపంలో వాతావరణంలో చేరి, వర్షపు మేఘాలను మరింత శక్తివంతం చేస్తుంది. ఫలితంగా తక్కువ కాలంలో ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. అంతేకాకుండా పర్వత ప్రాంతాల్లో అనియంత్రిత నిర్మాణాలు, అడవుల నరికివేత, రహదారుల విస్తరణ వంటి మానవ చర్యలు కూడా నష్టాలను మరింత పెంచుతున్నాయి.మేఘ విస్ఫోటం వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు కీలకం. డాప్లర్ వాతావరణ రాడార్లు, ఉపగ్రహాల ద్వారా వర్షపాతం అంచనాలను ఖచ్చితంగా ఇవ్వడం అవసరం. పర్వత ప్రాంతాల్లో నిర్మాణాలను పర్యావరణ నియమాలకు అనుగుణంగా మాత్రమే అనుమతించడం, పర్యాటకులను వర్షకాలంలో సురక్షిత ప్రాంతాలకు మాత్రమే అనుమతించడం వంటి చర్యలు తీసుకోవాలి. అలాగే పౌరులలో అవగాహన పెంచడం, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచడం అవసరం.మేఘ విస్ఫోటం సహజ విపత్తే అయినా, మనిషి చర్యల వల్ల దాని ప్రభావం మరింత ప్రమాదకరంగా మారుతోంది. అడవులను కాపాడడం, పర్యావరణ సమతుల్యతను కాపాడే విధంగా అభివృద్ధి పనులు చేయడం, వాతావరణ అంచనాలను మెరుగుపరచడం, ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఈ విపత్తు వల్ల కలిగే నష్టాలను తగ్గించవచ్చు. సహజ వనరులను సంరక్షించడం, పర్వత ప్రాంతాల్లో నివాసాలను మౌలిక వసతులను సురక్షితంగా ఉంచడం, వాతావరణ మార్పులను తగ్గించడానికి గ్లోబల్ స్థాయిలో చర్యలు తీసుకోవడం అత్యవసరం. భవిష్యత్తులో మేఘ విస్ఫోటం వంటి సంఘటనలు జరగకుండా అడ్డుకోవడం సాధ్యం కాకపోయినా, వాటి ప్రభావాన్ని గణనీయంగా తగ్గించడం మాత్రం మన చేతుల్లోనే ఉంది.మేఘ విస్ఫోటం కారణంగా జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటక రంగం, వ్యవసాయం, మౌలిక వసతులపై తీవ్రమైన ప్రభావం పడుతుంది. పర్యాటక సీజన్‌లో జరిగే ఈ విపత్తులు, రాష్ట్ర ఆదాయాన్ని దెబ్బతీస్తాయి. పర్వత ప్రాంతాల్లో రహదారులు కొట్టుకుపోవడం, వంతెనలు కూలిపోవడం వల్ల రక్షణ చర్యలు ఆలస్యం అవుతాయి. స్థానిక గ్రామస్తుల జీవనోపాధి వ్యవసాయం, పశుపోషణపై ఆధారపడి ఉండటం వల్ల, వరదల వల్ల పొలాలు, మేత భూములు నాశనం కావడం, ఆర్థికంగా వారిని దెబ్బతీస్తుంది.

# ఫాసిజం కింద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అపహాస్యం



**ఆర్.** ఎస్.ఎస్ ఫాసిజాన్ని కూలదోయడమే స్వాతంత్ర్యానికి మార్గం!

ఒక వేడుక ఉద్దేశానికి వాస్తవ పరిస్థితులకు మధ్య ప్రాథమిక వ్యత్యాసం ఉన్నప్పుడు, అది అర్థరహితంగా అపహాస్యంగా మారుతుంది. ఉదాహరణకు, భారతదేశంలో, లోతైన సామాజిక విభజనల మధ్య విస్తృతమైన పేదరికం, నిరుద్యోగం, అణగారిన ముస్లింలు దళితుల భారీ మినహాయింపు హక్కుల రద్దుతో సహా అణచివేత, అసమ్మతి, భావ ప్రకటనా స్వేచ్ఛ స్వతంత్ర అభిప్రాయాలను దేశద్రోహంగా ముద్ర వేస్తున్న పరిస్థితుల్లో, "లాంఛనప్రాయ స్వాతంత్ర్యం" కూడా ఒక భ్రమగా మారుతుంది. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆగస్టు 15, 2025న జరుగుతున్న ప్రస్తుత భారతీయ పరిస్థితి ఇది. ఈ సందర్భంలో, 1950లో రాజ్యాంగాన్ని ఆమోదించినప్పుడు భారతదేశం ఒక ప్రజాస్వామ్య దేశంగా నిలబడగలదా అని డాక్టర్ అంబేద్కర్ లేవనెత్తిన ఆందోళనలను గుర్తుంచుకోవడం విలువైనది.నేడు, భారతదేశం విషయం రూపం, దాని అన్ని రూపాలలోనూ 21వ శతాబ్దపు ఫాసిజానికి ఒక విలక్షణ ఉదాహరణగా మారింది. నేడు దేశాన్ని పాలిస్తున్న బిజెపి, ప్రపంచంలోనే అతిపెద్ద సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న ఫాసిస్ట్ సంస్థ అయిన ఆర్.ఎస్.ఎస్ రాజకీయ సాధనం. ప్రభుత్వంలోని అన్ని సంస్థలు ఫాసిస్టుల కబంధ హస్తాల్లో ఉన్నాయి. కార్పొరేట్లు అతి- మితవాద పాలన మధ్య అపవిత్ర సంబంధంగా నిర్వచించబడిన ఆశ్రిత పెట్టుబడిదారీ



విధానం(క్రోనీ క్యాపిటలిజం) బోర్డు గదులు కాషాయ థింక్-ట్యాంక్‌లు (ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక సిద్ధాంత నిపుణుల బృందం)విధాన నిర్ణయాలను నిర్దేశిస్తుండగా, పార్లమెంటు ఒక కట్టడంగా లేదా కేవలం ప్రేక్షక పాత్రగా మారింది. పౌరసత్వం, లౌకికవాదం, ఎన్నికలు, రిజర్వేషన్, ప్రజాస్వామ్య హక్కులు, సమాఖ్యవాదం మొదలైనవాటికి సంబంధించిన వివిధ రాజ్యాంగ పరిపాలనా చర్యల ద్వారా ఫాసిస్ట్ పాలన రాజ్యాంగ స్వభావం నిర్మాణాన్ని బలహీనపరుస్తున్నప్పుడు, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం స్వాతంత్ర్యాన్ని నిలబెట్టడానికి కట్టుబడి ఉన్న న్యాయవ్యవస్థ కూడా విషపూరితమైన వాస్తవాలకు తెలియకుండా ఉన్నట్లుగా కనిపిస్తుంది.వీటన్నింటి గురించి ఇక్కడ వివరంగా విశ్లేషించాలనే ఉద్దేశ్యం లేదు. ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు "వికసిత్ భారత్"తో పాటు "నయా భారత్" అనే థీమ్‌తో జరుగుతుండగా, దేశంలోని 40% కంటే ఎక్కువ సంపద కేవలం ఒక శాతం మంది అత్యంత సంపన్నులు బిలియనీర్ల చేతుల్లో ఉంది. ప్రపంచంలోని "నిరపేక్ష పేదలు"లో సగం కంటే ఎక్కువ మంది ఉన్న భారతదేశం 'పేదరికానికి కోట'గా మారింది. వారిలో ఎక్కువ మంది దళితులు మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలు. అదే సమయంలో, ప్రభుత్వ అధికారాన్ని వీధుల్లోని అధికారాన్ని రెండింటినీ తన నియంత్రణలో ఉంచుకొని, ఆర్.ఎస్.ఎస్ ఒక మెజారిటీ మనువాద హిందూ రాష్ట్రం వైపు తన వేగాన్ని పెంచుతోంది. ఇందులో ముస్లింలు ద్వితీయ శ్రేణి పౌరులుగా దళితులు, మహిళలు "సనాతన" లేదా మనుస్మృతి ప్రకారం అసమాన ఉప-మానవులుగా ఉంటారు.మోడీ ప్రభుత్వం సంఘ్ పరివార్ 'గోడీ మీడియా' (ఆర్ఎస్ఎస్, భాజాపా ,నరేంద్ర మోడీ అనుకూల మీడియా)తో కలిసి ఈ సంవత్సరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని 'పౌరులలో దేశభక్తిని ప్రోత్సహించడానికి, "ఆపరేషన్ సింధూర్ "విజయాన్ని జరుపుకోవడానికి' ఉపయోగిస్తుండగా, బ్రిటిష్ వ్యతిరేక పోరాట సమయంలో, ఆర్.ఎస్.ఎస్ తనను తాను ఒక సాంస్కృతిక సంస్థగా ప్రొజెక్ట్ చేసుకొని దాని "సాంస్కృతిక జాతీయవాదాన్ని" సమర్థించుకుంటూ, భారత స్వాతంత్ర్య ఉద్యమానికి వలసవాదాన్ని ఎదుర్కొనే రాజకీయ కర్తవ్యం నుండి పూర్తిగా దూరంగా ఉందని మనం మళ్ళీ గుర్తు చేసుకోవలసి వస్తుంది. అధికారం బదిలీ అయిన తర్వాత కూడా, ఆర్.ఎస్.ఎస్ ఈ సామ్రాజ్యవాద దాస్యంలో ఎటువంటి మార్పు జరిగినట్లుగా నిర్దిష్టమైన ఆధారాలు లేవు. బదులుగా, భారతదేశంలో ఫాసిజం నేడు దాని లెక్కలేనన్ని విదేశీ పొడిగింపులు అనుబంధ సంస్థల ద్వారా ప్రపంచ కార్పొరేట్-నయాఫాసిస్ట్ కేంద్రాలతో సంబంధాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతోంది.కాబట్టి, కచ్చితంగా చెప్పాలంటే, అంతర్జాతీయ కార్పొరేట్ పెట్టుబడి రాజకీయ-ఆర్థిక ఆధిపత్యం నుండి అత్యంత అమానవీయ కులతత్వం, మెజారిటీ హిందుత్వ ద్వారా విధించబడిన సామాజిక నిరంకుశత్వం నుండి స్వేచ్ఛతో సహా నిజమైన స్వాతంత్ర్యం కోసం కష్టతరమైన సుదీర్ఘమైన పోరాటం అవసరం. , దీనిని సాధించడానికి ప్రాథమిక తక్షణ కర్తవ్యం ఫాసిస్ట్ పాలనను కూలదోయడం. కనుక, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ, లౌకికవాదం, జీవనోపాధి, ఉద్యోగం అన్నిటికీ మించి భారతీయ ఫాసిజానికి ప్రధాన సిద్ధాంతపరమైన ఆధారం అయిన అత్యంత అమానవీయ మనువాద కుల వ్యవస్థ నిర్మూలన కోసం జరిగే పోరాటంతో పాటు ఫాసిస్ట్ వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేయడం అవసరం.

**పి. జె. జేమ్స్**
**జనరల్ సెక్రటరీ**
**సిపిఐ (ఎం.ఎల్.) రెడ్ స్టార్**
**న్యూఢిల్లీ**
**కొల్లిపర వెంకటేశ్వరరావు,**

# ఉనికి కోల్పోతున్న తెలంగాణ ప్రజలు



ఆస శ్రీరాములు

**తె**లంగాణ ప్రాంత ప్రజలు తమ సొంత ప్రాంతంలోని ఉనికి కోల్పోతున్న ప్రమాదం ఏర్పడుతుంది . హైదరాబాద్ తో సహా ఉత్తర దక్షిణ తెలంగాణ జిల్లాలలో వ్యాపారం విద్య వ్యవసాయం పరిశ్రమలు అన్ని కూడా తెలంగాణ ఏతురుల చేతులకు వెళ్లిపోయాయి . నీళ్లు నిధులు, నియమాకాలు , తెలంగాణ పల్లెల్లోని పేద ప్రజలు దళితులు ఆదివాసీలు లంబాడి గుడాలకు ఇంకా చేరలేదు . ఇంకా ఇంటి జాగా స్థలాల కోసం ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న దుస్థితి నెలకొంది . పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకొని తహసీల్దార్ ఆఫీస్, మండల కార్యాలయాలు కలెక్టర్ ఆఫీస్ ల చుట్టు తిరుగుతున్నారు . తెలంగాణలో 80 శాతం మందికి వారి కుటుంబం పోషించుకునే స్థాయిలో భూములు లేవు . సొంత భూమి కొంత చేసుకొని మరికొంత కౌలుకు చేసుకోవడం లేదా వలస కూలీలుగా బయటకి వెళ్లడం జరుగుతుంది . దీంతో కుటుంబా లు భారం మై పోతున్నా యి.

**పరిశ్రమలలో అన్యాయం**

హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల్లో తెలంగాణ వారికి ఎవరికీ లేవు చెప్పుకోదగ్గ ఫ్యాక్టరీలు అంతకన్నా లేవు ఉన్న పరిశ్రమలన్నీ కూడా తెలంగాణ కాని వారివే స్థానిక యువత గురించి పట్టించుకునే నాయకులు అధికారులు లేరు. ఎవరు ఫ్యాక్టరీ పెట్టిన స్థానికులకు అవకాశం కల్పించడం లేదు . వారు వారి ప్రాంతాల్లో నుండి తీసుకు వచ్చిన వారిని కూలీలుగా, ఉద్యోగులుగా నియమించుకుని ఫ్యాక్టరీలు, సంస్థలను నడిపిస్తున్నారు . స్థానికులకు ఒక్కరు కూడా అవకాశం లేదు . కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే సంస్థలన్నీ దాదాపు మూల కు పడ్డాయి . తెలంగాణ ప్రభుత్వం నుండి అన్ని రకాల సౌకర్యాలు అనుమతులు పొందినవారు స్థానికులకు మాత్రం అవకాశాలు కల్పించట్లేదు . పరిశ్రమల్లో కనీసం కూలీలగా కూడా తెలంగాణ వారు లేరు అంటే ఆతిశయోక్తి కాదు . మా పాలన మేం చేసుకుంటాం అంటే మీకు పరిపాలన చేతకాదు అన్నారు కొందరు !! మా వ్యాపారాలు చేసుకుంటామంటే మీకు వ్యాపారం రాదంటూ హేలనా చేస్తున్నారు మరికొందరు !!!

**ప్రధాన ఇండస్ట్రీ, హోటల్ వ్యాపారం**

హోటల్ వ్యాపారంలో కూడా స్థానికులు లేరు అన్ని పనులకు బయటివారే వ్యాపారాల్లో హోటల్ ఫుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది బస్తీ, గల్లీ నుండి తీసుకుంటే ఫైవ్ స్టార్ హోటల్ వరకు అన్ని తెలంగాణ ఏతరులవి. అందులో పని చేసేవారు కూడా బయటివారు . హైదరాబాదు నగరం విస్తరించినా కొద్ది కొత్త కొత్త తరహాలో హోటల్ వ్యాపారం వస్తుంది అందులో భాగంగా నగరం చుట్టూ ఉన్న దాబాలలో , ఫామ్ హౌస్ లో , టిఫిన్ సెంటర్లలో , వీధి వ్యాపారాల్లో విందులు, వినోదాల్లో కూడా వంటవారు సప్లై వారు నిర్వహణ వాళ్ళందరూ కూడా మనకు బయటి వారే కనిపిస్తారు .

**భవన నిర్మాణం.. ఇండస్ట్రీ రంగం**

శరవేగంగా పెరుగుతున్న హైదరాబాద్ చుట్టూ 100 కిలోమీటర్ల వరకు భవన నిర్మాణ ఇండస్ట్రీ రోజురోజుకు పెరుగుతా ఉంది ఇక్కడ బాధాకరమేంటంటే భూములన్ని తెలంగాణ వారివి నిర్మాణాలు వ్యాపారాలు అన్ని బయటి వాడివే భవన నిర్మాణంలో పనిచేసే కూలీలు తాపీ మేస్త్రీలు సానిటరీ ఎలక్ట్రికల్ సంబంధిత పనుల చేసే వారందరూ కూడా బీహార్, ఒరిస్సా , ఉత్తరప్రదేశ్ మధ్యప్రదేశ్ కు చెందినవారే ఎక్కువ మంది కార్మికులుగా పనిచేస్తున్నారు . ఇక్కడ కూడా స్థానికులకు అవకాశాలు లేవు .

**ప్రాజెక్టుల నిర్మాణంలో కూడా అంతా బయటి వారే**

తెలంగాణలో లక్ష కోట్ల పైచిలుకతో నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్ట్ మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్ట్ లాంటి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు బయటి వారే పనిచేసిన కూలీలు కూడా బయటివారే, దీనికి నిదర్శనం శ్రీశైలం డ్యామ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఎస్ ఎల్ బి సి సొరంగమార్గ నిర్మాణంలో తెలంగాణ ఏతురులే కూలీలుగా ఇంజనీర్లుగా పని చేస్తున్నారు ఇటీవల ప్రమాదం జరిగి 14 మంది చనిపోయిన ఘటన మనందరికీ తెలుసు అందులో కూడా అందరు బయటివారే . ప్రతి పనిలోనూ తెలంగాణ ఏతరులే ఉన్నారు.

**విద్యాసంస్థలన్నీ బయటి వారివే**

విద్యాసంస్థలన్ని బయటి వారి ప్రైవేట్ చేతుల్లో ఉన్నాయి. శ్రీ చైతన్య, నారాయణ, నలంద, గోకరాజు రంగరాజు, లాంటి ఇంజనీరింగ్ కళాశాలలు అధిక భాగం బయటి వారి చేతుల్లోనే ఉన్నాయి . ప్రభుత్వ పాఠశాల కళాశాల యూనివర్సిటీలో సరైన సౌకర్యాలు లేక తమ తమ పిల్లలని మంచి చదువులు చదివించాలని ప్రైవేట్ సంస్థల్లో పిల్లలను వేసి లక్షలు పోగొట్టుకుంటున్నారు. తెలంగాణలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోయింది . ఫీజుల నియంత్రణ కోసం ఎన్ని ఉద్యమాలు జరిగిన ఫలితం శూన్యం . ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి . ప్రతి అంశాన్ని మన నాయకులు ఓట్లు సీట్లు పవర్ దృష్టిలోనే చూస్తున్నారు . ఇప్పటికే సర్వే లెక్కల ప్రకారం గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలలో కళాశాలలో చదువులు కొనసాగిస్తున్న వారి సంఖ్య తగ్గిపోతుంది .

**సంక్షోభంలో రైతు కూలీలు రైతులు**

ఉత్తర తెలంగాణ పూర్వపు జిల్లాలైన మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లా వాసులందరూ కూడా గోదావరి నది జలాలు అందక చిన్న సన్నకారు రైతులు వర్షాకాల పంటల తర్వాత మహారాష్ట్ర ముంబై ఆ తరువాత దుబాయ్ మస్కట్కు బతుకుదెరువు కోసం పోతున్న . పేద మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతి ఇంటి నుండి ఒక్కరు ఇద్దరు చొప్పున దుబాయ్ మస్కట్ కు పోయిన సంఘటనలు ఉన్నాయి. చాలావరకు ఏజెంట్లు మోసాల గురై అప్పుల పాలై పరాయి దేశంలో పనులు దొరకక తిరిగి రాలేక లక్షల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి . నాడు ఉమ్మడి రాష్ట్రంలో గాని ప్రత్యేకంగా ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో గాని వారి గురించి పట్టించుకునే నాధుడే లేడు.

**దక్షిణ తెలంగాణలో**

రంగారెడ్డి మహబూబ్ నగర్, నలగొండ ఖమ్మం వరంగల్ జిల్లాలో ఉన్న ఇందులో ప్రధానంగా మహబూబ్ నగర్ జిల్లా వాసుల ఇబ్బందులు ఎక్కువ . తుంగభద్ర ఆర్డీఎస్ తో ప్రారంభమైన కృష్ణానది ఖమ్మం వరకు కొనసాగుతుంది సుమారు 250 పైచిలుకు కిలోమీటర్లు ప్రయాణించిన నీరు మాత్రం నల్లగొండ మహబూబ్ నగర్ జిల్లాలకు అందట్లేదు , మహబూబ్నగర్ జిల్లాలోని నారాయణపేట, మద్దూరు , నాగర్ కర్నూల్ , అచ్చంపేట, ప్రాంత వాసులు ఇంకా వలస బతుకులు తప్పడం లేదు . అక్కడి నుండి కూడా ప్రతిరోజు వలస కోసం ముంబై బస్సు ఎక్కే వారే అధికంగా ఉన్నారు.

(మిగతా రేపటి సంచికలో)

## ప్రతిజ్ఞ మాటల్లో కాదు, మనసుల్లో

*భారత దేశం నా మాతృభూమి పలికిన ప్రతి అక్షరం,*
*మనసున గుచ్చే గీతంలా, మార్మోగాలి లోలోపల.*
*స్కూలు మైదానాల్లో ఉదయం గాలి తాకిడిలో,*
*చిన్నారుల గొంతులో ప్రతిధ్వనించే నాదం,*
*కేవలం ఒక అలవాటు కాదు*
*దేశానికి ఇచ్చిన మౌన ప్రమాణం.*

*1962లో యుద్ధ మేఘాల మధ్య,*
*సరిహద్దులపై సైనికుల రక్తసాక్షి క్షణాల్లో,*
*ఒక తెలుగువాడి కలం దేశ హృదయాన్ని తాకింది.*
*పైడిమర్రి వెంకటసుబ్బారావు రాసిన ఆ పదాలు,*
*మనం ఒక్కటిగా నిలబడమని పిలిచాయి.*

*1965లో గణతంత్ర దినోత్సవం రోజున,*
*ఆ ప్రతిజ్ఞ దేశ చిహ్నమైంది.*
*కాగితం మీద కాదు,హృదయపు రాతి పలకపై*
*చెక్కబడాల్సిన మాటలుగా మారింది.*

*ప్రతిజ్ఞ అంటే పాటించమని ఇచ్చే హామీ,*
*కానీ నేడు మన కంఠంలో గర్జనగా పలికే ఆ పదాలు,*
*మన కర్మలో కనిపిస్తున్నాయా?*
*కులమతాల గోడల మధ్యన ఇరుక్కుపోయి,*
*సోదరత్వం వెలుపలే మిగిలిపోతుందా?*

*మన మాతృభూమిని తల్లి లా చూసుకుంటే,*
*ఆమె ప్రతి సంతానమూ మన సోదరమే.*
*ఆ గౌరవం మన వీధులలో,మన రాజకీయాలలో,*
*మన హృదయాల్లో ప్రతిబింబించాలి.*

*ప్రతిజ్ఞ పఠనం అంటే పూలు పూయించే విత్తనం,*
*ఆ విత్తనం మొలకెత్తాలంటే*
*సత్యం, న్యాయం, సమానత్వం అనే నీరు పోయాలి.*
*అసహనం, ద్వేషం, విభజన అనే కలుపు మొక్కలు*
*తొలగించాలి.*


*పైడిమర్రి కల, మన భవిష్యత్తు కలగాలి*
*ప్రతిజ్ఞ స్వరం, మన నడకలో వినిపించాలి*
*ప్రతి భారతీయుని జీవితం*
*ఆ పదాల అర్థాన్ని ప్రతిబింబించాలి.*

*మనం మళ్ళీ చిన్నారుల్లా,*
*ప్రతి ఉదయం ఆకాశం వైపు చూచి*
*"భారత దేశం నా మాతృభూమి" అని మాత్రమే కాదు,*
*మన కర్మలతో దేశం గుండెల్లో రాయాలి ం*
*మాటల్లో కాదు, మనసుల్లో*

-షహనాజ్



# దివ్య లీల



**ప్ర**పంచవ్యాప్తంగా హిందువులందరూ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకొనే పండుగలలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఒకటి. ఈ పవిత్రమైన రోజు మన జీవితాల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతుంది. శ్రీకృష్ణుని దివ్య ఆవిర్భావ లీలను తెలియజేస్తుంది. మనకు, భగవంతుడికి ఉన్న సనాతనమైన బంధాన్ని గుర్తు చేస్తుంది.శ్రీకృష్ణుడు సకల సృష్టికీ మూల పురుషుడు. ఆయన రూపం, నామం, లీలలు, గుణగణాలు... అన్నీ ఆకర్షణీయమైనవే. శ్రావణ మాసంలోని బహుళ పక్ష అష్టమి రోజున ఆయన అవతరించాడు కాబట్టి... ఆ తిథి 'శ్రీకృష్ణ జన్మాష్టమి'గా ప్రసిద్ధి చెందింది. శ్రీకృష్ణుని జననం సాధారణ శిశువుల మాదిరిగా సంభవించినది కాదు. ఎందుకంటే ఆయన పుట్టుక లేనివాడు. దేవాదిదేవుడు, సర్వశక్తిమంతుడు. కాబట్టి తన స్వీయ సంకల్పంతోనే అవతరిస్తాడు గానీ.. భౌతిక ప్రకృతి నియమాలకు బద్ధుడై కాదు. శ్రీకృష్ణుడు ఈ లోకంలో... మానవుల మధ్య జన్మించడం ఆయన దివ్య లీలల్లో ఒకటి. మథురలోని కంసుడి కారాగారంలో శ్రీకృష్ణుడు జన్మించినప్పుడు... శంఖ, చక్ర, గదా, పద్మాలతో... చతుర్భుజ విష్ణుమూర్తిగా దర్శనమిచ్చాడు. ఆ తరువాత తల్లి దేవకి ప్రార్థించడంతో... సామాన్య బాలుడిగా రూపాంతరం చెందాడు. కేవలం ఏడేళ్ళ వయసులో... తన చిటికెన వేలు మీద గోవర్ధన పర్వతాన్ని నిలబెట్టడం ఆయన అసాధారణ శక్తిని నిరూపిస్తుంది. సజ్జనులను రక్షించి, దుర్జనులను శిక్షించి, ధర్మాన్ని పునఃస్థాపించడానికి తాను యుగయుగానా అవతరిస్తానని ఆయన స్వయంగా ప్రకటించాడు.

శ్రీకృష్ణాష్టమినాడు ఏం చేయాలి?శ్రీకృష్ణాష్టమినాడు ఆ శ్రీకృష్ణుని కృపను పొందడానికి భక్తులు కొన్ని ఆచారాలను పాటిస్తారు. వాటిలో ముఖ్యమైనవి: స్వామి ఆవిర్భవించిన సమయమైన అర్ధరాత్రి పన్నెండు గంటల వరకూ ఉపవాసం ఉండడం. ఆరోగ్యం సహకరించనివారు పండ్లు, పాలు, ఇతర ప్రసాదాలను తీసుకోవచ్చు. హరేకృష్ణ మంత్రాన్ని జపించడం ముఖ్యమైన విధిగా భావించాలి. కనీసం నూట ఎనిమిది సార్లు జపించాలి. భగవద్గీత, శ్రీమద్భాగవతం లాంటి గ్రంథాల నుంచి శ్రీకృష్ణుని లీలలను, ఉపదేశాలను పఠించడం పుణ్యప్రదం. శ్రీకృష్ణుని ఆలయాలకు వెళ్ళి, ఆయన సుందర రూపాన్ని దర్శించాలి. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో శ్రీకృష్ణుని విగ్రహానికి లేదా చిత్రపటానికి హారతి ఇవ్వాలి, తులసీదేవిని పూజించాలి.ప్రభుపాదుల కృషితో విశ్వవ్యాప్తంవివిధ కారణాల రీత్యా శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున ఆలయాలకు వెళ్ళలేని భక్తులు కూడా శ్రీకృష్ణుడి అపారమైన కృపను పొందవచ్చు. శ్రీ చైతన్య మహాప్రభువు బోధించినట్టు... కపటంతో, కలహాలతో నిండిన కలియుగంలో హరినామ సంకీర్తనమే ఏకైక ముక్తి మార్గం. 'హరేకృష్ణ' మంత్ర జపం కలి కల్మషాలను నాశనం చేస్తుంది. హరేకృష్ణ ఉద్యమ సంస్థాపకాచార్యులైన శ్రీల ప్రభుపాదులు శ్రీకృష్ణ జన్మాష్టమిని ప్రపంచమంతటా వ్యాప్తి చేయడంలో అపారమైన కృషి చేశారు. 1965లో... 70 ఏళ్ళ వయసులో... కేవలం నలభై రూపాయలు, కొన్ని శ్రీమద్భాగవత గ్రంథాలతో ఆయన అమెరికా బయలుదేరారు. భగవద్గీతా సారాన్ని, 'హరేకృష్ణ' నామాన్ని పశ్చిమ దేశాల్లో ప్రచారం చేశారు. ఆరు ఖండాల్లో 108 కృష్ణ దేవాలయాలను స్థాపించారు. ప్రపంచంలోని ప్రసిద్ధ నగరాల్లో జగన్నాథ రథ యాత్రలను నిర్వహించి, ఆలయాన్నే ప్రజల దగ్గరకు తీసుకువచ్చారు. శ్రీకృష్ణ చైతన్యంపై 70కి పైగా గ్రంథాలను రచించారు. ఆయన స్ఫూర్తితో... హైదరాబాద్‌లోని 'హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్'లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నాయి. రాధాగోవిందులు, స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న ఈ ఆలయంలో... సప్త నదుల నుంచి సేకరించిన పవిత్ర జలాలతోను, పంచామృతంతోను అభిషేకం, ఊంజల్ సేవ, సంకీర్తనాలాపన, జపం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వీటిలో భక్తులు ఉచితంగా పాల్గొనవచ్చు. అలాగే హైదరాబాద్‌లోని నార్సింగిలో నిర్మితమవుతున్న హరేకృష్ణ హెరిటేజ్ టవర్, సంగారెడ్డి జిల్లా కందిలోని హరేకృష్ణ కల్చరల్ సెంటర్‌లలో కూడా ఈ ఉత్సవాల

# ధర్మస్థల కేసులో ఆశ్చర్యకర నిజాలు..ఆ 80 శవాలు నేనే పాతిపెట్టా..



**బెంగళూరు - నవభూమి:** కర్ణాటకలోని ప్రసిద్ధ యాత్రా క్షేత్రం 'ధర్మస్థల' ఇప్పుడు సంచలన అంశంగా మారింది. పుణ్యక్షేత్రంగా పేరొందిన ఈ ప్రాంతం ఇటీవల దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గత రెండు దశాబ్దాల్లో అక్కడ అనేక మంది యువతులు, మహిళలు అదృశ్యమయ్యారని.. వారందరి శవాలను తానే పూడ్చి పెట్టానని ఓ మాజీ పారిశుద్ధ్య ఉద్యోగి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏఏ ప్రాంతాల్లో అతడు మృతదేహాలను పూడ్చాడనే విషయాల ఆధారంగా ఇప్పటికే తవ్వకాలు జరుగుతున్నాయి. అయితే, తాజాగా ఈ కేసులో ప్రధాన సాక్షిగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుడు ఆశ్చర్యకర నిజాలు వెల్లడించాడు. తాను చెప్పిన 13 ప్రదేశాలలో.. ఒక్కచోటే 70-80 మృతదేహాలను స్వయంగా తన చేత్తోనే ఖననం చేసినట్లు పేర్కొన్నాడు.నేరుగా ఆలయం నుంచే సూచనలు వచ్చాయని మాజీ పారిశుద్ధ్య కార్మికుడు ఆరోపిస్తున్నాడు. సూపర్‌వైజర్లు బలవంతం చేయగా.. ఈ రెండు దశాబ్దాల కాలంలో ఎంతోమంది పిల్లలు, మహిళలు, పురుషుల మృతదేహాలను ఖననం చేసినట్లు వెల్లడించాడు. అలాగే, తాను ఎల్లప్పుడూ మృతదేహాలను పాత రోడ్లపై లేదా అటవీ ప్రాంతంలో పాతిపెట్టానని చెబుతున్నాడు. సైట్ నంబర్ 13 వద్ద 70-80 మృతదేహాలను ఖననం చేశానని పేర్కొన్నాడు. కొన్ని శవాలను కొండల్లో పాతిపెట్టినట్లు తెలిపాడు. ఏ ప్రాంతంలో పాతిపెట్టాలనేది ఆలయానికి సంబంధించిన వ్యక్తులే చెప్పేవారని.. అక్కడే పాతిపెట్టేవాడినని అన్నాడు. అలాగే తాము ఎన్నో మార్లు పగటిపూటే మృతదేహాలను పూడ్చిపెట్టడం స్థానికులు చూశారని.. కానీ ఎవరూ తమని ఆపలేదని లేదా ప్రశ్నించలేదని ప్రధాన సాక్షి చెప్పుకొచ్చాడు.

## కన్నకూతుర్ని కడతేర్చిన తండ్రి.. గుజరాత్‌లో పరువు హత్య



**అహ్మదాబాద్-నవభూమి:** గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో ఓ యువతి దారుణంగా పరువు హత్యకు గురైంది. అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ సుమన్ నల తెలిపిన వివరాల ప్రకారం, చంద్రిక చౌదరి (18) డాంటియాలోని తన ఇంట్లో హత్యకు గురైంది. ఆమెను ఆమె తండ్రి సెదభాయ్ పటేల్, అంకుల్ శివభాయ్ పటేల్ హత్య చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో తండ్రి పరారీలో ఉండగా, ఇద్దరిని అరెస్ట్ చేశారు. హరీశ్ చౌదరితో మృతురాలు చంద్రిక ప్రేమలో పడింది. ఈ వ్యవహారాన్ని ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించలేదు. తాను వారిని ఒప్పించలేనని గ్రహించిన చంద్రిక జూన్ 24న రాత్రి హరీశ్‌కు ఇన్‌స్టాగ్రామ్ మెసేజ్ ఇచ్చింది. తన కుటుంబం నుంచి తనను తీసుకెళ్లిపోవాలని కోరింది. "నువ్వు వచ్చి నన్ను తీసుకెళ్లు. లేదంటే మావాళ్లు నాకు వేరొకరితో ఇష్టం లేని పెళ్లి చేసేస్తారు. నేను ఆ పెళ్లికి అంగీకరించకపోతే, నన్ను చంపేస్తారు.. కాపాడు" అని పోస్ట్ పెట్టింది. ఆ తర్వాత కొన్ని గంటల్లోనే మరణించింది.

**ఇంట్లోంచి వెళ్లిపోయి.. తిరిగొచ్చి..** చంద్రిక గతంలో హరీశ్‌తో కలిసి వెళ్లిపోయింది. వారిని పోలీసులు గుర్తించి, ఆమెను తిరిగి ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. తనను కాపాడమని చంద్రిక పెట్టిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌ను చూసిన తర్వాత హరీశ్ కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశాడు. దానిపై విచారణ జరగడానికి ముందే ఆమె మరణించినట్లు అతనికి తెలిసింది. చంద్రిక సహజ పరిస్థితుల్లోనే మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు చెప్పారు. మరణ ధ్రువీకరణ పత్రాన్ని కూడా కోర్టుకు సమర్పించారు. చంద్రికను ఆమె తల్లిదండ్రులే హత్య చేశారని హరీశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.హడావుడిగా అంత్యక్రియలు

చంద్రిక తండ్రి, అంకుల్ ఆమెను జూన్ 24న రాత్రి హత్య చేయడానికి పథకం పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఆమెకు మత్తుమందు ఇచ్చి, నిద్రపోయిన తర్వాత గొంతు నులిమి చంపేశారు. ఆత్మహత్యగా చిత్రీకరించి, ఆదరాబాదరాగా అంత్యక్రియలు జరిపించేశారు. పాలన్‌పూర్‌లో చదువుకుంటున్న ఆమె సోదరుడిని సైతం అంత్యక్రియలకు పిలవలేదు.

## మలయాళం, తమిళం మాట్లాడేవారు విదేశాల్లోనే ఎక్కువ



**అహ్మదాబాద్-నవభూమి:** ఏదైనా భాషను మాట్లాడేవారు అధికంగా ఉండే రాష్ట్రంలో మినహా దేశంలోని ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఆ భాషను మాట్లాడేవారి సంఖ్యను తెలుసుకునేందుకు ఓ అధ్యయనం జరిగింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్‌కు చెందిన ఫ్యాకల్టీ మెంబర్ చిన్మయ్ టుంబే 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. మన దేశంలోని రాష్ట్రాల్లో ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క భాషను ప్రధానంగా మాట్లాడతారు. ఆ భాషను ఆ రాష్ట్రంలో మినహా ఇతర రాష్ట్రాల్లో మాట్లాడేవారిని ఇంటర్నల్ లేదా డొమెస్టిక్ డయాస్పొరా అని, ఇతర దేశాల్లో ఆ భాషను మాట్లాడేవారిని ఇంటర్నేషనల్ డయాస్పొరా అని పేర్కొన్నారు. మలయాళం, తమిళం మినహా మిగతా ప్రధాన భారతీయ భాషలను మాట్లాడే ఇంటర్నల్ డయాస్పొరా ఇంటర్నేషనల్ డయాస్పొరా కన్నా ఎక్కువగా ఉన్నారు. సోషియలాజికల్ బులెటిన్ జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది.

మలయాళీలు భారత దేశం వెలుపల విదేశాల్లో 30 లక్షల మంది నివసిస్తుండగా, మన దేశంలోని కేరళ మినహా ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్నవారు కేవలం 16 లక్షల మంది. తమిళులు విదేశాల్లో 45 లక్షల మంది, తమిళనాడు మినహా మన దేశంలోని ఇతర రాష్ట్రాల్లో 39 లక్షల మంది నివసిస్తున్నారు. మిగిలిన భాషలను మాట్లాడేవారు మన దేశంలో కన్నా ఇతర దేశాల్లో తక్కువగా ఉన్నారు.పంజాబీల మొత్తం జనాభాలో దాదాపు 12.4 శాతం మంది 2010లో అత్యధికంగా విస్తరించిన భాషా జన సమూహంగా నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో మలయాళీలు 12.2 శాతం మంది, మూడో స్థానంలో తమిళులు 11.5 శాతం మంది ఉన్నారు. నాలుగో స్థానంలో ఉన్న తెలుగువారు 9.7 శాతం మంది కాగా, ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా గుజరాతీ (8.7 శాతం మంది), హిందీ (7.5 శాతం మంది), మరాఠీ (6.6 శాతం మంది), కన్నడం (4.6 శాతం మంది), బెంగాలీ మాట్లాడేవారు (3.7 శాతం మంది) ఉన్నారు.

## ఎర్రకోటకు వెళ్లని రాహుల్, ఖర్గే.. కారణం ఇదేనా?



**న్యూఢిల్లీ-నవభూమి:** కాంగ్రెస్ కీలక నేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలు మాత్రం ఎర్రకోటకు వెళ్లలేదు. వీరు ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనకపోవటంపై పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఎర్రకోటపై భారత జాతీయ జెండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు. అయితే, కాంగ్రెస్ కీలక నేతలు రాహుల్ గాంధీ, మల్లిఖార్జున్ ఖర్గేలు మాత్రం ఎర్రకోటకు వెళ్లలేదు. వీరు ఎర్రకోటలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనకపోవటంపై పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి.విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సీటింగ్ సదుపాయాలు సరిగా ఉండవన్న కారణంతోటే ఈ ఇద్దరూ ఎర్రకోటకు వెళ్లలేదని తెలుస్తోంది. గత సంవత్సరం అనుభవాల దృష్ట్యా.. ఈ సంవత్సరం ఎర్రకోటకు వెళ్లటం మానుకున్నారని సమాచారం. అయితే, రాహుల్, ఖర్గేలు ఎర్రకోటకు ఎందుకు వెళ్లలేదన్నా దానిపై కాంగ్రెస్ పార్టీనుంచి ఎటువంటి అధికారిక ప్రకటన లేదు. ఇక, ఈ ఇద్దరు సోషల్ మీడియా వేదికగా దేశ ప్రజలకు 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.రాహుల్ తన పోస్టులో.. 'ఈ స్వేచ్ఛ మన స్వాతంత్ర్య సమర యోధుల త్యాగాల ఫలితం. ఇది స్వాతంత్ర్యం మాత్రమే కాదు.. నిజాయితీ, సమానత అనే పునాదిపై న్యాయం నిలిచేలా.. అద్భుతమైన భారత్‌ను నిర్మించాలనే సంకల్పం కూడా. ప్రతీ హృదయం గౌరవంతో, సోదరభావంతో నిండి ఉండాలి. ఈ అమూల్యమైన వారసత్వ గౌరవాన్ని కాపాడటం మనందరి కర్తవ్యం. జై హింద్, జై భారత్' అని పేర్కొన్నారు.

## 'తమిళనాడుకు వ్యతిరేకి': గవర్నర్‌ను కాదని వీసీ నుంచి పట్టా తీసుకున్న పీహెచ్‌డీ విద్యార్థిని




**చెన్నై-నవభూమి:** సాధారణంగా విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాలు విద్యార్థుల జీవితంలో ఒక ఆనందకరమైన, మరపురాని క్షణంగా మిగిలిపోతుంటాయి. కష్టపడి సాధించిన విద్యార్హతలకు గుర్తింపుగా గవర్నర్ లాంటి ఉన్నతాధికారుల చేతుల మీదుగా పట్టాలు అందుకుంటారు. అయితే తమిళనాడులో ఇటీవల జరిగిన ఒక స్నాతకోత్సవంలో దీనికి పూర్తిగా భిన్నమైన సంఘటన చోటుచేసుకుంది. ఒక పీహెచ్‌డీ విద్యార్థిని.. తన రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి చేతుల మీదుగా డిగ్రీ తీసుకోవడానికి నిరాకరించింది. ఆయన తమిళనాడుకు వ్యతిరేకి అని అంటూనే.. వీసీ చేతుల మీదుగా పట్టా అందుకుంది. ఈ సంఘటనతో అక్కడున్న వారంతా తీవ్ర ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది.బుధవారం రోజు తిరునల్వేలిలో జరిగిన మనోన్మణియం సుందరనార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి గవర్నర్ ఆర్.ఎన్. రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపై గవర్నర్‌తో పాటు వైస్-ఛాన్సలర్ ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. విద్యార్థులకు డిగ్రీలు అందజేసే క్రమంలో పీహెచ్‌డీ విద్యార్థిని జీన్ రాజన్ పేరును పిలిచారు. డిగ్రీ తీసుకోవడానికి ఆమె వేదికపైకి వచ్చారు. సంప్రదాయం ప్రకారం గవర్నర్ చేతుల మీదుగా డిగ్రీ తీసుకోవాలి. అయితే జీన్ రాజన్ మాత్రం గవర్నర్ వైపు చూడకుండా నేరుగా వీసీ వద్దకు వెళ్లి ఆయన చేతుల మీదుగా డిగ్రీ అందుకున్నారు. ఈ చర్య ఆ క్షణంలో వేదికపై ఉన్నవారితో పాటు మొత్తం ప్రేక్షకులను నివ్వెరపరిచింది.

ఈ నిరసనకు గల కారణం ఆ తరువాత వెల్లడైంది. గవర్నర్ ఆర్.ఎన్. రవి రాష్ట్రానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఆయన నిర్ణయాలు తమిళనాడు ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆ విద్యార్థిని ఆరోపించారు. కొన్ని కీలక బిల్లులకు ఆమోదం తెలపడంలో ఆయన జాప్యం చేశారని, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించారని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా ద్రావిడ సంస్కృతి, తమిళ భాష పట్ల గవర్నర్‌కు వ్యతిరేకత ఉందని, అందుకే ఆయన చేతుల మీదుగా డిగ్రీ తీసుకోవడానికి ఆమె నిరాకరించినట్లు ఆమె స్పష్టం చేశారు.ముఖ్యంగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. విద్యార్థిని కనీసం గవర్నర్ ముఖం కూడా సరిగ్గా చూడలేరు. నేరుగా వీసి దగ్గరకు వచ్చి డిగ్రీ తీసుకుని స్టేజీ మీద నుంచి కిందకు వచ్చేశారు. స్నాతకోత్సవం లాంటి ఒక అధికారిక వేదికపై ఒక విద్యార్థి గవర్నర్ ను బహిరంగంగా నిరసించడం చాలా అరుదైన సంఘటన. ఈ సంఘటన రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులను, ప్రజలలో గవర్నర్ పట్ల ఉన్న వ్యతిరేకతను తెలియజేస్తోంది. ఈ ఘటన తదనంతరం రాజకీయ వర్గాలలో తీవ్ర చర్చకు దారితీసింది. పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యను అభ్యసించిన ఒక విద్యార్థిని ఇలాంటి రాజకీయ ప్రకటన చేయడం చాలా ముఖ్యమైన

## వజ్రాల వేటలో మహిళకు అదృష్టం.. విలువ ఎంతంటే?



**అర్కన్సాస్-నవభూమి:** చాలామంది కోటీశ్వరులు అవ్వడానికి ఏవేవో చూస్తూ ఉంటారు. కానీ కొంతమందికి మాత్రం ఏమి చేయకుండానే అదృష్టం తలుపు తడుతుంది. అలా వెతకపోయిన తీగ కాళ్లకు తగిలినట్లు.. అప్పుడప్పుడు అదృష్టం అనుకోకుండానే మన ఇంటి తలుపు తట్టేస్తుంది. అలా తాజాగా ఓ మహిళకు కూడా ఇదే జరిగింది. అయితే ఈ మహిళ అలా నడుస్తూ వెళుతుండగా దాదాపు లక్షల విలువ చేసే రాయి కాళ్లకు తగిలిందట. ఇదేంటి అని పైకి తీసి చూడగా వజ్రం..అక్షరాల లక్షలు ఖరీదు చేసే వజ్రం.. ఆమె చేతిలో ఆ వజ్రాన్ని చూసి తెగ మురిసిపోయింది. మరి ఇంతకీ ఆ మహిళ ఎవరు..? ఆమెకు దొరికిన వజ్రం ఖరీదు ఎంత ?అనేది ఇప్పుడు తెలుసుకుందాం.. మనసు ఉల్లాసంగా ఉంచుకోవడం కోసమో.. లేక ప్రశాంతమైన వాతావరణంలో గడపడం కోసమో.. లేక నేచర్ ని ఎంజాయ్ చేస్తూ అలా వాకింగ్ చేయడం కోసమో వెళ్తారు. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే ఈ పార్క్ కి మాత్రం వజ్రాల వేటకోసమే వెళ్తారట. అవును మీరు వినేది నిజమే. ఈ పార్కు వజ్రాల వేటకు ఫేమస్.. ఎందుకంటే ఇక్కడ ఇప్పటికే చాలా వజ్రాలు దొరికాయట.అందుకే చాలామంది అక్కడి ప్రజలు డబ్బులు చెల్లించి మరీ ఆ పార్కుకి వెళ్లి ఏదైనా వజ్రం దొరకక పోతుందా.. తమ అదృష్టం తలుపు తట్టకపోతుందా అని ఎన్నో ఆశలు పెట్టుకొని ఆ పార్కులో వజ్రాల వేట చేస్తూ ఉంటారట. అయితే డబ్బులు కట్టి పార్కులోకి వెళ్లి వజ్రాల కోసం వెతికిన ప్రతి వారికి ఆ వజ్రాలు దొరకవు.ఎవరో కొందరికి మాత్రమే దొరుకుతాయి. కానీ ఇప్పటివరకు ఆ పార్కులో చాలామందికి వజ్రాలు దొరికాయట. ఇక ఆ పార్కు పేరు ఏంటంటే అమెరికాలోని అర్కన్సాస్ స్టేట్ పార్క్. ఈ పార్కు వజ్రాలవేట కి ఫేమస్.. 37 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్కులోకి చాలామంది ప్రతిరోజు వజ్రాల వేట కోసం వస్తారట. ఇక వజ్రాల కోసం వెళ్ళిన ప్రతి ఒక్కరు 15 డాలర్లు చెల్లించి ఆ తర్వాత వజ్రాల వేట ప్రారంభించవచ్చట.. తాజాగా అలా వెళ్ళిన 31 ఏళ్ల మిషెర్ ఫాక్స్ అనే మహిళకు దాదాపు రూ.24 లక్షల ఖరీదు చేసే ఒక వజ్రం దొరికింది. ఆ మహిళా అర్కన్సాస్ స్టేట్ పార్కులో అలా నడుస్తూ వెళ్తుండగా ఏదో కాలికి రాయి తగిలింది అని, దాన్ని పైకి తీసి చూడగా 2 క్యారెట్ల తెల్లటి వజ్రం అని తేలింది. ఇక దాని విలువ సుమారు 27 వేల డాలర్లు (అంటే మన ఇండియన్ కరెన్సీ లో 24 లక్షలు అని) అంచనా వేస్తున్నారు. అయితే పెళ్లి కానీ ఆ మహిళ కి 24 లక్షల ఖరీదు చేసే వజ్రం దొరకడంతో ఆమె ఆనందానికి అవధులు లేవు.ఆ వజ్రాన్ని చేతిలో పట్టుకొని మురిసిపోతూ ఈ వజ్రాన్ని నా ఎంగేజ్మెంట్ రింగులో పెట్టుకుంటా అంటూ తెగ సంబరపడిపోతుంది.. అయితే ప్రతి ఏడాది ఈ అర్క్యాన్సస్ స్టేట్ పార్క్ కి లక్షలాదిమంది డబ్బులు చెల్లించి వజ్రాల వేటకు వస్తారట. అలా ఈ ఏడాది దాదాపు 350 కి పైగా మందికి వజ్రాలు దొరికాయట.

## గగనతలంలో భారత్-పాక్ యుద్ధవిమానాలు ఢీకొన్నాయి.. : ట్రంప్




**వాషింగ్టన్-నవభూమి:** అంతర్జాతీయ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ఆరు నెలల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఆరు యుద్ధాలను తాను నిలువరించానని, అందులో భారత్-పాకిస్థాన్ మధ్య తలెత్తిన ఘర్షణ కూడా ఒకటని ఆయన పేర్కొన్నారు. త్వరలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో జరగనున్న భేటీకి సిద్ధమవుతున్న వేళ ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అణు యుద్ధం అంచున భారత్-పాక్ ట్రంప్ ప్రకారం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి. ఆ సమయంలో రెండు దేశాలు అణు యుద్ధానికి దాదాపు సిద్ధమయ్యాయని ఆయన వెల్లడించారు. "గగనతలంలో రెండు దేశాల యుద్ధ విమానాలు ఢీకొన్నాయి. ఆరు నుంచి ఏడు విమానాలు నేలకూలాయి. ఆ పరిస్థితుల్లో మేము జోక్యం చేసుకొని ఘర్షణను ఆపాం" అని ట్రంప్ వైట్‌హౌస్‌లో వెల్లడించారు. ఆయన మాటల ప్రకారం, అమెరికా జోక్యం లేకపోతే రెండు దేశాల మధ్య అణు యుద్ధం జరిగి ఉండేదని భావన కలిగించారు. %ూశ్రీంశీ =ముం% - 8 ఏళ్లలో ఆరు శౌర్య పతకాలు.. తెలుగు ఐపీఎస్ ఘనత -ట్రంప్ వ్యాఖ్యలను ఖండించిన భారత్ అయితే ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలను భారత్ గతంలోనే గట్టిగా ఖండించింది. పుల్వామా దాడి తర్వాత భారత్ చేపట్టిన "ఆపరేషన్ సింధూర్" ద్వారా పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ తర్వాత ఏ దేశం తమ నిర్ణయాన్ని ప్రభావితం చేయలేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టంగా తెలిపారు. "మా లక్ష్యాలను సాధించిన తర్వాతే ఆపరేషన్‌కు విరామం ఇచ్చాం" అని లోక్‌సభలో మోదీ అన్నారు. భారత్ ఒక స్వతంత్ర దేశమని, దాని భద్రతా నిర్ణయాలను ఏ దేశం నిర్దేశించలేదని ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టమైంది. - ట్రంప్-పుతిన్ భేటీపై ఆసక్తి ట్రంప్ తన వ్యాఖ్యలతో అంతర్జాతీయ దృష్టిని తనపైకి మరల్చుకున్నారు. ఆయన త్వరలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ భేటీ ఆగస్టు 15న అలాస్కాలోని యాంకరేజ్‌లో ఎల్మెండోర్ఫ్-రిచర్డ్‌సన్ బేస్‌లో జరగనుంది. ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలకడానికి తాను కృషి చేస్తున్నానని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సమావేశం ఆయన రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టిన తర్వాత పుతిన్‌తో జరగనున్న తొలి భేటీ కావడం విశేషం. ఈ సమావేశం ద్వారా రష్యా-ఉక్రెయిన్ ఘర్షణలో ఏదైనా కొత్త పరిణామం చోటుచేసుకుంటుందో, లేక కేవలం దౌత్యపరమైన ప్రదర్శనగానే మిగిలిపోతుందో వేచి చూడాలి. ట్రంప్ పరపతి ప్రదర్శనలో భాగంగా ఈ సమావేశాన్ని ఉపయోగించుకుంటున్నారని విమర్శకులు భావిస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యలు, రానున్న సమావేశం అంతర్జాతీయ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

## బే ఏరియా ఇండియన్ ఫుడ్ ఇండస్ట్రీపై టారిఫ్ దెబ్బ



**న్యూయార్క్-నవభూమి:** అమెరికా ప్రభుత్వం భారత దిగుమతులపై కొత్తగా విధించిన 25% దిగుమతి సుంకం బే ఏరియాలోని భారతీయ రెస్టారెంట్లు, కిరాణా దుకాణాలు, ఫుడ్ దిగుమతి వ్యాపారులపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ఇది ఆగస్టు 7, 2025 నుంచి అమలులోకి వచ్చింది. ఈ నెల 27 లోపు ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదరకపోతే 50%కి పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఈ టారిఫ్ విధింపుకు కారణం, భారత్ రష్యా నుండి చమురు కొనుగోలు చేయడాన్ని నిరసిస్తూ అమెరికా తీసుకున్న చర్య.ముఖ్య భారతీయ ఆహార పదార్థాలపై ప్రత్యక్ష ప్రభావం ఈ సుంకం ప్రత్యక్షంగా బాస్మతి బియ్యం, మసాలాలు, పప్పులు, ఫ్రోజెన్ నాన్ వంటివాటిపై ప్రభావం చూపుతోంది. అమెరికాలోని భారతీయ దిగుమతిదారులు తమ ఉత్పత్తులపై ధరలు పెంచాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. దుకాణదారులు ప్రస్తుత ధరలను లాభాలను తగ్గించుకుని, కస్టమర్లకు కొంత ఉపశమనం కలిగించే ప్రయత్నం చేస్తున్నా, వినియోగదారులు తమ షాపింగ్ బిల్లులు గణనీయంగా పెరిగాయని చెబుతున్నారు. : ట్రంప్ -రెస్టారెంట్ల యజమానుల ఆక్రోశం బే ఏరియాలోని రెస్టారెంట్లు, ప్రాథమికంగా స్థానిక కూరగాయలు, మాంసం కొంటున్నా, అసలైన భారతీయ వంటలకు అవసరమైన దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు, బాస్మతి బియ్యం వంటి వాటిని దిగుమతులపై ఆధారపడుతున్నారు. కొత్త సుంకాల వల్ల ఇవి ఖరీదయ్యాయి. భావితరాల్లో ఈ రెస్టారెంట్లు తన ఖర్చులను నిర్వహించాలంటే కస్టమర్లకు అధిక ధరలు వసూలు చేయడమే మార్గమవుతుంది. - దిగుమతి వ్యాపారులకు 'ఓడిపోయే' పరిస్థితి ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న బే ఏరియా భారతీయ ఫుడ్ వ్యాపారాలకు, ఈ సుంకం 50%కి పెరిగితే పరిస్థితి మరింత దిగజారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి మార్గంలో వస్తువులు 40 రోజుల సమయం పడుతుండటంతో ఇద్దరు దేశాల మధ్య మాటుదాటులకు ఉన్న గడువులో ఇప్పటికే భయాందోళనలు చోటు చేసుకున్నాయి. "ఇది నిజంగా ఓడిపోయే-ఓడిపోయే పరిస్థితి," అని దిగుమతిదారులు చెప్పుతున్నారు. ఈ సుంకాల ప్రభావంతో కస్టమర్లపై ధరల భారం ఉంటుంది. వ్యాపారాల స్థిరత్వం దెబ్బతింటుంది. పోటీ దిగుమతిదారులు, ఇతర దేశాల ఉత్పత్తులు ఇక్కడ పట్టు సాధించే అవకాశం ఉంటుంది. ఉత్పత్తుల గణనీయమైన తగ్గుదల, మన భారతీయ దిగుమతి మార్కెట్ ప్రభావితం అవుతుంది. ప్రస్తుతం, బే ఏరియా ఇండియన్ ఫుడ్ వ్యాపారాలు నష్టాల్లోకి జారిపోతున్నాయి. అమెరికా ప్రభుత్వం ఇంకా సాల్లివ్వకపోతే, ఇవ్వాళి పరిణామాలు మరింత తీవ్రమవుతాయి. భారతీయ ఫుడ్ వ్యాపారులకు అమెరికా కొత్త సుంకాలు భారం అవుతున్నాయి. . ఉన్నతమైన భారతీయ ఆహార పదార్థాల ధరలు పెరిగిపోవడం, లాభాలు తగ్గిపోవడం, చివరికి వినియోగదారులపై భారం పడుతోంది. ఇటువంటప్పుడు, ఈ వ్యాపారాలు తమ స్థిరత్వాన్ని కల్పించుకోవడంలో తడబడుతున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరగా కుదరాలని, లేకపోతే భారతీయ ఫుడ్ ఇండస్ట్రీ ఎదుర్కొనబోయే నష్టాలు మరింత పెరుగుతాయని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది

## తొలి స్వాతంత్ర్య వేడుకల్లో గాంధీజీ ఎందుకు పాల్గొనలేదు?



అది 1947 ఆగస్టు 15.. ఎన్నో ఏండ్ల బానిస బతుకుల నుంచి విముక్తి లభించిన రోజు. ఆనాడు రాజధాని ఢిల్లీ సహా దేశమంతటా ప్రజలు సంబురాలు జరుపుకుంటున్నారు. జవహార్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ సహా చాలామంది స్వతంత్ర్య సమరయోధులు, ప్రజలు ఢిల్లీ నగరానికి చేరుకుని సంబురాలు చేసుకుంటున్నారు. కానీ స్వరాజ్య స్థాపన కోసం తుదివరకు అహింసను ఆయుధంగా చేసుకుని పోరాడిన మహాత్మా గాంధీ మాత్రం ఢిల్లీలో లేరు. ఢిల్లీకి దూరంగా కలకత్తా వెళ్లారు. అక్కడ కూడా సంబురాల్లో పాల్గొనలేదు. రోజంతా ఉపవాసం చేస్తూ మౌనదీక్ష పూనారు.ఎన్నో ఏండ్లుగా కలలు కన్న స్వరాజ్యం వచ్చిన రోజునే భారతదేశం రెండు ముక్కలైంది. మత ప్రాతిపాదికన భారత్, పాకిస్థాన్‌గా విడిపోయింది. ఆ సమయంలో హిందూ, ముస్లింల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఒకరిపై మరొకరు దాడులు చేసుకున్నారు. దీంతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే ఆనందం కంటే కూడా.. దేశం రెండుగా చీలిపోయిందనే బాధే గాంధీజీలో ఎక్కువగా ఉండిపోయింది. అదే సమయంలో బెంగాల్‌లో గొడవలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని తెలిసి బాపూజీ కలత చెందారు. వెంటనే కలకత్తా బయలుదేరి వెళ్లారు.బెంగాల్‌లో శాంతి నెలకొంటే దేశవ్యాప్తంగా హిందూ, ముస్లింల మధ్య వివాదాలు సద్దుమణుగుతాయన్నది గాంధీజీ నమ్మకం. అందుకే 1947 ఆగస్టు 9న ఆయన కలకత్తాకు వెళ్లారు. బంగ్లాదేశ్‌లో ఉన్న నౌకాలి ప్రాంతంలో ఎక్కువగా మత ఘర్షణలు జరుగుతున్నాయని తెలిసి.. అక్కడికి కూడా వెళ్లాలని గాంధీ అనుకున్నారు. కానీ చాలామంది అడ్డుతగిలి ఆయన్ను బంగ్లాదేశ్‌లోకి వెళ్లనివ్వలేదు. దీంతో మియాబగన్ సమీపంలో ఉన్న హైదరీ మంజిల్‌లో బాపూజీ బస చేశారు. కానీ అప్పటికే గాంధీజీపై ముస్లింల నుంచి వ్యతిరేకత మొదలైంది. ముస్లిం వ్యతిరేకి గాంధీ గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో ముస్లింలు ఆందోళనలు చేశారు. అయినా గాంధీ వెనక్కి తగ్గలేదు.రోజురోజుకీ ఆందోళనలు ఎక్కువైపోతుండటంతో.. వాటిని ఆపేందుకు ఆగస్టు 13 ఘర్షణల్లో చురుగ్గా పాల్గొంటున్న వారితో మాట్లాడేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాల వారితో భేటీ అయి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ వాళ్లెవరూ గాంధీ మాటలను వినేందుకు సుముఖంగా లేరు. కానీ గాంధీజీ మాత్రం తన ప్రయత్నాన్ని విడిచిపెట్టలేదు. శాంతియుతంగా వారితో చర్చలు జరుపుతూ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే ఆగస్టు 15వ తేదీన గాంధీజీ 24 గంటల పాటు ఉపవాసం ఉండి ప్రార్థనలు చేశారు. మౌనంగా ఉంటూ చరఖా తిప్పుతూ గడిపేశారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే వివాదం మొత్తం సద్దుమణిగింది. మత ఘర్షణలు తగ్గుముఖం పట్టాయి. ఇదంతా గమనించిన లార్డ్ మౌంట్ బాటెన్.. పంజాబ్‌లో 55 వేల మంది సైనికులను పెట్టి కూడా ఆందోళనలను ఆపలేకపోయాం.. కానీ బెంగాల్‌లో మాత్రం ఒకే ఒక వ్యక్తి వీటిని నిలవరించాడని పేర్కొనడం విశేషం.కలకత్తాలో శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నించి సఫలీకృతుడైన గాంధీజీని అభినందించేందుకు సి. రాజగోపాలాచారి అక్కడికి వెళ్లారు. అయితే ప్రజలు ఒక్కటిగా లేనప్పుడు ఈ స్వాతంత్ర్యం తనకు ఆనందం ఇవ్వలేదని ఆ సందర్భంగా రాజగోపాలాచారితో గాంధీ చెప్పాడు. హిందూ, ముస్లింలు మళ్లీ కలిసి ఉంటే తప్ప నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు కాదని ఆయన పేర్కొన్నాడు. కలకత్తా తర్వాత భారత్, పాకిస్థాన్‌లోని హిందూ, ముస్లింల మధ్య శాంతిని నెలకొల్పాలని గాంధీ ప్రయత్నించాడు. ఈ ప్రయత్నంలో ఉండగానే గాంధీని గాడ్సే హత్య చేశాడు.

## రేషన్ కార్డు నుంచి బస్ టిక్కెట్ల వరకు.. ఇక వాట్సాప్‌లో సర్కారు సేవలు

**చెన్నై-నవభూమి:** రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మరింత సులభతరం చేయనుంది. రేషన్ కార్డు నుంచి బస్ టిక్కెట్ల వరకు తొలి దశలో 50 సేవలను అందించనుంది. ఇందుకోసం ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాతో ప్రభుత్వం ఒక కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తమిళం, ఆంగ్ల భాషల్లో ఏఐ (కృత్రిమ మేధ) టెక్నాలజీతో వీటిని ప్రజల వద్దకు చేర్చనుంది. ఉదాహరణకు ఏదైనా ఒక సేవను పొందగోరు వారు దానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువ పత్రాలను వాట్సాప్‌లోనే అప్‌లోడ్ చేసి, వాట్సాప్‌లోనే ఆ సేవ రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది.ఈ సేవలను వచ్చే మూడు నెలల్లో ప్రారంభించనున్నారు. గత ఏప్రిల్ లో అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి పళనివేల్ త్యాగరాజన్ ఈ విషయానిన వెల్లడించారు. ఆ ప్రకారంగానే ఇపుడు ఈ సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా మెటాతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సెక్యూరిటీ పరంగా ఓటీపీతో పాటు మరికొన్ని భద్రతా ప్రమాణాలను పాటించనున్నారు. రేషన్ కార్డు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, వాణిజ్య అనుమతులు పొందడం,బస్సు టిక్కెట్ రిజర్వేషన్, రేషన్ కార్డుల్లో చిరునామా మార్పు, ఆదాయం, ఫస్ట్‌గ్రేడ్ డిగ్రీ సర్టిఫికెట్, మెట్రో వాటర్, ఆస్తి పన్ను చెల్లింపులు, డ్రైనేజీ పన్ను చెల్లింపు, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్ల తొలగింపు, చేరిక ఇలా సుమారుగా 50 సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.



# చర్మానికి ఆ క్రీమ్స్ వద్దు

## నవతార



స్వీయ చికిత్సలో భాగంగా కొత్త చర్మ సమస్యలను కొని తెచ్చుకునే వారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరిగింది. చర్మాన్ని తెల్లబరిచే క్రీమ్‌లు ఆన్‌లైన్‌లో విస్తృతంగా అందుబాటులో ఉండడంతో, ఎవరికి వారు వాటిని కొని వాడేస్తున్నారు. ఇవి తక్షణ ఫలితాన్ని కనబరుస్తూ ఉండడంతో అదే పనిగా ఏళ్ల తరబడి వాటినే వాడుకుంటూ ఉండిపోతున్నారు. కానీ చర్మాన్ని తెల్లబరిచే క్రీమ్స్‌లో స్టిరాయిడ్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని పలుచన చేస్తాయి. దాంతో చర్మం సున్నితంగా మారిపోయి, ఎండలోకి వెళ్లినప్పుడు మంట పెడుతుంది, కందిపోతూ ఉంటుంది. వీటినే ఏళ్ల తరబడి వాడుకోవడం వల్ల చర్మం మరింత దెబ్బతిని, నల్లబడుతుంది. మొటిమలు, రోమాలు కూడా పెరుగుతాయి. ఇలా చర్మం పూర్తిగా దెబ్బతిన్న తర్వాత, వెంటనే చర్మ వైద్యుల చేత చర్మ చికిత్సలు చేయించుకోవడం సాధ్యపడదు. దెబ్బతిన్న చర్మం పూర్తిగా కోలుకోడానికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది సమయం అవసరమవుతుంది. అప్పటివరకూ చర్మ చికిత్సలకు చర్మం అనువుగా మారదు. కాబట్టి ఏదైనా చర్మం తెల్లబడే క్రీమ్ వాడుతూ, ఫలితం సత్వరమే కనిపిస్తుంటే, వెంటనే ఆ క్రీమ్ వాడకాన్ని ఆపేయాలి. స్నేహితుల సలహాల మేరకు వీటిని వాడుకోకూడదు. 'ఈ క్రీమ్‌ను మేమే స్వయంగా తయారుచేశాం, ఇది పూర్తిగా సహజసిద్ధమైనది, ఎలాంటి రసాయనాలు లేని ఈ క్రీమ్ అద్భుతమైన ఫలితాన్నిస్తుంది' అంటూ తప్పుదారి పట్టించే బ్యూటీ పార్లర్ల మాటలు వినకూడదు. చర్మ వైద్యులు సూచించకుండా ఇలాంటి క్రీమ్స్ వాడుకోవడం ప్రమాదకరం.

# విజయం ఆమెకు దాసోహమయింది



పట్టుదల, తపన, క్రమశిక్షణ ఈ మూడు పదాలు ఎస్. తన్మయ్ శ్రీదేవి జీవితాన్ని మలిచాయి. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు పోస్ట్ బేసిక్ పాఠశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న ఈ అమ్మాయి చిన్నప్పటి నుంచే మానసిక వైకల్యంతో ఇబ్బంది పడుతూ వచ్చింది. పుట్టుకతోనే సమస్య ఉందని తల్లిదండ్రులకు తెలియలేదు. కానీ క్రమంగా ఎదుగుతున్న కొద్దీ ఆమె ప్రవర్తనలోని భిన్నత తల్లికి గమనించబడింది. వైద్యులను సంప్రదించిన తరువాత మానసిక సమస్య ఉందని నిర్ధారణ అయ్యింది. చాలా మంది ఇలాంటి పరిస్థితిలో నిరుత్సాహానికి లోనవుతారు. కానీ తన్మయ్ తల్లి సుగుణ మాత్రం వెనకడుగు వేయలేదు. "నా అమ్మాయి కూడా అందరి పిల్లల్లాగే చదువుకోవాలి, ఆడుకోవాలి" అనే నమ్మకంతో ముందుకు నడిచింది. చిన్నప్పటి నుంచి తన్మయ్ ఎక్కువగా ఎవ్వరితోనూ మాట్లాడే స్వభావం కలిగి ఉండేది కాదు. తానెవరినైనా ఇష్టపడితే మాత్రమే మాట్లాడేది. కానీ ఒకసారి ఏ పని చేయాలని నిర్ణయించుకుంటే, అది పూర్తయ్యే వరకు వదిలేది కాదు. ఈ పట్టుదలే ఆమెను సాధారణ అమ్మాయిలలో ప్రత్యేకంగా నిలిపింది. చదువుతో పాటు ఆటలోనూ రాణించాలనే ఆలోచన ఆమె తల్లికి వచ్చింది. ఆటలలో ఒకదానిని ఎంచుకోవాలనుకున్నప్పుడు కోచ్ సాయిస్వరూప పరిచయం అయ్యారు. సాయిస్వరూప బోసీ బాల్‌లో శిక్షణ ఇస్తారు. ఇది ఇటలీలో పుట్టిన ప్రత్యేక క్రీడ. 'స్పెషల్ ఒలింపిక్స్' కింద మానసిక, శారీరక సమస్యలతో ఉన్నవారికి కూడా ఈ ఆటలో పాల్గొనే అవకాశం ఉంటుంది. మొదట్లో తన్మయ్‌కు ఆటలపై పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. కోచ్ సాయిస్వరూప చెప్పిన ప్రకారం, "ఆమెను ఆటలోకి తేవడానికి చాలాసార్లు ప్రయత్నించాను. ప్రారంభంలో ఆడాలని అస్సలు అనుకోలేదు. కానీ నేను వదిలిపెట్టలేదు. వైకల్యం ఉన్నవారిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని వెలికి తీయడం చాలా ముఖ్యం. తన్మయ్ విషయంలో నేను అదే చేశాను." ఎప్పుడైతే ఆమె సాధన మొదలు పెట్టిందో, అప్పటి నుంచి వెనక్కి తగ్గకుండా క్రమశిక్షణతో శిక్షణ తీసుకుంది. మొదట మండల స్థాయి పోటీల్లో పాల్గొని గెలుపొందింది. తరువాత జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ విజయాలు సాధించింది. రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం ఆమెకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన తరువాత మరింత కృషి చేసింది. ప్రతిరోజూ సాధనలో ఏ మాత్రం అలసట చూపలేదు. క్రమంగా ఆటలోని ప్రతి చిన్న టెక్నిక్‌ని అర్థం చేసుకుని, దాన్ని ప్రాక్టీస్‌లో పెట్టింది. ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్‌లోని 'అటల్ బిహారీ వాజ్‌పేయి యూనివర్సిటీ'లో జరిగిన జాతీయ స్థాయి బోసీ బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంది. 22 రాష్ట్రాల నుంచి 250 మంది క్రీడాకారులు పోటీపడ్డ ఈ కాంపిటిషన్‌లో, తన్మయ్ ప్రతిభ అందర్నీ ఆకట్టుకుంది. ప్రతీ రౌండ్‌లోనూ ఆమె ఖచ్చితత్వం, క్రమశిక్షణ గమనించదగ్గవిగా నిలిచాయి. చివరికి స్వర్ణ పతకం సాధించి విజేతగా నిలిచింది. తన్మయ్ తల్లి సుగుణ ఆ క్షణాలను గుర్తుచేసుకుంటూ, "నా కూతురు గెలిచినప్పుడు మాటలు రావడంలేదు. ఆ క్షణం జీవితాంతం గుర్తుండిపోతుంది. మా అమ్మానాన్నల మద్దతు లేకపోతే ఈ స్థాయికి రావడం అసాధ్యం. నా కల అంతర్జాతీయ వేదికపై తన్మయ్ పోటీపడటం. అది త్వరలోనే నెరవేరుతుందని నమ్ముతున్నాను" అని అన్నారు.

బోసీ బాల్ ఆట చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇది సులభమైనదే అయినా, గెలవాలంటే ఖచ్చితత్వం, ప్లానింగ్ అవసరం. ఆటలో మొదట టాస్ గెలిచిన క్రీడాకారుడు తనకు నచ్చిన రంగు బాల్ ఎంచుకుంటాడు. ఆ తరువాత 'పలినా' అనే తెల్ల బాల్ (టార్గెట్ బాల్)కి వీలైనంత దగ్గరగా తన బాల్‌ను త్రో చేయాలి. ప్రతి క్రీడాకారుడికి నాలుగు బాల్స్ కేటాయిస్తారు. ఎవరైతే ఎక్కువ బాల్స్‌ని టార్గెట్‌కు దగ్గరగా ఉంచుతారో వారు విజేత అవుతారు. ఈ ఆటలో శారీరక బలం కంటే మానసిక ఏకాగ్రత ముఖ్యం. ప్రత్యేక అవసరాలు ఉన్న క్రీడాకారుల ఆత్మవిశ్వాసాన్ని పెంచడంలో ఈ ఆట కీలక పాత్ర పోషిస్తుంది. తన్మయ్ స్వయంగా చెప్పిన ప్రకారం, చిన్నప్పటినుంచి స్కూల్‌కు వెళ్లడం తనకు ఇష్టం ఉండేది కాదు. అమ్మ, అమ్మమ్మ, తాతయ్య బలవంతంగా పంపేవారు. కానీ స్కూల్‌లోనే ఈ ఆటతో పరిచయం అయింది. కోచ్ సహనం, ప్రోత్సాహం ఆమెను ఈ స్థాయికి చేర్చాయి. "మా కోచ్ ఎంత విసిగించినా కోపం చూపలేదు. బాగా శిక్షణ ఇచ్చారు. నేను కూడా కష్టపడి సాధన చేశాను. అందుకే ఈ విజయం సాధించగలిగాను" అని తన్మయ్ చెప్పింది. ఈ ప్రయాణం కేవలం ఒక క్రీడా విజయం మాత్రమే కాదు, ఒక కుటుంబం, ఒక కోచ్, ఒక అమ్మాయి కలిసికట్టుగా సాధించిన విజయగాథ. మానసిక వైకల్యం ఉన్నప్పటికీ, పట్టుదల, సరైన మార్గదర్శకం ఉంటే ఎవరైనా జీవితంలో శిఖరాలను చేరగలరని తన్మయ్ తన కృషితో నిరూపించింది. ఇది కేవలం ఒక వ్యక్తిగత గెలుపు కాదు, మానసిక వైకల్యం ఉన్న ప్రతి చిన్నారికి, వారి కుటుంబాలకు ఒక ఆశాకిరణం.

# ఆర్థిక అక్షరాస్యతా అవసరమే!



తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతోపాటు ఆటలు, పాటలు.. ఇలా వారికి ఆసక్తి ఉన్నవాటిపై శిక్షణ ఇప్పిస్తుంటారు. కానీ, ఆర్థికపరమైన అంశాల గురించి ఎక్కువగా చర్చించరు. వాటిపైన పిల్లలకు అవగాహన కల్పించరు. కొందరైతే.. పిల్లలు అడిగినంత డబ్బులు ఇచ్చేస్తుంటారు. మరికొందరు పిల్లల చేతికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా పెంచుతుంటారు. ఈ రెండు పద్ధతులూ సరైనవి కావు. ఇలా చేయడం వల్ల పిల్లలకు డబ్బు విలువ తెలియకుండా పోతుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. పెద్దయ్యాక వారు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో పిల్లలకు ఆర్థిక అక్షరాస్యత అత్యవసరమని సూచిస్తున్నారు.


**అర్థం చేసుకోండి:** డబ్బు సంపాదించడం (ఆదాయం), పొదుపు, ఖర్చు, పెట్టుబడి.. ఆర్థిక నిర్వహణలో ప్రాథమికాంశాలు. ముందుగా మీ పిల్లలకు ఈ విషయాలపై పూర్తిగా అవగాహన కల్పించాలి.

**ఆదాయం:** పిల్లల ప్రధాన ఆదాయ మార్గాలు.. పాకెట్ మనీ, బహుమతులే! కొందరు టీనేజర్లు పార్ట్‌టైమ్ ఉద్యోగం ద్వారా ఎంతో కొంత సంపాదిస్తూ ఉంటారు. అయితే, ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. ఆ డబ్బులను సమర్థంగా నిర్వహించడంలో సాయపడాలి.

**ఖర్చు:** తమ చేతికి వచ్చిన డబ్బును ఏయే వస్తువులపై ఖర్చు చేయాలో పిల్లలకు అవగాహన కల్పించాలి. అవసరం లేనివి కొనుగోలు చేయడం వల్ల డబ్బు ఎలా వృథా అవుతుందో వారికి తెలిసేలా చేయాలి. ఇందుకోసం ఇంట్లో పనికిరాకుండా ఉన్న వస్తువులు, వాటి ఖరీదు, అవి కొనకుండా ఉండటం వల్ల కలిగే ప్రయోజనాలను విడమర్చి చెప్పాలి.

పొదుపు: స్నేహితులకు గిఫ్ట్స్ ఇవ్వడానికి, తమకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసుకోవడానికి పాకెట్ మనీలో పొదుపు చేసిన డబ్బులనే వాడుకోమని చెప్పండి. దీనివల్ల వారిలో 'పొదుపు' చేయడం అలవాటుగా మారుతుంది.

**మదుపు:** మీ పిల్లల దగ్గర ఎక్కువ మొత్తంలో డబ్బులు పోగైతే.. వాటిని చిన్న మొత్తాలుగా మదుపు చేయించండి. లేదా మీ అవసరాల కోసం తీసుకొని.. రెండుమూడు నెలల తర్వాత ఇంకొంత డబ్బు కలిపి పిల్లలకు తిరిగివ్వండి. పెట్టుబడి పెట్టడం ద్వారా కలిగే ప్రయోజనాలను వారు ప్రత్యక్షంగా అనుభవించాలి. అప్పుడే.. వారికి మదుపు విలువ తెలిసొస్తుంది.



# వాటర్‌క్రెస్ తక్కువ కేలరీల ఆహారమే అయినా.. పోషకాలలో గొప్పది..!

వాటర్‌క్రెస్ (నాస్టూర్టియం అఫిసినేల్) అనేది క్యాబేజీ, కాలే, గుర్రపు ముల్లంగితో పాటు బ్రాసికేసి కుటుంబానికి చెందిన నీటి మొక్క. దాని ఆకుపచ్చ, గుండ్రని ఆకులు, బోలు కాడలతో ఇవి చల్లని, స్వచ్ఛమైన నీటిలో పెరుగుతాయి, ఇవి ఎక్కువగా సహజ నీటి గుంటలు, చెరువులకు పచ్చ అందాన్ని తెస్తాయి. వాటర్‌క్రెస్‌ను శతాబ్దాలుగా ఆహారంలో వాడుతూనే ఉన్నాం. ఈ సాగు పురాతన గ్రీస్, రోమ్‌కు చెందినది. ఇప్పుడు ఇది ప్రపంచవ్యాప్తంగా సాగు చేయబడుతోంది, సలాడ్‌లు, సూప్‌లు, శాండ్‌విచ్‌లకు ప్రత్యేక రుచిని అందిస్తోంది. దీనిలోని అద్భుతమైన ఐదు పోషక గుణాలను గురించి తెలుసుకుందాం.

పోషకాలు..వాటర్‌క్రెస్ తక్కువ కేలరీల ఆహారం, కానీ అవసరమైన పోషకాలతో నిండి ఉంటుంది. దీనిలో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలతో పాటు విటమిన్లు %ూ, జ, ఖ, దీ%6 ఉన్నాయి. ఈ పోషకాలు రోగనిరోధక శక్తి నుండి ఎముకల ఆరోగ్యం వరకూ శక్తి ఉత్పత్తిని పెంచుతాయి.

యాంటీ ఆక్సిడెంట్స్..వాటర్‌క్రెస్ బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్‌తో సహా యాంటీఆక్సిడెంట్లతో నిండి ఉంది. ఈ శక్తివంతమైన సమ్మేళనాలు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి, గుండె జబ్బులు, క్యాన్సర్, అల్జీమర్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

ఎముకల ఆరోగ్యం..వాటర్‌క్రెస్‌లోని విటమిన్ కె, కాల్షియం, మెగ్నీషియం ఎముకలకు బలాన్నిస్తుంది. విటమిన్ - ఎముకల నిర్మాణానికి అవసరమైన ప్రోటీన్లను పెంచుతుంది, అయితే కాల్షియం, మెగ్నీషియం బలమైన ఎముకలకు సహకరిస్తాయి.

గుండె ఆరోగ్యం..వాటర్‌క్రెస్ హృదయానికి మంచి చేస్తుంది. బీటా కెరోటిన్ దాని యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే మంచి కొలెస్ట్రాల్ ను పెంచుతాయి, గుండె జబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇందులోని పొటాషియం కంటెంట్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**కాలుష్య కారకాలను తగ్గిస్తుంది.**

వాటర్‌క్రెస్ సహజమైన నిర్విషీకరణం, గ్లూకోసినోలేట్స్ వంటి సల్ఫర్, హానికరమైన టాక్సిన్స్, కాలుష్య కారకాలను తొలగించడంలో సహకరిస్తుంది.

# పిల్లలు ఒంటరిగా ఉండాలనుకుంటున్నారా!



కొంతమంది పిల్లలు ఎవరితోనూ కలవడానికి ఇష్టపడరు. కొన్ని సందర్భాల్లో అయితే గది నుంచి బయటికి కూడా రారు. దీనికి కారణాలేంటో తెలుసుకుందాం!

**అవమానించేలా మాట్లాడడం**

కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎప్పుడూ వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడుతుంటారు. విషయాన్ని సూటిగా చెప్పే వీలున్నప్పటికీ పిల్లల మనసు గాయపరిచేలా మాట్లాడతారు. దీనితో పిల్లలు తమ తల్లిదండ్రుల ముందుకు రావడానికి కూడా ఇష్టపడరు. ఇంటికి బంధువులు, స్నేహితులు వచ్చినప్పుడు వారిముందు పిల్లలను తక్కువచేసి మాట్లాడడం కూడా మంచిది కాదు. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం తగ్గి, బయటి వ్యక్తులతో కలవడానికి ఉత్సాహం చూపించరు.

**అతిగా ప్రశ్నించడం**

స్కూలు, కాలేజీ, స్నేహితుల గురించి ఎక్కువగా ప్రశ్నలు అడగడం పిల్లలకు నచ్చకపోవచ్చు. కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు... ఇలా ఎవరు ఎన్ని ప్రశ్నలు అడిగినా ఉత్సాహంగా సమా?ధానాలు చెబుతారు. ప్రతి విషయాన్ని వారితో పంచుకుంటారు. ఇలాంటి పిల్లలతో ఎటువంటి సమస్యా ఉండదు. కానీ ఇంకొందరు పిల్లలు మాత్రం తమకు సంబంధించిన అంశాలను ఎవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరు. తల్లిదండ్రులు ఏదైనా అడిగినా కూడా చిరాకు పడతారేగానీ ఏమీ చెప్పరు. అవే ప్రశ్నలు గుచ్చిగుచ్చి అడిగితే తప్పించుకునే ప్రయత్నంగా గదిలోకెళ్లి బయటికి రారు. ఈ సమస్య ఎక్కువగా యుక్తవయసు పిల్లల్లో కనిపిస్తుంటుంది. పిల్లలు తమ మనసులోని భావాలను వారంతటవారే చెప్పేలా తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగితే సమస్య సులువుగా పరిష్కారమవుతుంది.

**ఏకాంతం లేకపోవడం**

హైస్కూల్ లేదా కాలేజీలకు వెళ్లే పిల్లలు కొంత ఏకాంతాన్ని కోరుకోవడం సహజం. ఎదిగే పిల్లలు తమ గురించి తాము తెలుసుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, తమతో తాము సంతోషంగా గడపడానికి, భవిష్యత్తు గురించి ఆలోచించుకోవడానికి కొంత సమయం ఒంటరిగా ఉండాలనుకుంటారు. కానీ తల్లిదండ్రులు తెలిసో తెలియకో పిల్లల ఏకాంతాన్ని భంగపరుస్తుంటారు. దీనితో పిల్లలు గదిలోకెళ్లి తలుపులు వేసుకుని గంటల సమయం గడిపేస్తుంటారు. యుక్తవయసు పిల్లల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తూ వారికి మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

**అకారణంగా మందలించడం**

కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు ఎదురుపడితే చాలు 'ఇంట్లో ఏదైనా పని చేయొచ్చు కదా! చదువుకోవచ్చు కదా!' అంటూ ఊరికే మందిలిస్తూ ఉంటారు. దీనితో పిల్లలు గది నుంచి బయటికి రారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కొంతమేర స్వేచ్ఛను ఇస్తూ స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం నేర్పించాలి. ఇది పిల్లల మానసిక వికాసానికి, వారిలో లోకజ్ఞానం పెరగడానికి దోహదం చేస్తుంది.



# ధనురాసనం వేద్దామా

వేసవిలో ఎండ వేడివల్ల అలసటగా నీరసంగా అనిపిస్తూ ఉంటుంది. వీటిని నివారించి ఉత్సాహంగా ఉండాలంటే... ప్రతిరోజూ యోగా చేస్తే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ యోగాలో ముఖ్యమైన భంగిమ 'ధనురాసనం'. దీని గురించి తెలుసుకుందాం.

**ధనురాసనం ఇలా వేయాలి**

ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. మోకాళ్ల నుంచి కాళ్లను పైకి ఎత్తాలి. చేతులను వెనక్కి చాచి కాలి మడమలను పట్టుకోవాలి. మెడను నిటారుగా ఉంచాలి. గుండె నిండా గాలిని పీల్చి పదిహేను సెకండ్లు అలాగే ఉండి తరవాత గాలిని మెల్లగా విడవాలి.

**ప్రయోజనాలు..** ప్రతిరోజూ ధనురాసనం వేయడం వల్ల కండరాలు, కీళ్లు బలోపేతమవుతాయి. శరీరం అన్ని వైపులకూ సులువుగా వంగుతుంది. ఈ ఆసనం వేసేటప్పుడు పొత్తి కడుపు కండరాల మీద ఒత్తిడి పడడం వల్ల అవి దృఢంగా తయారవుతాయి. కడుపు ఉబ్బరం తగ్గుతుంది. జీర్ణాశయం చురుకుగా పనిచేసి అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది.

వెనక్కి వంగడం వల్ల వెన్నెముక బలపడుతుంది. నడుము వంగకుండా ఉంటుంది. నిటారుగా నిలబడి నడిచే సామర్థ్యం పెరుగుతుంది.

తరచూ ఈ ఆసనం వేస్తూ ఉంటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. శరీరంలో ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. దీంతో అలసట, నీరసం, శ్వాస సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

ధనురాసనం వేసే క్రమంలో రెండు కాళ్లు పైకి లేపడం వల్ల శరీరమంతటా రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. దీంతో గుండె, మెదడు ఆరోగ్యంగా పనిచేస్తాయి. కార్యాలయాల్లో ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారు ప్రతిరోజూ ఈ ఆసనం వేస్తూ ఉంటే భుజాలు, మెడ, తల నొప్పులు సహా ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.

# నవ బిజినెస్




## రాబోయే జీఎస్టీ సంస్కరణలు ఇవేనా.. ప్రజలకు ఇక పండగే





**ముంబై-నవభూమి:** జీఎస్టీ విధానంలో భారీ సంస్కరణలు రాబోతున్నాయి. దీపావళి ముందే వీటి గురించి ప్రకటన వెలువడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ప్రకటించారు. ఈ సంస్కరణలను దీపావళి బహుమతిగా పేర్కొన్నారు. జీఎస్టీకి సంబంధించి మూడు అంశాల్లో ఈ సంస్కరణలు చేపట్టబోతున్నట్టు కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించిన ప్రణాళిక కూడా సిద్ధమైంది. త్వరలో జీఎస్టీ కౌన్సిల్ ఈ సంస్కరణలపై చర్చించనుంది.జీఎస్టీ విధానంలో వ్యవస్థాగత మార్పులు, పన్ను శ్లాబుల హేతుబద్ధీకరణ, జీఎస్టీ వ్యవస్థను వ్యాపారులకు మరింత సులభతరం చేయడం లక్ష్యంగా ఈ సంస్కరణలు చేపట్టనున్నారు. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యంగా ముందుకెళుతున్న భారత్.. ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఈ సంస్కరణలు అవసరమని కేంద్రం భావిస్తోంది.ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్స్ పేరుకుపోయి ఇబ్బంది పడుతున్న వ్యాపారులకు సాంత్వన కలిగించి రీఫండ్ విధానాన్ని మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. దీని వల్ల ఇన్‌పుట్ క్రెడిట్ వినియోగం వ్యాపారులకు ఇకపై మరింత సులభతరం కానుంది.పన్ను శ్లాబుల హేతుబద్ధీకరణ ద్వారా సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకు కూడా ప్రభుత్వం సిద్ధమైంది. తద్వారా వస్తు వినియోగం పెరిగి ఆర్థికాభివృద్ధికి బాటలు పరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుతమున్న ఐదు శ్లాబుల స్థానంలో స్టాండర్డ్, మెరిట్ పేరిట రెండే పన్ను శ్లాబులు తీసుకురానున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

## కాగ్నిజెంట్‌లో 80 శాతం సిబ్బంది జీతం పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ ఏడాది నవంబరు 1 నుంచి 80 శాతం సిబ్బంది వేతనాన్ని పెంచనున్నట్లు నాస్‌డాక్ లిస్టెడ్ ఐటీ కంపెనీ కాగ్నిజెంట్ గురువారం ప్రకటించింది. సీనియర్ అసోసియేట్ లెవెల్ వరకు ఉద్యోగులకు వేతన పెంపు ఉండనుందని తెలిపింది. జీతం పెంపు శాతం ఉద్యోగి పనితీరు, ఏ దేశంలోని కార్యాలయంలో పనిచేస్తున్నాడనే ప్రాతిపదికన నిర్ణయించనున్నట్లు కాగ్నిజెంట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. భారత్‌లో నిలకడగా మంచి పనితీరు కనబరుస్తున్న ఉద్యోగికి 9 శాతం వరకు జీతం పెరిగే అవకాశం ఉందన్నారు. టాప్ పెర్‌ఫార్మర్లకు అత్యధిక వేతన పెంపు లభించనుందన్నారు. ఈ ఏడాది ద్వితీయార్థంలో తమ ఉద్యోగులకు పనితీరు ఆధారంగా వేతనాలను పెంచాలనుకుంటున్నట్లు గత నెల 31న రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగానూ కంపెనీ వెల్లడించింది. ఈ మార్చిలో కాగ్నిజెంట్ తన ఉద్యోగులకు గడిచిన మూడేళ్లలో అత్యధిక బోనసను ప్రకటించింది. కాగా, దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ కూడా గత వారంలో 80 శాతం సిబ్బందికి (జూనియర్ నుంచి మధ్య స్థాయి వరకు ఉద్యోగులకు) వేతన పెంపును ప్రకటించింది.ఒరాకిల్‌లో 150కి పైగా ఉద్యోగాల కోత..అమెరికన్ ఐటీ కంపెనీ ఒరాకిల్ తన క్లౌడ్ విభాగం నుంచి 150కి పైగా ఉద్యోగులను తొలగించబోతున్నట్లు తెలిసింది. కంపెనీ తాజా నిర్ణయంతో యూఎసతో పాటు భారత కార్యాలయాల్లోని ఈ విభాగ ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం.

## నవ లిమిటెడ్ లాభం రూ 399 కోట్లు





**హైదరాబాద్ -నవభూమి:** నవ లిమిటెడ్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,232.60 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.399.10 నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 2 శాతం, లాభం 10.5 శాతం తగ్గింది. అయితే గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 16.7 శాతం, లాభం 31.8 శాతం వృద్ధి చెందింది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.572.70 కోట్ల ఆదాయంపై రూ.141 కోట్ల లాభాన్ని ప్రకటించింది. సమీక్షా త్రైమాసికంలో మెటల్స్ వ్యాపారంతో పాటు ఎనర్జీ పోర్టుఫోలియో పనితీరు మెరుగ్గా ఉండటం కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. అయితే జాంబియాలోని విద్యుత్ డివిజన్ మాంబా ఎనర్జీ లిమిటెడ్ (ఎంఈఎల్)కు సంబంధించి 50 శాతం ట్యాక్స్ కన్సెషన్స్ అమలు చేయటం కంపెనీపై కొంత మేర ప్రభావం చూపించిందని తెలిపింది.

## జూలై ఎగుమతుల్లో 7 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ-నవభూమి:** ఎగుమతుల రంగం రెండు నెలల క్షీణతకు స్వస్తి పలికింది. జూలైలో ఎగుమతులు 7.29 శాతం వృద్ధితో 3,724 కోట్ల డాలర్లుగా (రూ.3.24 లక్షల కోట్లు) నమోదయ్యాయి. ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వజ్రాభరణాలు, ఫార్మా, కెమికల్స్ రంగాలు ఈ వృద్ధికి ఊతం ఇచ్చాయి. అదే సమయంలో వాణిజ్య లోటు మాత్రం 8 నెలల గరిష్ఠ స్థాయి 2,735 కోట్ల డాలర్లకు (రూ.2.38 లక్షల కోట్లు) దూసుకుపోయింది. గత ఏడాది నవంబరులో నమోదైన వాణిజ్య లోటు 3,177 కోట్ల డాలర్ల (రూ.2.76 లక్షల కోట్లు) తర్వాత నమోదైన గరిష్ఠ స్థాయి ఇదే. గురువారం వాణిజ్య శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు 8.6% వృద్ధితో 6,459 కోట్ల డాలర్లకు (రూ.5.62 లక్షల కోట్లు) చేరాయి.ట్రంప్ సుంకాల నేపథ్యంలోనూ భారత్-అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెరుగుతోంది. జూలైలో మన దేశం అమెరికాకు 801 కోట్ల డాలర్ల విలువైన సరుకులు ఎగుమతి చేసి,..ఆ దేశం నుంచి 455 కోట్ల డాలర్ల విలువైన సరుకులు దిగుమతి చేసుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే జూలైలో భారత ఎగుమతులు 19.94 శాతం పెరగగా, దిగుమతులు 13.78 శాతం పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లోనూ అమెరికాకు మన ఎగుమతులు 21.64 శాతం పెరిగి 3,353 కోట్ల డాలర్లకు చేరాయి. ఆ దేశం నుచి మన దేశానికి వచ్చే దిగుమతులూ 12.33 శాతం పెరిగి 1,741 కోట్ల డాలర్లకు చేరాయి.

## డీఈసీ ఇన్‌ఫ్రాకు రూ.2000 కోట్ల ఆర్డర్



**హైదరాబాద్ -నవభూమి:** హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ ప్రాజెక్ట్స్.. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2,000 కోట్ల విలువైన కాంట్రాక్ట్‌ను దక్కించుకుంది. ఈ మేరకు సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ నుంచి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీను అందుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్డర్‌లో భాగంగా ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం రెసిడెన్షియల్ భవనాలను నిర్మించాల్సి ఉంటుందని తెలిపింది. శ్రీనివాసపురిలోని 20.86 ఎకరాల విస్తీర్ణంలో మొత్తం 16 బ్లాకుల్లో 1,100 చదరపు అడుగులతో 3,112 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లను నిర్మించాల్సి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం కం పెనీ చేతిలో రూ.10,000 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

# వాణిజ్య లోటు పైపైకి.. గత నెల 8 నెలల గరిష్ఠానికి చేరిక




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసానికి సూచికగా ఉండే వాణిజ్య లోటు గత నెలలో ఏకంగా 8 నెలల గరిష్ఠాన్ని తాకింది. గురువారం విడుదలైన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారిక గణాంకాల ప్రకారం జూలైలో భారత వాణిజ్య లోటు 27.35 బిలియన్ డాలర్లుగా నమోదైంది. గత ఏడాది నవంబర్ తర్వాత ఇదే అత్యధికం కావడం గమనార్హం. నాడు 31.77 బిలియన్ డాలర్లుగా వాణిజ్య లోటు ఉన్నది. జూలైలో దేశంలోకి ఆయా దేశాల నుంచి వచ్చిన దిగుమతుల్లో.. మన దేశం నుంచి వివిధ దేశాలకు వెళ్లిన ఎగుమతులు దాదాపు సగానికే పరిమితమయ్యాయి మరి..

దేశీయ ఎగుమతులు గత నెలలో 37.24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో గతంతో పోల్చితే 7.29 శాతం వృద్ధి కనిపిస్తున్నది. నిజానికి అంతకుముందు రెండు నెలలూ ఎగుమతులు పడిపోయాయి. అయితే జూలైలో పుంజుకున్నాయి. మరోవైపు దేశంలోకి దిగుమతుల విలువ 64.59 బిలియన్ డాలర్లుగా ఉన్నది. మునుపటితో చూస్తే 8.6 శాతం పెరిగింది. అందుకే వాణిజ్య లోటు ఇంతలా ఎగిసిందని మార్కెట్ నిపుణులు ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. కాగా, దేశంలో అన్ని రకాల వస్తూత్పత్తుల తయారీ పెరిగితే.. దిగుమతుల్ని తగ్గించుకోవచ్చని, తద్వారా విదేశీ మారకపు నిల్వలను కాపాడుకోవచ్చని అంటున్నారు. అలాగే ప్రస్తుతం అమెరికా టారిఫ్‌ల దృష్ట్యా ఆయా దేశాలకు ఎగుమతుల్ని పెంచుకోవడానికున్న అవకాశాలను అన్వేషించాలని కూడా కేంద్ర ప్రభుత్వానికి వారు సూచిస్తున్నారు. ఫలితంగా వాణిజ్య లోటును కట్టడి చేయవచ్చని, డాలర్ల రాకనూ పెంచుకోవచ్చని సలహా ఇస్తున్నారు.

**ఏప్రిల్-జూలైలో..**

ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి 4 నెలల్లో (ఏప్రిల్-జూలై) దేశ ఎగుమతులు 3.07 శాతం పెరిగి 149.2 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అయితే ఇదే సమయంలో దిగుమతులు 5.36 శాతం ఎగిసి 244.01 బిలియన్ డాలర్లుగా నమోదు కావడం గమనార్హం. దీంతో వాణిజ్య లోటు 94.81 బిలియన్ డాలర్లుగా ఉన్నది. కాగా, దేశ ఎగుమతుల ప్రోత్సాహానికి తీసుకోవాల్సిన చర్యలను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య కార్యదర్శి సునీల్ భరత్‌వాల్ అన్నారు.

**అమెరికాతో ఇలా..**

ఈ జూలైలో అమెరికాకు భారత్ నుంచి వెళ్లిన ఎగుమతుల్లో 19.94 శాతం వృద్ధి కనిపిస్తున్నది. గత నెల అగ్రరాజ్యానికి 8.01 బిలియన్ డాలర్ల ఎగుమతులు జరిగాయి. అలాగే అమెరికా నుంచి మన దేశానికి దిగుమతులు 13.78 శాతం పెరిగి 4.55 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూలైలో అమెరికాకు భారత ఎగుమతులు 21.64 శాతం పెరిగి 33.53 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అమెరికా నుంచి దిగుమతులు 12.33 శాతం ఎక్కువై 17.41 బిలియన్ డాలర్లకు చేరాయి. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం మొదలు (ఏప్రిల్ నుంచి) అమెరికాకు భారత ఎగుమతులు నెలనెలా పెరుగుతూనే ఉన్నాయి. అయితే ఈ నెల (ఆగస్టు) నుంచి పడిపోవచ్చన్న అంచనాలున్నాయి. అమెరికాలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులపై ట్రంప్ విధించిన సుంకాలే ఇందుకు కారణం. సెప్టెంబర్‌లో ఇవి మరింతగా క్షీణించే అవకాశాలూ కనిపిస్తున్నాయి. 50 శాతం టారిఫ్‌ల ప్రభావం ఉండనున్నది. దీంతో ఈ నెలాఖర్లో ఇరు దేశాల మధ్య జరిగే ఆరో విడుత వాణిజ్య చర్చలకు ప్రాధాన్యం ఏర్పడుతున్నది. చర్చలు ఫలిస్తే సుంకాల భారం తగ్గే అవకాశాలున్నాయి.

గత నెల జూలైలో దేశీయ ఇంజినీరింగ్ ఎగుమతుల విలువ 10.42 బిలియన్ డాలర్లుగా ఉన్నది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 3.76 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

రత్నాలు-ఆభరణాల ఎగుమతులు 2.4 బిలియన్ డాలర్లు, ఔషధ రంగ ఎగుమతులు 2.7 బిలియన్ డాలర్లు, రసాయన ఎగుమతులు 2.46 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

పెట్రోలియం ఎగుమతులు గతంతో చూస్తే 25 శాతం పడిపోయి 4.34 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

దేశంలోకి ముడి చమురు దిగుమతులు 7.46 శాతం పెరిగి 15.57 బిలియన్ డాలర్లకు చేరాయి.

బంగారం దిగుమతులు సైతం 13.83 శాతం వృద్ధితో ఏడాది కిందటితో పోల్చితే 3.93 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

గత ఏడాది జూలైలో 30.60 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ సేవా రంగ ఎగుమతులు.. ఈ ఏడాది జూలైలో స్వల్పంగా పెరిగి 31.03 బిలియన్ డాలర్లకు చేరాయి.

దేశీయ సేవా రంగ దిగుమతులు గత నెల 15.40 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు అంచనా.

ఈ ఏడాది ఏప్రిల్-జూలైలో దేశ సేవా రంగ ఎగుమతులు 128.43 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఏడాది కిందట ఇదే వ్యవధిలో ఇవి 119.07 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.


జూలైలో చైనాకు భారత్ నుంచి 1.34 బిలియన్ డాలర్ల ఎగుమతులు. ఏప్రిల్-జూలైలో 5.75 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

చైనా నుంచి దిగుమతులు గత నెల 10.91 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఏప్రిల్-జూలైలో 40.65 బిలియన్ డాలర్లు.

యూఏఈ, బ్రిటన్, జర్మనీ, బంగ్లాదేశ్, బ్రెజిల్, ఇటలీలకు భారత్ నుంచి పెరిగిన ఎగుమతులు. నెదర్లాండ్స్, సింగపూర్, సౌదీ అరేబియా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్‌లకు ఎగుమతుల్లో తగ్గుదల.

యూఏఈ, రష్యా, ఇండోనేషియా, ఖతార్, తైవాన్‌ల నుంచి జూలైలో తగ్గిన దిగుమతులు. సౌదీ అరేబియా, సింగపూర్, దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్, థాయిలాండ్ నుంచి దిగుమతుల్లో పెరుగుదల.


# భారత్ రేటింగ్ పెంపు




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అని నోరు పారేసుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఆ దేశానికే చెందిన ప్రముఖ అంతర్జాతీయ పరపతి రేటింగ్ సంస్థ 'ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్' గట్టి సమాధానం ఇచ్చింది. దీర్ఘకాలిక దృష్టితో చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ పునాదులు చాలా పటిష్ఠంగా ఉన్నట్టు తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత దేశ సార్వభౌమ పరపతి రేటింగ్‌ను 'బీబీబీ మైనస్' స్థాయి నుంచి 'బీబీబీ' స్థాయికి పెంచుతున్నట్టు ప్రకటించింది. గత 18 సంవత్సరాల్లో ఈ సంస్థ మన దేశ పరపతి రేటింగ్‌ను పెంచడం ఇదే మొదటిసారి. ట్రంప్ సుంకాల పోటు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా, హుషారుగా ఉన్నట్టు తెలిపింది. ఈ పరపతి రేటింగ్ పెంపుతో కేంద్ర ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు తక్కువ వడ్డీకే విదేశాల నుంచి రుణాలు, నిధులు సమీకరించగలుగుతాయని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాల కత్తి వేలాడుతున్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధి రేటుకు ఎలాంటి ఢోకా ఉండదని ఎస్ అండ్ పీ గ్లోబల్ అంచనా. గత ఆర్థిక సంవత్సరంలోలానే ఈ ఆర్థిక సంవత్సరం కూడా భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తుందని తెలిపింది. తగ్గుతున్న వడ్డీ రేట్లు, ద్రవ్యోల్బణం ఇందుకు దోహదం చేస్తాయని పేర్కొంది.పరపతి రేటింగ్ పెంపు విదేశాల నుంచి మన దేశం మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేందుకూ దోహదం చేయనుంది. ఈ రేటింగ్ పెంపుతో మన దేశ మధ్య, దీర్ఘకాలిక అవకాశాలపై దేశ, విదేశీ పెట్టుబడిదారులకు మరింత నమ్మకం ఏర్పడనుంది. దీంతో ఎఫ్‌పీఐలతో పాటు విదేశీ కంపెనీలూ మన దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని భావిస్తున్నారు. ట్రంప్ సుంకాలతో అనిశ్చితిలో పడిన భారత ఆర్థిక వ్యవస్థకు ఈ పరపతి రేటింగ్ పెంపు పెద్ద ఊరట అని మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డైరెక్టర్ ఎన్ఆర్ భానుమూర్తి చెప్పారు. ఈ రేటింగ్స్ ప్రభావం ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మారకం రేటు స్థిరపడేందుకూ దోహదం చేస్తుందని ఆర్థిక నిపుణుల అంచనా.

డొనాల్డ్ ట్రంప్ అధికార పగ్గాలు చేపట్టిన మూడు నెలలకే అంటే మే నెలలో మూడీస్ రేటింగ్స్.. అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ నుంచి డబుల్ 'ఏ'కు తగ్గించింది. అంతకుముందు ఫిచ్ రేటింగ్స్ కూడా 2023 ఆగస్టులో అమెరికా పరపతి రేటింగ్‌ను ట్రిపుల్ ఏ రేటింగ్ నుంచి డబుల్ ఏ రేటింగ్‌కు తగ్గించింది. అప్పటి నుంచే అమెరికాలో వడ్డీ రేట్లు గణనీయంగా పెరిగాయి. తాజాగా ట్రంప్ సుంకాల పోటు, అర్థంపర్థం లేని ఆర్థిక విధానాలతో అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.


## స్థిరంగా బంగారం ధర.. బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..



**హైదరాబాద్ -నవభూమి:** భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం ధరలు ఇటీవల ఆల్‌టైమ్ గరిష్టానికి చేరువ అయ్యాయి అయితే ప్రస్తుతం మళ్లీ క్రమంగా కిందికి దిగివస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు (ఆగస్ట్ 15న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 01, 340కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 92, 890కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే బంగారం ధరల్లో మార్పు లేదు.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 01, 490కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 93, 040కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 01, 340కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 92, 890కి చేరింది. వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం రేట్లు (10 గ్రాములకు) (24 క్యారెట్, 22 క్యారెట్)

హైదరాబాద్‌లో రూ. 1, 01, 340, రూ. 92, 890
విజయవాడలో రూ. 1, 01, 340, రూ. 92, 890
ఢిల్లీలో రూ. 1, 01, 490, రూ. 93, 040
ముంబైలో రూ. 1, 01, 340, రూ. 92, 890
వడోదరలో రూ. 1, 01, 390, రూ. 92, 940
కోల్‌కతాలో రూ. 1, 01, 340, రూ. 92, 890
చెన్నైలో రూ. 1, 01, 340, రూ. 92, 890
బెంగళూరులో రూ. 1, 01, 340, రూ. 92, 890
కేరళలో రూ. 1, 01, 340, రూ. 92, 890
పుణెలో రూ. 1, 01, 340, రూ. 92, 890

## చాట్ జీపీటీ బంపర్ ఆఫర్.. రూ. 399కే పెయిడ్ వర్షన్




**హైదరాబాద్ -నవభూమి:**చాట్ జీపీటీ గో, చాట్ జీపీటీ ప్లస్, చాట్ జీపీటీ ప్రో. చాట్ జీపీటీ ప్లస్ కోసం నెలకు ఏకంగా 2500 రూపాయల దాకా చెల్లించాల్సి ఉంటుంది. చాట్ జీపీటీ ప్రో కోసం ఏకంగా 25 వేల దాకా చెల్లించాల్సి ఉంటుంది.

ప్రస్తుతం అన్ని రంగాల్లో ఏఐ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా చాట్ జీపీటీ 'అల్లాద్దిన్ అద్భుత దీపం'లా మారిపోయింది. జనాలు చాట్ జీపీటీ మీదే ఎక్కువ ఆధారపడుతున్నారు. అయితే, చాట్ జీపీటీ ఫ్రీ వర్షన్‌ను కొంత వరకు మాత్రమే వాడుకోగలం. ఫ్రీ వర్షన్‌లో ప్రతీ టాస్క్‌కు లిమిట్ ఉంది. చాట్ జీపీటీ సత్తా ఏంటో చూడాలంటే.. పెయిడ్ వర్షన్ వాడాల్సిందే. చాట్ జీపీటీ పెయిడ్ వర్షన్ మూడు ప్లాన్లలో అందుబాటులో ఉంది.చాట్ జీపీటీ గో, చాట్ జీపీటీ ప్లస్, చాట్ జీపీటీ ప్రో. చాట్ జీపీటీ ప్లస్ కోసం నెలకు ఏకంగా 2500 రూపాయల దాకా చెల్లించాల్సి ఉంటుంది. చాట్ జీపీటీ ప్రో కోసం ఏకంగా 25 వేల దాకా చెల్లించాల్సి ఉంటుంది. చాట్ జీపీటీ ఇండియన్ కస్టమర్స్‌ను దృష్టిలో పెట్టుకుని 'చాట్ జీపీటీ గో' ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్‌ను కొత్తగా లిస్టులో కూడా చేర్చింది. కేవలం 399 రూపాయలకే ఫ్రీ వర్షన్ కంటే బెటర్ టాస్కులను చేసుకునే అవకాశం కల్పిస్తోంది. ఇండియాలో ధరల టెస్టులో భాగంగా కొత్త ప్లాన్‌ను తీసుకొచ్చింది.

చాట్ జీపీటీ గో ఫీచర్స్..చాట్ జీపీటీ గో .. ఫ్రీ ప్లాన్ కంటే కొంచెం బెటర్ అనే చెప్పాలి. ఫ్రీ ప్లాన్ లాగానే ఇందులో కూడా జీపీటీ 5 ను యాక్సెస్ చేసుకునే అవకాశం ఉంది. మెసేజెస్, అప్‌లోడ్స్ లిమిట్స్ పరిమితి ఫ్రీ ప్లాన్ కంటే కొంచెం బెటర్‌గా ఉంటుంది. ఎక్కువ మొత్తంలో ఫొటోలను జనరేట్ చేసుకోవచ్చు. రీసెర్చ్ విషయంలో మాత్రం లిమిట్ ఉంది. డేటా ఎక్కువ రోజులు స్టోర్ అయి ఉంటుంది. డేటా అనాలసిస్‌కు కూడా స్కోప్ ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరలు పెడితే ఇండియాలో ఎక్కువ మంది సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటారని ఓపెన్ ఏఐ భావిస్తోంది. ఇందులో భాగంగానే ప్లాన్ల ధరల్ని ఇండియన్ కరెన్సీలో ఉంచుతోంది.

## మహిళల కోసం కేంద్రం బెస్ట్ స్కీమ్స్.. చిన్న మొత్తాల్లో పెట్టుబడితో బంపర్ రిటర్న్స్!



**న్యూఢిల్లీ-నవభూమి:**కేంద్ర ప్రభుత్వం దాదాపు అన్ని వర్గాల వారి కోసం ఎన్నో పథకాల్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో చిన్న పిల్లల దగ్గర్నుంచి మొదలుకొని.. ఆడపిల్లలు, మహిళలు, ఉద్యోగులు, సీనియర్ సిటిజెన్లు ఇలా వేర్వేరు వర్గాల వారి కోసం విభిన్న స్కీమ్స్ తీసుకొచ్చింది. ఎక్కువగా ఇండియా పోస్ట్ ద్వారా పోస్టాఫీస్ స్కీమ్స్ ఆఫర్ చేస్తుంటుంది. ఇక్కడ చిన్న మొత్తాల్లో ఇన్వెస్ట్ చేయొచ్చు. కేంద్ర ప్రభుత్వ మద్దతు కారణంగా గ్యారెంటీ రిటర్న్స్ వస్తాయి. దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో రిటర్న్స్ ఇచ్చే పథకాలు చాలానే ఉంటాయి. చాలా వాటిల్లో మహిళలు ఇన్వెస్ట్ చేయొద్దేమో అని అనుకుంటుంటారు. అలాంటిదేం లేదు. చాలా పోస్టాఫీస్ పథకాల్లో మహిళలు కూడా చేరొచ్చు. వాటి గురించి చూద్దాం. సుకన్య సమృద్ధి అకౌంట్- ఇది ఆడపిల్లల కోసం అందుబాటులో ఉన్న అద్భుత పథకాల్లో ఒకటి. బేటీ బచావో- బేటీ పడావో క్యాంపెయిన్ కింద కేంద్రం ఈ స్కీంను లాంచ్ చేసింది. ఇక్కడ పదేళ్ల వయసు లోపు అమ్మాయిల పేరిట ఖాతా తెరవాలి. వరుసగా 15 ఏళ్లు ఇక్కడ డబ్బులు కట్టాల్సి ఉంటుంది. మెచ్యూరిటీ అకౌంట్ తెరిచిన 21 ఏళ్లకు వస్తుంది.

అమ్మాయి పదో తరగతి పాసయ్యాక.. లేదా 18 ఏళ్లు నిండాక 50 శాతం వరకు డబ్బులు వెనక్కి తీసుకోవచ్చు. 18 ఏళ్లు నిండి పెళ్లి సమయంలో.. పూర్తిగా వెనక్కి తీసుకోవచ్చు. ఇందులో వార్షిక ప్రాతిపదికన కనీసం రూ. 250 తో అకౌంట్ తెరవొచ్చు. గరిష్టంగా ఏటా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ప్రస్తుతం ఇందులో 8.20 శాతం వడ్డీ రేటు ఉంది. గరిష్ట పెట్టుబడిపై ఇక్కడ దాదాపు రూ. 70 లక్షల వరకు వస్తుందని చెప్పొచ్చు.౧౧ పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కం స్కీమ్- ఇది మహిళలతో పాటు అందరికీ అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఒక్కసారి పెట్టుబడి పెట్టి.. ప్రతి నెలా వడ్డీ పొందొచ్చు. స్థిరమైన ఆదాయం కోరుకునే వారికి ఇది బెస్ట్. వడ్డీ రేటు ప్రస్తుతం 7.40 శాతంగా ఉంది. ఇందులో సింగిల్ అకౌంట్ కింద గరిష్టంగా రూ. 9 లక్షలు, జాయింట్ అకౌంట్ కింద రూ. 15 లక్షల వరకు పెట్టొచ్చు. కనీసం రూ. 1000 సరిపోతుంది. టెన్యూర్ ఐదేళ్లుగా ఉంది. పై వడ్డీ రేటు ప్రకారం.. మీ ఇన్వెస్ట్‌మెంట్‌పై నెలనెలా వడ్డీ వస్తుంది.

పీపీఎఫ్- ఇది కూడా మహిళలతో పాటు అందరికీ అందుబాటులో ఉంది. ఇక్కడ వడ్డీ రేటు 7.10 శాతంగానే ఉన్నా.. దీర్ఘకాలంలో కాంపౌండింగ్ ఎఫెక్ట్‌తో మంచి రిటర్న్స్ వస్తాయి. ఇక్కడ వయసుతో సంబంధం లేదు. ఎప్పుడన్నా చేరొచ్చు. వరుసగా 15 ఏళ్లు కట్టాలి. అవసరమైతే ఐదేళ్ల చొప్పున పొడిగించుకుంటూ వెళ్లొచ్చు. ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 500 నుంచి గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. దీనిని ఒకేసారి లేదా ఇన్‌స్టాల్‌మెంట్ల రూపంలో కట్టొచ్చు. ఇక్కడ పాత పన్ను విధానం ప్రకారం.. పెట్టుబడి, వడ్డీ ఆదాయం, మెచ్యూరిటీ రిటర్న్స్ దేనిపైనా పన్ను ఉండదు. గరిష్ట పెట్టుబడిపై 25 ఏళ్ల పాటు కడితే.. రూ. కోటికిపైనే అందుతుంది.

నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్- ఈ స్కీమ్ వ్యవధి కూడా ఐదేళ్లుగా ఉంది. ఇక్కడ ఒకరి పేరు మీద ఎన్ని అకౌంట్లయినా తెరవొచ్చు. వడ్డీ రేటు 7.70 శాతంగా ఉంది. 18 ఏళ్లు నిండిన వారు అకౌంట్ ఓపెన్ చేయొచ్చు. మైనర్ పేరిట గార్డియెన్స్ ఖాతా తెరవొచ్చు. కనీసం రూ. 1000 తో చేరొచ్చు. గరిష్ట పరిమితి లేదు. మెచ్యూరిటీ తర్వాత అసలు, వడ్డీ కలిపి వస్తుంది. ఇది కూడా అందరికీ అందుబాటులో ఉన్న పథకమే.

# పెళ్లి పీటలెక్కిన టాలీవుడ్ హీరో..క్యూట్ కపుల్‌కి విషెస్ చెబుతున్న నెటిజన్స్



ఇటీవల టాలీవుడ్ ప్రముఖులు ఒక్కొక్కరుగా వైవాహిక జీవితంలోకి అడుగుపెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే 'కేరింత' ఫేమ్ యంగ్ హీరో విశ్వంత్ తన జీవితంలోని కొత్త అధ్యాయాన్ని మొదలుపెట్టాడు. బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెబుతూ, ఆయన భావన అనే యువతితో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన పెళ్లికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఈ క్యూట్ కపుల్‌కి నెటిజన్స్‌తో పాటు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.
అప్పట్లో భావనతో దిగిన పలు ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. A Promise of a Lifetime అనే క్యాప్షన్‌తో ఆనందాన్ని పంచుకున్నాడు. అయితే అప్పట్లో అతను నిశ్చితార్థం ఫొటోలు పంచుకున్నాడా, లేకుంటే పెళ్లి ఫొటోలు షేర్ చేశాడా అనేది ఎవరికి అర్ధం కాలేదు. అయితే తాజాగా మాత్రం ఎలాంటి ప్రకటన లేకుండా సింపుల్‌గా మూడు ముళ్ల బంధంతో ఒక్కటయ్యారు ఈ జంట. ప్రస్తుతం వారి వెడ్డింగ్ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోట కు చెందిన విశ్వంత్, కోయంబత్తూరులో ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సమయంలో, దిల్ రాజు బ్యానర్‌లో తెరకెక్కిన 'కేరింత' సినిమాలో నటించే అవకాశం వచ్చింది. అప్పుడే సినిమా పట్ల ఆసక్తితో ఇంజినీరింగ్ మధ్యలోనే వదిలేసి ఇండస్ట్రీలో అడుగుపెట్టాడు. 'కేరింత' సినిమా మంచి హిట్ కావడంతో విశ్వంత్‌కి పాజిటివ్ రెస్పాన్స్, వరుసగా అవకాశాలు వచ్చాయి. హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటించి తన స్థాయిని నిరూపించుకున్నాడు.

నవచిత్ర



## అయ్యో పూజా.. ఇక డిసైడ్ చేసేది ఆ ఒక్క సినిమానే

అయ్యో పూజా.. ఇక డిసైడ్ చేసేది ఆ ఒక్క సినిమానే
ఇండ్రస్టీలో పొడుగుకాళ్ల సుందరిగా పేరున్న పూజా హెగ్డేకు టైమ్ కలిసి రావట్లేదు. చాలా కాలంగా ఆమె మంచి సాలిడ్ హిట్ కోసం ఎదురు చూస్తుంది. రీసెంట్‌గా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన రెట్రోలో హీరోయిన్‌గా నటించింది పూజా. అయితే ఈ సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఒకప్పుడు టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగు వెలిగిన పూజాకు.. ప్రస్తుతం తెలుగులో అవకాశాలు రావట్లేదు. డీసెంట్ హిట్ అందుకోవడానికి తీవ్రంగా కష్టపడుతుం. అయితే తాజాగా రజనీకాంత్ కూలీ సినిమాలో మోనికా అనే స్పెషల్ సాంగ్‌లో పూజా ఆడిపాడింది. ఈ పాట రిలీజ్‌కు ముందు ఫుల్ పాపులారిటీ సంపాదించింది. ఈ పాటకు ఫుల్ క్రేజ్ ఏర్పడింది. అయితే పూజా మరోసారి ట్రోలింగ్ అవుతుంది. నిన్న విడుదలైన కూలీకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. ఈ కారణంగానే ఆమెపై ట్రోల్స్ వస్తున్నాయి. పూజా ఇందులో ఆకట్టుకునేందుకు బాగా ట్రై చేసినప్పటికీ.. పాట చిత్రీకరణ ఆకట్టుకోలేదు. అలాగే సినిమాలో ఈ పాటను సరైన సన్నివేశంలో ఉంచలేదని అంటున్నారు. కూలీ విడుదలైన తర్వాత పూజా హెగ్డేను తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. పూజా బ్యాడ్ లక్ కొనసాగుతుందని.. ఆమెపై నెటిజన్లు నెగిటివ్ కామెంట్స్ చేస్తున్నారు. మోనికా పాటలో పూజా అందంగా, బోల్డ్ గా ఉన్నప్పటికీ.. ఇందులో నటుడు సౌబిన్ షాహిర్ తన డ్యాన్స్ తో ఆకట్టుకున్నాడు. దీంతో ఈ పాటతోనైనా క్రేజ్ వస్తుందని పూజా భావించగా.. రివర్స్ లో ట్రోలింగ్ కు గురైంది. దీంతో డీసెంట్ హిట్ కోసం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. మరోవైపు, బాలీవుడ్ లో పలు ప్రాజెక్ట్‌లు చేస్తుంది. కానీ, అవేం పెద్దగా క్రేజ్ ఉన్న సినిమాలు కావు. దీంతో ఆమె ఆశలన్నీ ప్రస్తుతం విజయ్ జన నాయగన్ సినిమాపైనే ఉన్నాయి. ఇది విజయ్ 63వ సినిమాగా తెరకెక్కుకుంది. హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. కాగా, విజయ్ కెరీర్‌లో ఇదే ఆఖరు సినిమా అని ఆయన ఇప్పటికే చెప్పేశారు. అయితే ఈ సినిమా ఫలితంపైనే పూజా కెరీర్ ఆధారపడి ఉంది. ఆమెకు భవిష్యత్‌లో అవకాశాలు రావాలంటే ఈ సినిమా బాగా ఆడాలి. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్‌గా కనిపించనున్నాడు. భారీ అంచనాలతో ఈ సినిమా 2026 సంక్రాంతికి రిలీజ్ కానుంది.



## అనుష్క తర్వాత రేసులో సమంత!



కూలీ రిలీజ్‌తో లోకేష్ కనగరాజ్ ఫ్రీ అయిపోయాడు. తదుపరి కర్తవ్యం ఎల్ సీ యూ నుంచి ఖైదీ 2-ని పట్టాలెక్కించడమే. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు బ్యాకెండ్ టీమ్ నిర్వహిస్తోంది. రేపటి నుంచి ఆ పనులు మరింత వేగవంత కానున్నాయి. కార్తీ కూడా వీలైనంత త్వరంగా ఆన్ సెట్స్ లో ఉన్న ప్రాజెక్టు పూర్తి చేసి లోకేష్ టీ ఎ౦ తో కలవడానికి రెడీ అవుతున్నాడు. ఈసారి ప్రాజెక్ట్ లోకి లోకేష్ లేడీ భామల్ని కూడా తెరపైకి తెస్తున్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఓ కీలకపాత్రకు స్వీటీ అనుష్క పేరును పరిశీలి స్తున్నట్లు తెరపైకి వచ్చింది. అనుష్క సైతం ఎంతో ఎగ్జైట్ మెంట్ తో ఎదురు చూస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆమె పాత్ర వివరాలు రివీల్ కాలేదుగానీ లోకీ టీమ్ తో మాత్రం ఇంటరాక్ట్ అవుతున్నట్లు కోలీవుడ్ మీడియాలో బలమైన ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రాజెక్ట్ రేసులోకి సమంత పేరు తెరపైకి వస్తోంది. సమంతను కూడా ఓ కీలక పాత్రకు పరిశీలిస్తున్నట్లు వినిపిస్తుంది. మరి సమంత రోల్ సపరేటా? ఒకే పాత్ర కోసం అనుష్క, సమంత పేర్లు పరిశీలిస్తున్నారా? అన్నది తేలాల్సిన అంశం. ఎల్‌సీయూ నుంచి రిలీజ్ అయిన ఖైదీ, విక్రమ్‌లో లేడీ భామలు ఎక్కడా కనిపించలేదు. అందులో కథ అంతా మేల్ పాత్రల చుట్టూనే నడిపించాడు లోకీ. పాటలకు ఛాన్స్ తీసుకోలేదు. స్టోరీ.. ..గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లేతోనే ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేసాడు. ఈ నేపథ్యంలో ఎల్ సీయూలో అందమైన భామలు యాడ్ అయితే తెర పరిపూర్ణమయ్యేది? అన్న అంశం చర్చకొచ్చింది. ఈ నేపథ్యంలో ఖైదీ 2కి హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఈ ప్రచారంలో నిజానిజాలు తేలాల్సి ఉంది. సమంత కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఖుషీ తర్వాత హీరోయిన్‌గా మ్యాకప్ వేసుకోలేదు. బాలీవుడ్‌లో వెబ్ సిరీస్‌లు చేయడం తప్ప హీరోయిన్ ఛాన్స్ తీసుకోలేదు. అటు అనుష్క కూడా సీరియస్‌గా కెరీర్‌ని పట్టాలెక్కించడం లేదు. త్వరలో ఘాటీతో ప్రేక్షకుల ముందకు రానుంది. ఈ సినిమా మంచి కంబ్యాక్ చిత్రంగా నిలుస్తుందని స్వీటీ కాన్ఫిడెంట్‌గా ఉంది. మరో రెండు..మూడు కథలు విని హోల్డ్‌లో పెట్టింది. అందులో ఒకటిగా ఖైదీ 2- ఉంది. మరి సమంత, అనుష్క ఎంట్రీపై లోకేష్ స్పందిస్తే తప్ప క్లారిటీ రాదు.

## బ్లాక్ డ్రెస్సులో కుర్రకారుని పిచ్చెక్కిస్తున్న దిశా పటానీ



తన హాట్ గ్లామర్‌తో కుర్రకారును ఎప్పటికప్పుడు ఆకర్షిస్తూనే ఉండే హీరోయిన్‌లలో దిశా పటానీ ఒకరు. తన మూవీకి సంబంధించిన అప్‌డేట్‌లతో పాటు తన ఫొటోషూట్‌లను అభిమానులతో సోషల్ మీడియాలో అప్పుడప్పుడు పంచుకుంటుంది ఈ అమ్మడు. ఇవి చూసి ఫ్యాన్స్ పిచ్చిక్కిపోవడమే కాకుండా.. వైరల్ చేస్తుంటారు. ఇదిలావుంటే తాజాగా ఈ అమ్మడు బ్లాక్ డ్రెస్‌లో తాజాగా ఫొటోలను పంచుకుంది. ఈ డ్రెస్‌లో తన గ్లామరస్ పోజులతో కుర్రకారు హృదయాలను కొల్లగొడుతోంది. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలను మీరు కూడా చూసేయండి.

## టాలీవుడ్ కాదన్నా ఆ రెండు భాషల్లో!



తమిళ బ్యూటీ ప్రీతీ ముకుందన్ కన్నప్పతోనే వెలుగులోకి వచ్చింది. కానీ అమ్మడు ఓంభీమ్ భూష్- అంటూ చాలా కాలం క్రితమే టాలీవుడ్‌లో కెరీర్ ప్రారంభించింది. కానీ ఆ సినిమా వైఫల్యంతో వెలుగులోకి రాలేకపోయింది. అందం, అభినయం గల నాయికే అయినా? వైఫల్యం వెనక్కి నెట్టేసింది. గ్లామర్ డోస్ లోనూ ఏమాత్రం తక్కువ కాదని సందర్భం దొరికిన ప్రతీసారి సత్తా చాటే ప్రయత్నం చేసింది. ఆ రకమైన ఛాన్స్ తీసుకున్నా? అమ్మడికి అదృష్టం కలసి రాలేదు. అవకాశాలు..సక్సస్ లు రెండు లేకపోవడంతో బాగా వెనుకబడింది. చివరికి మంచు ఫ్యామిలీ రూపంలో కన్నప్పలో నటించే ఛాన్స్ దక్కింది. ఇందులో మెయిన్ లీడ్ పోషించింది. పాన్ ఇండియా సినిమా కావ దంతో సక్సెస్ గ్యారెంటీగా భావించింది. సినిమాలో శక్తిమేర శ్రమించింది. పాత్రలో గ్లామర్ సైతం పండిం చింది. కానీ కన్నప్ప ఫలితం కూడా అమ్మడిని తీవ్ర నిరాశలోకి నెట్టేసింది. ప్రస్తుతం టాలీవుడ్‌లో కొత్త ఛాన్సులేవి చేతిలో లేవు. దీంతో అమ్మడు ఇతర భాషలపై దృష్టి పెట్టింది. ప్రస్తుతం మాలీవుడ్‌లో -మైనే ప్యార్ కియా- అనే చిత్రంలో నటిస్తోంది. హృద్ హరున్ ఇందులో హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. మిగతా పనులు పూర్తి చేసుకుని ఆగస్ట 29న ఈ చిత్రం రిలీజ్ అవుతుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు ముందే అమ్మడు మరో రెండు మాలీవుడ్ ఛాన్సులు అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ప్రాజెక్ట్‌ల వివరాలు బయటకు రాలేదు గానీ ఛాన్సులు మాత్రం ఒడిసి పట్టుకున్నట్లు గట్టిగానే ప్రచారం జరుగుతోంది. అలాగే తమిళ్‌లో కూడా మరో రెండు సినిమాలు సైన్ చేసినట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలొస్తున్నాయి. మరి వీటితోనైనా అమ్మడు సౌత్‌లో బిజీ అవుతుందేమో చూడాలి. ఆ సక్సస్ లతో టాలీవుడ్‌లో మళ్లీ కం బ్యాక్ అయినా అవ్వొచ్చు. వైఫల్యాలు ఎక్కడైనా సహజం. వాటిని జయించి ముందుకొచ్చిన వారి కెరీర్‌కి తిరుగుండదు. అలాంటి హీరోయిన్ల జాబితాలో ప్రీతి చేరుతుందేమో చూడాలి.

## నీలాంబరి మొదటి ఛాయిస్ వాళ్లిద్దరా?



నీలాంబరి పాత్రతో రమ్యకృష్ణ కు వచ్చిన గుర్తింపు గురించి చెప్పాల్సిన పనిలేదు. నరసింహలో లేడీ విలనీ నిలాంబరి పాత్ర రమ్యకృష్ణ కెరీర్ లో ఓ గొప్ప పాత్రగా నిలిచిపోయింది. అప్పటి వరకూ సాఫ్ట్ పాత్రలతో అలరించిన రమ్యకృష్ణలో నీలాంబరి కోణాన్ని చూసిన రవికుమార్ ఆ పాత్రకే వన్నే తీసుకొ చ్చారు. సినిమా లో ఆ పాత్ర సూపర్ స్టార్ రజనీకాంత్ రోల్ కు ధీటుగా ఉంటుంది. సౌందర్య చెంపపై కాలు వేసే సీన్ సిని మాకే హైలైట్. ఇద్దరు బలమైన నాయికల విషయంలో ఏ డైరెక్టర్ ఇలాంటి ఛాన్స్ తీసుకోడు. కానీ రవి కుమార్ సన్నివేశం పండించడం కోసం ఎంత మాత్రం వెనకడుగు వేయకుండా ఛాన్స్ తీసుకున్నారు. ఈ విషయంలో అంతే ధైర్యంగా నటించింది సౌందర్య. అయితే ఈ సన్నివేశంలో నటించడానికి రమ్యకృష్ణ ఎంతో మధన పడింది. తోటి నటితో అలాంటి సన్నివేశం చేయాలంటే? మనసు రాలేదు. మన సు చంపుకునే ఆ సన్నివేశంలో నటించారు. ఈ విషయంలో సౌందర్య అందించిన గొప్ప సహకారంతోనే సాధ్యమైంది. రమ్యకృష్ణ ఆ సీన్ లో నటించనంటే? సౌందర్య రమ్యకృష్ణ కాలు తీసుకుని చెంప మీద పెట్టుకుని నటించమని కోరింది. ఆ కారణంగానే రమ్యకృష్ణ సాహసించింది. అయితే తొలుత నీలాంబరి పాత్ర కోసం రమ్యకృష్ణను అనుకో లేదు అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని దర్శకుడు రవికుమార్ రివీల్ చేసారు. ఆ పాత్రలో మీనాను తీసుకోవాలనుకున్నారుట. ఆమె సంప్రదింపులు కూడా జరిపారు. కానీ మీనా ముఖంలో పసితనం గమనించి..ఆ పాత్రకు తాను న్యాయం చేయలేదని భావించి ఆలోచన మార్చు కున్నారు. అనంతరం అదే పాత్రకు నగ్మతోనూ సందప్రదింపులు జరిపారుట. అదే సమయంలో రమ్యకృష్ణ పేరు కూడా మెదలడంతో మరింత పర్ఫెక్షన్ ఉంటుందని రమ్యని తీసుకున్నట్లు తెలిపారు. ఆ పాత్రకు యాటి ట్యూడ్ కూడా అంతే అవసరమని భావించి మరో ఆలోచన లేకుండా రమ్యకృష్ణను ఫైనల్ చేసినట్లు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

## వెయ్యి కోట్ల కల.. కూలీతో కూడా సాధ్యం కానట్టేనా?



రూ.1000 కోట్ల క్లబ్ లో తమ చిత్రం నిలవాలని భారతీయ సినీ పరిశ్రమలో ప్రతి స్టార్ హీరో, దర్శకుడు, నిర్మాత కలలు కనడం సహజం. దంగల్, బాహుబలి 2, కేజీఎఫ్ 2, ఆర్ఆర్ఆర్, పఠాన్, జవాన్, కల్కి 2898 ఏ.డి., పుష్ప 2 వంటి చిత్రాలు ఇప్పటికే ఈ ప్రతిష్ఠాత్మక క్లబ్‌లో చేరాయి. వీటిలో సగం టాలీవుడ్‌కు చెందినవే కావడం విశేషం. తెలుగు సినిమా ఇండస్ట్రీ సత్తా చాటుతూ ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతుండగా, మూడు బాలీవుడ్ సినిమాలు, శాండల్‌వుడ్‌కి చెందిన ఒక చిత్రం వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే కోలీవుడ్ మాత్రం ఇప్పటికీ వెయ్యి కోట్ల క్లబ్‌కి దూరంగానే ఉంది. ఇటీవల సూర్య నటించిన భారీ బడ్జెట్ మూవీ కంగువా విడుదలైంది. మేకర్స్ ఈ సినిమాను "కోలీవుడ్ బాహుబలి"గా పుష్ చేయడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. కానీ ఆ అంచనాలకు సినిమా అనుగుణంగా రాకపోవడంతో అది నిరాశనే మిగిల్చింది. ఇక ఆ తర్వాత అందరి దృష్టి రజనీకాంత్ %-% లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'కూలీ' మూవీపై పడింది. అగస్టు 14న పాన్ ఇండియా రేంజ్‌లో విడుదలైన ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాకు ముందస్తు బుకింగ్స్ అదిరిపోయే స్థాయిలో జరిగాయి. విడుదలకు ముందే వంద కోట్ల మార్క్ దాటి హైప్ క్రియేట్ చేసింది. అంతా కూడా ఇది కోలీవుడ్ మొదటి రూ.1000 కోట్ల మూవీ అవుతుంది అనే ఆశలతో ఉన్నారు. అయితే ఇప్పుడు పరిస్థితి తేడాగా మారింది. ట్రేడ్ అనలిస్టుల అంచనాల ప్రకారం 'కూలీ' బాక్సాఫీస్ కలెక్షన్లు రూ.500 నుంచి రూ.600 కోట్లు మధ్యే ఆగే అవకాశం కనిపిస్తోంది. రూ.1000 కోట్ల టార్గెట్ సాధించడం చాలా కష్టమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ స్థాయి విజయాన్ని సాధించాలంటే కేవలం తమిళనాడు మార్కెట్‌తో సరిపోదు. హిందీ మార్కెట్‌లో బలమైన అడుగు వేసేలా, అన్ని భాషల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే కంటెంట్ అవసరం. బాహుబలి, ఆర్ఆర్ఆర్, కేజీఎఫ్, కల్కి సినిమాలు ఈ స్థాయిలో పాన్ ఇండియా లెవెల్‌లో రెస్పాన్స్ అందుకున్నాయి. కానీ కోలీవుడ్ ప్రాజెక్టులు ఇప్పటివరకు ఆ రేంజ్ రీచ్ కాలేకపోయాయి. ప్రస్తుతం 'కూలీ'పై ఆశలు తగ్గిపోవడంతో, కోలీవుడ్ సినిమా పరిశ్రమకు వెయ్యి కోట్ల క్లబ్‌కి సంబంధించిన కల ఇంకా కలగానే మిగిలిపోతుందా అనే సందేహాలు నెలకొన్నాయి.

## సచిన్ తొలి శతకానికి 35 ఏళ్లు



**ముంబై-నవభూమి** సచిన్ టెండూల్కర్..24 ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో నెలకొల్పిన రికార్డులు ఎన్నో..అందుకున్న ఘనతలు మరెన్నో.. 664 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 34,357 పరుగులు, 100 సెంచరీలు. ఈ శతకాలకు పునాది పడింది 35 ఏళ్ల కిందట..1990 ఆగస్టు 14న ఓల్డ్‌ట్రాఫర్డ్ మైదానంలో. తొలి సెంచరీ ఏ క్రికెటర్‌కైనా ఎంతో అపురూపం. పైగా..ఆ శతకం జట్టును ఓటమి కోరలనుంచి తప్పించినదైతే ఆ థ్రిల్లే వేరు కదా! ఇంగ్లండ్‌తో మూడు టెస్ట్‌ల సిరీసలో భాగంగా ఓల్డ్‌ట్రాఫోర్డ్ రెండో టెస్ట్‌కు వేదికైంది. ఆ టెస్ట్ సచిన్‌కు తొమ్మిదవది. ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 68 పరుగులు చేసిన 17 ఏళ్ల టెండూల్కర్..408 పరుగుల లక్ష్యంతో చివరి రోజు 103/4తో జట్టు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దశలో ఆరో నెంబర్‌లో క్రీజులోకి వచ్చాడు. బంతి రివ్వుమని దూసుకొస్తూ బ్యాటర్లకు దడ పుట్టిస్తోంది. ఈ తరుణంలో దుర్భేద్యమైన డిఫెన్స్ ఆటతో ఇంగ్లండ్ బౌలర్లకు ఎదురొడ్డాడు. ఓ పక్క సహచరులు అవుటవుతున్నా వెరవలేదు. చూడముచ్చటైన బౌండరీలతో ఆకట్టుకొని సెంచరీ సాధించిన సచిన్ (189 బంతుల్లో 17 ఫోర్లతో 119 నాటౌట్) మనోజ్ ప్రభాకర్ (67 నాటౌట్) జతగా మ్యాచ్‌ను డ్రా (343/6) చేయగలిగాడు.

## 45 ఏళ్ల వీనస‌కు వైల్డ్‌కార్డ్



**న్యూయార్క్ -నవభూమి:** లేటు వయసులో యూఎస్ ఓపెన్ సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న ప్లేయర్‌గా అమెరికా వెటరన్ వీనస్ విలియమ్స్ (45) రికార్డులకెక్కింది. ఈ నెల 24 నుంచి జరగనున్న యూఎస్ ఓపెన్‌కు సంబంధించిన వైల్డ్‌కార్డ్ ఎంట్రీలను నిర్వాహకులు ప్రకటించారు. రెండేళ్ల విరామం తర్వాత వీనస్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో 1981లో రెనీ రిచర్డ్స్ (47) తర్వాత సింగిల్స్ వైల్డ్‌కార్డ్ అందుకొన్న పెద్ద వయసు ప్లేయర్‌గా విలియమ్స్ నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత సంతతికి చెందిన అమెరికా ఆటగాడు నిశేష్ బసవారెడ్డి (20)కి కూడా వైల్డ్‌కార్డ్ లభించింది. నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తండ్రి...మురళీకృష్ణ 1999లో అమెరికా వెళ్లి స్థిరపడ్డారు.

నవక్రీడ

## నా శిష్యుల్లో కోహ్లీ బెస్ట్



**న్యూఢిల్లీ-నవభూమి:** తాను శిక్షణ ఇచ్చిన టీమిండియా ఆటగాళ్లలో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ప్లేయర్ అని రవిశాస్త్రి ప్రశంసించాడు. 2017-2021 వరకు భారత జట్టు కోచ్‌గా శాస్త్రి వ్యవహరించాడు. కోహ్లీ అద్భుత ప్రదర్శన కారణంగానే తన హయాంలో భారత్ టెస్టుల్లో టాప్ టీమ్‌గా నిలిచిందని చెప్పాడు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లో కొన్ని మ్యాచ్‌ల్లో కోహ్లీ ప్రదర్శన నమ్మశక్యం కాని రీతిలో ఉందన్నాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత జట్టును నడిపించే నాయకత్వ లక్షణాలు కోహ్లీలోనే చూశానని తెలిపాడు. బ్యాటర్‌గా తన బాధ్యతలు నిర్వహిస్తూనే.. జట్టు గెలుపు కోసం తుదికంటా పోరాడేవాడని కితాబిచ్చాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**